ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: అమావాస్య రా. 12.15 వరకు; నక్షత్రం: శ్రవణం ఉ. 7.30 వరకు, అనంతరం ధనిష్ట; అమృతకాలం: రా. 10.05 నుండి 11.50 వరకు; వర్జ్యం: ఉ. 11.50 నుండి 1.35 వరకు; దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.58 వరకు, మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!



సంపుటి:56 • సంచిక:305 • గురువారం 15 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+12 • వెల:5.00 • Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు 11వేల కోట్లు కుచ్చుటోపీ..!





- వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ హస్తం?
- లావాదేవీలతో ఇతర బ్యాంకులకు నగదు
- విదేశాల్లో సొంత ఖాతాలకు బదలీ
- సీబీఐకి పిఎన్‌బి ఫిర్యాదు
- నీరవ్, ఆభరణాల కంపెనీపై అభియోగాలు
- బీఎస్‌ఈకి సమాచారం
- భయం వద్దు... ఆర్థిక శాఖ
- కేసు నమోదు.. దర్యాప్తు ముమ్మరం

3లో

ఒక వజ్రాల వ్యాపారి బంధు, మిత్ర, సపరివార సమేతంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.11,400 కోట్ల మేరకు కుచ్చుటోపీ పెట్టాడు. కేవలం 10రోజుల వ్యవధిలో అదే బ్యాంకును రెండు సార్లు మోసగించాడు. మొదట వందల కోట్లకు మోసగించిన డైమండ్ కింగ్ నీరవ్ మోడీ, రెండవసారి వేల కోట్ల రూపాయలకు బరితెగించాడు. ముంబైలోని ఒకానొక బ్రాంచ్‌లో గోల్‌మాల్ జరిగిందంటూ పిఎన్‌బి చేసిన ఫిర్యాదులతో సిబిఐ రంగంలోకి దిగింది. మోసపూరిత ఆర్థిక లావాదేవీలు జరిపిన నిందితులు సొమ్ము చేసుకున్న నగదును ఇతర బ్యాంకుల ద్వారా విదేశాల్లోని సొంత ఖాతాలకు బదిలీ చేసుకొని ఉంటారని పిఎన్‌బి గగ్గోలు పెడుతున్నది. అంతర్జాతీయంగా పేరుగడించిన నీరవ్ మోడీకి అన్ని రంగాల పెద్దల వద్ద మంచి పరపతి, పలుకుబడి ఉంది. కేంద్ర ఆర్థిక శాఖ మాత్రం పిఎన్‌బి ఆర్థిక కుంభకోణంపై కంగారుపడాల్సిన అవసరం లేదని అభయం ఇస్తున్నది.

మోడీ సంస్కరణలతో మైనింగ్ శాఖకు వెలుగులు



మైనింగ్‌పై రూపొందించిన సావనీర్ విడుదల చేస్తున్న కేంద్రమంత్రి తోమర్, గవర్నర్ నరసింహన్, మంత్రి కేటీఆర్

రూల్స్ పాటిస్తేనే సహకారం

మైనింగ్ సదస్సులో కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్

మైనింగ్ ఆదాయంలో తెలంగాణకు రూ.1300 కోట్లు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తీసుకుంటున్న సంస్కరణల వల్ల దేశంలో మైనింగ్ శాఖకు ఆదాయం బాగా పెరిగిందని కేంద్ర మైనింగ్, గ్రామీణాభివృద్ధి , పంచాయతిరాజ్ శాఖ మంత్రి నరేందర్ సింగ్ తోమర్ చెప్పారు. తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల రూ. 1.80 లక్షల కోట్ల విలువైనతవ్వకాలకు టెండర్లు పిలిస్తే రూ. 1.35 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని వెల్లడించారు. ఈ ఆదాయంలో తెలంగాణ రాష్ట్ర వాటాగా రూ. 13వందల కోట్లు ఇచ్చామని వెల్లడించారు. బుధవారం హైటెక్స్‌లో మైనింగ్ టుడే -2018 అంతర్జాతీయ సదస్సును రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, రాష్ట్ర మంత్రి కె తారకరామారావుతో కలిసి తోమర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మైనింగ్ విధానం, సవరణలతో తీసుకు వచ్చిన మైనింగ్ చట్టం, కేంద్రం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. దేశంలో 8 లక్షల కిలోమీటర్ల పరిధిలో తవ్వకాలు జరుగుతున్నాయని వెల్లడించారు. మైనింగ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్రా ల వాటాగా బదలీ చేస్తున్నామని, అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రా నికి 13 వందల కోట్లు విడుదల చేశామన్నారు. జిల్లా మైనింగ్ నిధి (డీఎంఎఫ్) ద్వారా వాటిని తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో వినియోగించాల్సి ఉంటుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్రాల వాటాల విడుదలలో కూడా కేంద్రం సానుకూలంగా ఉందన్నారు. 2014కి ముందు తవ్వకాలలో నిబంధనలు పాటించకపోవడంతో పారదర్శకంగా ప్రక్రియ జరిగేది కాదని,ఆదాయం కూడా అంతంత మాత్రంగానే ఉండేదని తమ ప్రభుత్వం తీసుకువచ్చిన మైనింగ్ విధానం, మైనింగ్ సవరణ చట్టం ,2015 ద్వారా ఖనిజాల అన్వేషణ, తవ్వకాలలో పారదర్శకత, జవాబుదారీ తనం పెరిగిందన్నారు. ఈ శాఖలో అవినీతికి పగ్గాలు వేశామని ఆన్‌లైన్‌లో టెండర్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. నిబంధనలు పాటించే రాష్ట్రాలకు కేంద్ర సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.మైనింగ్ రంగంలో తీసుకువచ్చిన సంస్కరణలు దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. జీడీపీ రేటు పెరగడం వెనుక మైనింగ్ రంగం కూడా ఉందన్నారు. వ్యవసాయం తర్వాతా మైనింగ్ రంగం ద్వారానే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తోందని చెప్పారు. అంతర్జాతీయ మైనింగ్ సదస్సు గతంలో చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో జరిగాయని, హైదరాబాద్‌లో మూడో సదస్సు జరుగుతుందని కేంద్ర మంత్రి చెప్పారు. ఈ సదస్సులో చేసే సిఫారసుల అమలును కేంద్రం పరిశీలిస్తుందని తోమర్ అన్నారు. రాష్ట్రంలోని మూడు క్షేత్రాలలో మైనింగ్ ప్రారంభించే ప్రక్రియ ను వేగవంతం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్రాలు కలిసి పని చేస్తేనే ఈ రంగం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి కె తారకరామారావు హార్డ్ వర్కర్ ... కష్టపడి పని చేస్తారని కితాబిచ్చారు.

ఖనిజాల అన్వేషణ... తవ్వకాల్లో డ్రోన్ టెక్నాలజీ

- గనుల్లో కార్మికుల రక్షణకు సాంకేతికత వినియోగం
- గ్రానైట్ పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకున్నాం
- అత్యుత్తమ కొత్త సాండ్ పాలసీ తీసుకొచ్చాం
- టీఎస్-ఐపాస్ ద్వారా మైనింగ్‌లో పెట్టుబడుల ఆకర్షణ
- ఖమ్మంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సహకరించండి
- మైనింగ్ టుడే సదస్సులో మంత్రి కేటీఆర్

2లో



వాటాకు పట్టు!

బ్రిజేష్ కేటాయింపుల తర్వాతే బోర్డులకు అధికారాలు

- పోలవరం బ్యాక్ వాటర్‌తో భద్రాద్రి జిల్లాకు ప్రమాదం
- అథారిటీ అధ్యయనం చేసేలా కేంద్రంపై ఒత్తిడి
- తెలంగాణ నిర్ణయం
- నేడు ఢిల్లీలో సీడబ్ల్యూసీ కీలక సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ పోరాడాలని నిర్ణయించింది. కృష్ణా, గోదావరి జలాల్లో న్యాయమైన వాటా కోసం గట్టిగా పట్టుబట్టనుంది. తెలంగాణ రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా వాదనలు వినిపించేందుకు సమాయత్తమైంది. ఇదే క్రమంలో ఎపి జలదోపిడీని, న్యాయంగా పెరగాల్సిన వాటాను ప్రస్తావించాలని నిర్ణయించింది. పోలవరం బ్యాక్‌వాటర్‌తో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు భారజల కర్మాగారానికి, మణుగూరు గనులకు , భద్రాద్రి సీతారామాలయానికి ముంపు సమస్య ఉందని.. ఈ సమస్య అధ్యయనానికి కేంద్రంపై ఒత్తిడి తీసుకురానుంది. ఢిల్లీలో గురువారం జలమంత్రిత్వశాఖ అధికారులతో కృష్ణా, గోదావరి బోర్డుల యాజమాన్యాలతో కీలక సమావేశం జరగనున్న నేపథ్యంలో ఎలాంటి వైఖరి అనుసరించాలి.. ఏఏ అంశాలు ప్రస్తావించాలి అన్న అంశాలపై మంత్రి హరీష్‌రావు, నీటిపారుదల శాఖ 3వ పేజీలో...

మోడీ పన్ను.. ట్రంప్ ఫైర్!

- హార్లీ డేవిడ్‌సన్ బైకులపై భారత్ సుంకం విధింపు
- ప్రధాని మోడీపై అమెరికా అధ్యక్షుడు వ్యంగ్యాస్త్రాలు
- ఇలాగైతే మేమూ పన్నులేస్తాం



వాషింగ్టన్: భారతదేశం హార్లీ-డేవిడ్‌సన్ మోటార్‌సైకిళ్ళపై దిగుమతి సుంకాన్ని అధికంగా మోపుతున్నదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విమర్శించారు. ఇది ఇలాగే కొనసాగిన పక్షంలో అమెరికా దేశానికి వేలాదిగా వస్తున్న భారతీయ మోటార్‌సైకిళ్ళపై దిగుమతి సుంకం పెంచుతామని బెదిరించారు. డోనాల్డ్ ట్రంప్ ఉక్కు పరిశ్రమపై కాంగ్రెస్ సభ్యులతో చర్చ చేపట్టిన సందర్భంగా దిగుమతి సుంకాన్ని 75 శాతం నుంచి 50 శాతానికి తగ్గిస్తూ భారత ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావించారు. అది సరిపోదని అన్నారు. అమెరికా తరహాలో మోటార్ సైకిళ్ళపై దిగుమతి సుంకం విధించరాదని ట్రంప్ సూచించారు మనకు చాలా దేశాలున్నాయి. మనం ఒక ఉత్పత్తి తయారు చేస్తాం. వారు ఒక ఉత్పత్తి తయారు చేస్తారు. వారు బ్రహ్మాండంగా చెల్లిస్తారు. మోటార్ సైకిళ్ళు వారి దేశాల్లోకి వెళ్ళడానికి మనం భారీగా పన్ను 3వ పేజీలో...

ఉద్యోగాల మేళా

త్వరలో 463 గణాంకాధికారుల పోస్టుల భర్తీ



- నేడో రేపో నోటిఫికేషన్
- సిద్ధిపేట మెడికల్ కాలేజీలో 931 పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో మరో 463 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసేందుకు ఆర్థికశాఖ సన్నాహాలు చేస్తోంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆధ్వర్యంలో ఈ పోస్టుల భర్తీకి ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడగలవని భావిస్తున్నారు. 463 గణాంకాధికారుల (స్టాటిస్టికల్ ఆఫీసర్స్) ఖాళీల భర్తీకి ఈ ప్రకటన వెలువడనుంది. రెవెన్యూ డివిజన్, జిల్లా స్థాయిలో ఖాళీలు భారీగా ఉండడంతో ప్రభుత్వం ఈ పోస్టులను వెనువెంటనే భర్తీ చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో 584 మండలాలు 3వ పేజీలో...



ప్రతిష్టాత్మక పథకాలకు ప్రత్యేక నిధులు

ప్రధానితో నేడు కేసీఆర్ భేటీ?

కేంద్ర సహకారం కోసం స్వయంగా రంగంలోకి ముఖ్యమంత్రి

- నివేదికలతో ఢిల్లీకి సీఎస్
- అరుణ్ జైట్లీతో సహా పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కేసీఆర్ హస్తినలో కేంద్రంతో దౌత్య చర్చలకు తెరతీశారు. రాష్ట్ర ప్రయోజనాలతో ముడిపడిన అనేక అంశాల పరిష్కారంలో కేంద్ర సహకారం కోసం ఆయనే స్వయంగా రంగంలోకి దిగారు. వారం రోజులుగా ఢిల్లీలో మకాం వేసిన ఆయన తనదైన శైలిలో ఉన్నతాధికారులతో సమాలోచనలు జరిపారు. కొన్ని రంగాల్లో రాష్ట్రానికి రావాల్సిన అదనపు నిధులను రాబట్టడంలో తనపార్టీ ఎంపీల ద్వారా చేస్తున్న ప్రయత్నాలు నిరాశాజనకంగా ఉండడంతో స్వయంగా తానే రంగంలోకి దిగారు. కేంద్ర ప్రతిపాదిత పథకాలతో పాటు తెలంగాణాలో ప్రతిష్టాత్మకంగా, పొరుగు రాష్ట్రాలకు ఆదర్శవంతంగా అమలు చేస్తున్న పథకాలకు అదనపు నిధులు పొందాలన్న వ్యూహంతో ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి పలు సందర్భాల్లో ప్రధాని నరేంద్రమోడితో పాటు పలువురు కేంద్ర మంత్రులు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను గుర్తుచేసి అవి అమలయ్యే విధంగా ప్రత్యేక చొరవ చూపుతున్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత లేకపోవడం, గడిచిన మూడేళ్ళుగా కేంద్రం ద్వారా రావాల్సిన పెండింగ్ నిధులను పూర్తిగా విడుదల చేయకపోవడం, విభజన హామీలతో పాటు కొన్ని జాతీయ సంస్థల మంజూరు 2వ పేజీలో...

ఔరా...!



డిజిటల్ పాలనకు కసరత్తు

ఈ-ఫైలింగ్!

- ప్రతి దస్త్రానికి బార్ కోడింగ్
- సచివాలయంలో కమాండ్ కంట్రోల్ సిస్టమ్
- అధికారులకు స్మార్ట్ ఫోన్లు
- పోలీస్ కంట్రోల్ రూంకు అనుసంధానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పాలనను పరుగులు పెట్టించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో కొత్తగా పాలనలో ఈ-ఫైలింగ్ విధానానికి శ్రీకారం చుట్టాలని సంకల్పించింది. ఇందుకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సత్వరమే అందుబాటులోకి తీసుకురావాలని 3వ పేజీలో...



ఆక్టోపస్‌కు అధునాతన ఆయుధాలు

- జర్మనీలో తయారైన పీఎన్‌జీఐఏ-1 వెపన్స్
- కిలోమీటర్ దూరంలోనే శత్రువును మట్టుబెట్టొచ్చు
- ఎన్ఎస్‌జీ తర్వాత ఆక్టోపస్ బలగాలకే

2లో

ఖనిజాల అన్వేషణ.. తవ్వకాల్లో

డ్రోన్ టెక్నాలజీ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: రాష్ట్ర డైనమిక్ సీఎం కె చంద్రశేఖరరావు తీసుకుంటున్న చర్యల మూలంగా మైనింగ్ రెవెన్యూ పెరుగుతోందని రాష్ట్ర మైనింగ్, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారకరామారావు చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉందన్నారు. బుధవారం హైటెక్స్‌లో మైనింగ్ టుడే -2018 మైనింగ్ అంత ర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి ప్రసం గించారు. మైనింగ్ రంగంలో డ్రోన్ టెక్నాలజీని వినియో గించనున్నట్లు వెల్లడించారు. డ్రోన్ టెక్నాలజీతో పాటు గనుల చుట్టూ జియో ఫెన్సింగ్, జియో ట్యాగింగ్, ఆర్ఎఫ్ఐడి టెక్నాలజీని వినియోగించనున్నామని తెలిపారు.వీటివల్ల మైనింగ్ ఆక్రమణలు తగ్గుతాయని తెలిపారు. తెలంగాణలో బొగ్గు, ఉక్కు, ఐరన్ ఓర్, గ్రానైట్ తదితర గనులు విస్తారంగా ఉన్నాయని, ఈ విషయం గుర్తించిన తమ ప్రభుత్వం మైనింగ్ రంగంలో అనేక మార్పులను తీసుకువచ్చినట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానించి పారదర్శకంగా వాటిని కేటాయిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ఉన్న గనులను గుర్తించి వాటి తవ్వకాల కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర విభజన చట్టం ,2014 లో పొందుపర్చిన విధంగా ఖమ్మం జిల్లా బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కేటీఆర్ కోరారు. ఉక్కు కర్మాగారం ఏర్పాటుకై గతంలో ప్రధానమంత్రితో పాటు ఆర్థిక మంత్రి ఇతరులను కూడా కలిసి విన్నవించామని, 2018 -19 బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించే సందర్భంగా కూడా కేంద్రానికి విజ్ఞప్తిచేశామని, అయినప్పటికీ మంజూరు కాలేదని కేంద్ర మంత్రి దృష్టికి కేటీఆర్ తెచ్చారు.బయ్యారంలో స్టీలు ప్లాంట్‌కు అవసరమైన రైలు మార్గం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 2 కోట్ల రూపాయలు కూడా విడుదల చేసిందని గుర్తు చేశారు. మైనింగ్ రంగంలో తీసుకువచ్చిన సంస్కరణల మూలంగా 2016 -17 లో రూ. 3,170 కోట్లు, 2017-18 లో 30 శాతం అధికంగా రూ. 3,500 కోట్లు ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆశిస్తున్నామని తెలిపారు. 2018-19 లో మరింత రెవెన్యూ పెరుగుతుందన్న ఆశాభావాన్ని కేటీఆర్ వ్యక్తం చేశారు. కేంద్రం వాటాగా రాష్ట్రా నికి రూ. 1378 కోట్లు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. ఇసుక విధానం, టీఎస్ ఐపాస్‌ను గూర్చి వివరించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా నూతన పారిశ్రామిక విధానం ద్వారా పరిశ్రమలు ఆకర్శిస్తున్నామని చెప్పారు. ఇసుక క్రయ, విక్రయాలకు సంబంధించి అత్యుత్తమ విధానం తీసుకువచ్చామని తెలిపారు. ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే ఇసుక ఇంటికి చేరుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. అందుకు సంబంధించి ఒక నంబర్‌ను కూడా పెట్టామని కేటీఆర్ పేర్కొన్నారు. దక్షిణభారత దేశంలోనే ఎక్కువగా గనులు ఉన్నాయని చెప్పారు.



తవ్వకాలలో పని చేస్తున్న వారిని పట్టించుకుంటున్నామా ?: గవర్నర్

మైనింగ్ రంగం ద్వారా ఆదాయం బాగా గడిస్తున్న ప్పటికీ, ఆ రంగంలో పని చేస్తున్న వారిని పట్టించు కుంటున్నామా ?అని ఉమ్మడి రాష్ట్రా ల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ప్రశ్నించారు. వారి ఆరోగ్యం, భద్రత, ఉపాధి కల్పనపై చర్యలు తీసుకుంటున్నామా ? అని గవర్నర్ ప్రశ్నలు కురిపించారు. డీఎంఎఫ్ అనేది అద్భుతమైన ప్రాజెక్టుగా ఆయన అభివర్ణించారు. అయితే, ఈ పథకం కింద జిల్లాలకు మంజూరైన నిధులను మైనింగ్ జరిగే ప్రాంతాలలో వినియోగిస్తే ఎన్నో ప్రయోజనాలు వస్తాయని వ్యాఖ్యానించారు. మైనింగ్ అక్షయపాత్రే కావచ్చు....కానీ ఈ రంగంలో పని చేస్తున్న వారి బాధలు ఒక్కో విధంగా ఉంటున్నా యని, తాను రాళ్లు కొట్టి ...కొట్టి ముసలి వాడినయ్యాను... కానీ, నిబంధనల మేరకు ఆదరణ లభించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. అంతేగాక పులన్నో...,ఎల్లన్నో... అడవులు, గిరిజన ప్రాంతాల్లో పని చేస్తారని అలాంటి వారిని పట్టించుకోవాల్సిన అవసరంఉందని గవర్నర్ చెప్పారు. వారి పునరావాస, పునర్నిర్మాణ చర్యల్లో వేగం పెంచాలన్నారు. పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న వారిని శిక్షిస్తున్నామా ? దేశ ప్రజలు, సంక్షేమం కోసం అలాంటి వారిని శిక్షించాలని గవర్నర్ కోరారు. ఎర్యావరణ పరిరక్షణ అనేది పుస్తకాలకే పరిమితం కారాదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ రంగంలో సాంకేతికంగా తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. ఆరోగ్యం మహాభాగ్యమని, సంపద అని అంటామని , సంపద ఉంటే ఆరోగ్యం కూడా ఆరోగ్యం ఉంటుందనే విషయ సరికాదనే విషయాన్ని గమనించాలని కోరారు. హెల్త్ ఈజ్ వెల్త్ బట్.. నెగ్లెట్ చేస్తే .....వెల్త్ ఈజ్ నాట్ హెల్త్ అని నరసింహన్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మైనింగ్ శాఖ బ్రోచర్‌ను గవర్నర్, కేంద్ర మైనింగ్, పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్‌తోమర్, కేటీఆర్ తదితరులు ఆవిష్కరించారు. ఈసదస్సులో కేంద్ర మైనింగ్ శాఖ కార్యదర్శి అరుణ్‌కుమార్, రాష్ట్ర మైనింగ్ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, అంతర్జాతీయ సదస్సు చైర్మన్ సుశీల్‌కుమార్, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరిసుభాష్‌రెడ్డి, భారత మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ చైర్మన్ ఎకె కోటారి, ఫిక్కీ డైరెక్టర్ దిలిప్ చెనాయ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సదస్సు ఈ నెల 17 న ముగుస్తుంది.

గ్రామీణ ఉపాధి కల్పనకు

ఎన్ఐఆర్డీ విశేష కృషి

- కేంద్ర మంత్రి తోమర్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : గ్రామీణ ఉపాధి కల్పనను పెంపొం దించడంలో ఎన్ఐఆర్డీ విశేష కృషి చేస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి నరేందర్ సింగ్ తోమర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన రాజేంద్ర నగర్‌లోని ఎన్ఐఆర్డీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాంగణంలో ఉన్న సాంకేతిక యూనిట్లను పరిశీలించారు. మట్టి ఇటుకల తయారీ, వేపనూనె, కేకు, గృహోపకరాల తయారీ, అల్లికలతో కూడిన వాటిని ఆయన ఆసక్తిగా గమనించారు. పుట్టగొడుగుల పెంపకం, చేతితో తయారు చేసే ఉత్పత్తుల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. పర్యావరణానికి హానిచేయని విధంగా తయారు చేసిన మోడల్ హౌస్‌లను ఆయన సందర్శించారు. ది మడ్ మ్యాటర్ పేరుతో రూపొందించిన సీడీని ఆయన ఆవిష్కరించారు. సూర్యమిత్ర కింద శిక్షణ పొందు తున్న అభ్యర్థులను సౌరశక్తికి సంబంధించిన తయారీ విధివిధానాలను ఆయన అడిగి తెలుసు కున్నారు. దీనివల్ల దేశవ్యాప్తంగా సౌరశక్తి వినియోగిం చుకోవచ్చన్నారు.



కేంద్ర మాజీ మంత్రి బోళ్ల బుల్లిరామయ్య మృతి

తణుకు, ప్రభ న్యూస్: ప్రముఖ పారిశ్రామికవేత్త, కేంద్ర మాజీ మంత్రి బోళ్ల బుల్లిరామయ్య(91) బుధవారం ఉదయం తణుకులో ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన ఆంధ్రా విశ్వవిద్యాలయం బిఎస్‌సి(సుగర్ టెక్నాలజీ), ఎంఎస్సీ (కెమికల్ టెక్నాలజీ) పూర్తి చేశారు. 1953లో ఆంధ్రాసుగర్‌లో టెక్నికల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా చేరారు. అనంతరం సంస్థ అభివృద్ధి, విస్తరణలో కీలక పాత్ర వహించారు. సుగర్ పరిశ్రమను అభివృద్ధి చేయడంతో పాటు అనేక పరిశ్రమలు స్థాపించి వేల మంది కార్మికులకు ఉపాధి కలిపించారు. ఇస్రో పరిశోధనా కేంద్రంలో రాకెట్ ఇంధనం సరఫరా చేసే పరిశ్రమను తణుకులో స్థాపించి తణుకు పట్టణానికి ప్రపంచ పటంలో మంచి గుర్తింపు తెచ్చారు. 2011 నుంచి ఆంధ్రాసుగర్స్‌కు మానేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి 7 సార్లు ఎంపిగా పోటీ చేసి 4 సార్లు గెలుపొందారు. కేంద్ర వాణిజ్య మంత్రిగా పనిచేసిన సమయంలో ప్రపంచ వాణిజ్య సంస్థల్లో భారతదేశ వాణిజ్య ప్రయోజనాల సంరక్షణ కోసం వివిద దేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించారు. సాంకేతిక నిపుణునిగా, పారిశ్రామికవేత్తగా అపార అనుభవాన్ని తన పదవీ బాధ్యల నిర్వహణలో తనదైన శైలితో వ్యవహరించేవారు.

చంద్రబాబు నివాళి....

తణుకులో బోళ్ల బుల్లిరామయ్య భౌతికకాయాన్ని ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం మధ్యాహ్నం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోళ్ల బుల్లిరామయ్య నన్నెంతో అభిమానించేవారని గుర్తు చేశారు.

వ్యవసాయం, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత

- భారీ నిధులు వీటికే..
- అనవసర ఖర్చులు, వృధా వ్యయ నియంత్రణ
- కొత్త సంస్కరణలకు బీజం
- భిన్నమైన రీతిలో బడ్జెట్ కూర్పు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాస్త విభిన్నంగా, వాస్తవికతకు దగ్గరగా...ఒక్కో పద్దుపై క్షుణ్ణంగా బడ్జెట్ సిద్దమవుతోంది. రూ. 1.85 లక్షలకోట్లనుంచి 1.95 లక్షల కోట్ల బడ్జెట్ కూర్పు దాదాపు పూర్తయింది. 18 శాతం ఆర్థిక వృద్ధిరేటు అంచనాలతో బడ్జెట్ సిద్ధమవుతోంది. శాఖల వారీగా సిద్దమైన తాజా ప్రతిపాదనలు, అంచనాలపై ముఖ్యమంత్రి ఈ వారంలో సమీక్షించనున్నారు. ఆ తర్వాత ఆయన ఆమోదంతో అంచనా ప్రతిపాదనలపై మార్గం సుగమమం కానుంది. శాఖలవారీగా ఆదాయం, ఖర్చులు, నిర్వహణా వ్యయాలు. వేతనాలు, బకాయిలు, బ్యాంకు ఖాతాలు, అద్దెలు వంటి అన్ని వివరాలను సేకరించి అందుకు అనుగుణంగా బడ్జెట్ కొత్త పంథాలో రూపొందుతోంది. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో జరుగుతున్న పనులు, పథకాలు, వాటి నిధులు, వ్యయాలు, ఇంక ఎంత కావాలి...ఎంత వరకు చెల్లించారు...పని జరిగి చెల్లించనివి ఎంత మొత్తం వంటి అన్ని వివరాలను సేకరించి మదింపు చేస్తోంది. శాఖల పరిధిలో వాహనాలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, వేతనాలు. వంటి వివరాలపై సమాచారం జోడించి మరీ కేటాయింపులను చేయనుంది. అదె విధంగా ప్రభుత్వ శాఖల బ్యాంకు ఖాతాలకు ప్రత్యేక విధానం రూపొందించాలని యోచిస్తోంది. అనవసర వ్యయాన్ని తగ్గిస్తూ....పాత పథకాలను, నిరుపయోగ పద్దులకు మంగళం పాడుతూ వాస్తవికతను ప్రతిబింభిం చనుంది. ఇందులో రాష్ట్ర సొంత వనరుల రాబడిని గతేడాదికంటే 15నుంచి 20శాతం అధికంగా అంచనాలను పొందుపర్చే అవకాశం కనిపిస్తోంది. సంపూర్ణ అవగాహనతో రూపొందిస్తున్న బడ్జెట్‌లో నిధులు, ప్రాధాన్యతలను గుర్తెరిగి నిధుల సమీకరణకు ప్రాధాన్యతనిచ్చారని సమాచారం. కేంద్రం కూడా ఎఫ్ఆర్‌బీఎం చట్టాన్ని 3.5 శాతానికి పెంచుకునేందుకు అనుమతించకపోవడంతో పెరిగిన వృద్ధిరేటు ఆధారంగా అదనంగా రూ. 2వేల కోట్లతో నిర్ధేశిత అవసరాలకు నిధుల సమీకరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తోంది. ఇందుకు అనుగుణంగానే బడ్జెట్ కేటాయింపులు, పద్దులు ప్రతిఫలించనున్నాయి.

ప్రణాళికా వ్యయం తగ్గింపు...

ప్రణాళికేతర వ్యయం తగ్గించడంతో తద్వారా ప్రణాళికేతర కేటాయింపులూ అదే మొత్తంలో తగ్గనున్నాయి. దీంతో మిగిలే మొత్తాలను ప్రణాళికా వ్యయంలో ప్రణాళికా పద్దులోకి మళ్లించే అవకాశం ఉంది. ప్రధానంగా ప్రణాళికేతర పద్దులో ఉద్యోగులు జీతభత్యాలు, ఫించన్లు, రాయితీలు, అప్పులపై వడ్డీ, నిర్వహణ ఖర్చులు వంటి తప్పనిసరి ఖర్చులు ఉంటాయి. ప్రజల సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయింపులు మొత్తం ప్రణాళికా పద్దులో కొనసాగుతాయి. ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించుకుని ప్రణాళికా వ్యయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వాలు భావిస్తాయి. కానీ అంత సుళువుగా అది సాధ్యం కాదు.

బడ్జెట్‌లో సాగుకు పెట్టుబడి సాయం పెద్ద పద్దుగా అవతరించనుంది. దాదాపు ఒక ఏడాదిలో ప్రభుత్వం ఖర్చు చేసిన రుణమాఫీ నిధులకు ఇది స్వల్పంగా మించిపోనుంది. వ్యవసాయ బడ్జెట్‌ను ఈ ఏడాది ప్రత్యేకంగా ప్రతిపాదించాలనే యోచన నేపథ్యంలో సాగుకు సాయం నిధులే రూ.12వేల కోట్లుగా ఉండనున్నట్లు సమాచారం. మే 15 నుంచి ఈ పథకం ప్రారంభం కానుంది.

గత జూన్‌లో వ్యవ సాయ శాఖ చేసిన సమగ్ర సర్వేలో రాష్ట్రంలో 1.23 కోట్ల ఎకరాల సాగుభూములు ఉన్నట్లుగా గుర్తించారు. అయితే ప్రభుత్వ అంచనా ప్రకారం ఇది 1.6కోట్ల ఎకరాలని ఉండగా తాజాగా రికార్డుల ప్రక్షాళనతో ఇది 1,42,12,816 ఎకరాలుగా తేల్చారు. భూ రికార్డుల ప్రక్షాళనతో అసలు రైతుల సంఖ్య తేలింది. వ్యవసాయ, రెవెన్యూ శాఖల రికార్డులు పరస్పర విరుద్దంగా ఉండటంతో భూ రికార్డుల ప్రక్షాళనే మేలని ముఖ్య మంత్రి భావించారు. ఎకరాకు రూ. 8వేల పెట్టుబడి సాయం పథకం అమలుకు వ్యవసాయ శాఖ నిర్వహించిన సర్వేలో అనేక వివరాలు బైటికి రాలేదు. ఐదెకరాల లోపు వారికే పెట్టుబడి సాయం అందుతున్న అపోహతో చాలా మంది తమకు ఐదెకరాలే ఉన్నట్లుగా అధికారులకు చెప్పారు. వ్యవసాయ శాఖ నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 1.23 కోట్ల ఎకరాలుగా నమోదైంది. గత లెక్కలతో పోల్చితే ఇది 30లక్షల ఎకరాలు తక్కువగా నమోదుకావడం విశేషం. రైతుల సంఖ్య కూడా 10 లక్షలు తగ్గినట్లుగా స్పష్టమైంది. ఉద్యానవన పంటల విస్తీర్ణం 4.4 లక్షల ఎకరాలు తగ్గగా, సాదాబైనామాలు, వివాదాస్పద భూముల లెక్కలు నమోదు చేయలేదని వ్యవసాయ శాఖ పేర్కొంది. కానీ ప్రభుత్వం గతంలో చెప్పినట్లుగా కొత్తగా లక్షలాది ఎకరాల వ్యవసాయ భూ విస్తీర్ణం పెరిగిందని, సాగునీటి వెసులుబాటును పెంచడంద్వారా భారీగా రైతుల సంఖ్య కూడా పెరిగిందని ప్రభుత్వం చెబుతూ వచ్చింది.

పెరిగిన కేంద్ర సాయం

మార్చి 12నుంచి కనీసం 16 దినాలు శాసనసభను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర సొంత వనరుల రాబడులు, పన్నేతర ఆదాయాలు, కేంద్ర గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాలను సమీక్షించుకుంటోంది. 2018-19 ఆర్థిక ఏడాదిలో కేంద్ర పన్నుల వాటా రూ.19,270 కోట్లుగా నిర్దేశజంచారు. సిసిఎస్‌కింద మరో రూ. 10 వేల కోట్లు వచ్చే అవకాశః ఉందని అంచనా వేస్తున్నారు. ఫ:నాన్స్ కమిషన్ నిధుల ద్వారా పంచాయతీలకు రూ. 1200కోట్లు, అర్బన్ లోకల్ బాడీలకు రూ. 600 కోట్లు రానున్నట్లు తెలిసింది. కేంద్ర వితరణ కింద వచ్చే నిధులను 2015-16లో రూ. 25223.49 కోట్లు అయితే 2017-18లో ఇవి రూ. 43,862కోట్లకు అంచనా వేశారు. ప్రారంభ నిల్వను రూ. 467కోట్లతో మొదలుపెట్టిన తెలంగాణ బడ్జెట్‌లో రెవెన్యూ రాబడులను రూ.1,13, 083.04 కోట్లుగా నిర్ధేశించింది.

ప్రధానితో నేడు కేసీఆర్ భేటీ?

(మొదటిపేజీ తరువాయి)

విషయంలో స్పష్టత రాకపోవడం లాంటి అనేక అంశాలపై గురువారం సీఎం కేసీఆర్ ప్రధాని, ఆర్థిక మంత్రులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికలతో రావాల్సిందిగా కేసీఆర్ ఆదేశించడంతో ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి బుధవారం సాయంత్రం హుటాహుటిన ఢిల్లీ బయలుదేరి వెళ్ళారు. పెండింగ్ ప్రతిపాదనలన్నింటిపై సీఎస్‌తో చర్చించి పరిష్కరించుకునే దిశగా ముందడుగు వేస్తున్నారు.

జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనను ఆమోదింపజేసుకోవడంతో పాటు ఇతర రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి ముఖ్యమంత్రి నరేంద్రమోడీతో చర్చించేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్రాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో కీలకమైనందున ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడుతోంది. శాశ్వత ప్రాతిపదికన ఇక్కడ తలపెడుతున్న ప్రతి ప్రాజెక్టుకు కేంద్రం ద్వారా సహకారం అవసరమవుతున్నందున కేంద్రంతో మమేకమై ఆశించిన ఫలితాలు సాధించుకునే దిశగా కేసీఆర్ ముందడుగు వేస్తున్నారు. కొత్త జిల్లాల విస్తీర్ణం, జనాభా, వనరులు, ఉద్యోగుల కేటాయింపు, ఈ క్రమంలో అవసరమయ్యే ఐఏఎస్, ఐపీఎస్ లాంటి కేంద్ర సర్వీసుల ఉద్యోగులు తదితర అంశాలపై చర్చిస్తారు. పరిపాలనా సౌలభ్యం కోసం చేపడుతున్న కొత్త జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తారు. కేంద్రంలో తీసుకున్న ప్రతి నిర్ణయానికి రాష్ట్రం తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందన్న సంకేతాన్నిస్తూనే, అదే సమయంలో రాష్ట్రాభివృద్ధికి సహకారం అందించాలన్న విషయాన్ని ప్రధాని మోడి ముందు స్పష్టం చేసే అవకాశాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత పథకాలన్నీ



రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్నామని, లక్ష్యాలను చేరుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్న విషయాన్ని స్పష్టం చేస్తారు.

కేంద్రం ఇతోధికంగా సహాయం అందిస్తే తప్ప కరువు నుంచి గట్టెక్కుతామన్న విషయాన్ని ఈ భేటీలో పునరుద్ఘాటించనున్నారు. గతంలో కరువు పీడిత ప్రాంతాల్లో చేపట్టిన తాత్కాలిక చర్యల్లో భాగంగా గ్రామాల్లో మంచినీటి సరఫరా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పశుగ్రాసం పంపిణీ, పిల్లలకు మధ్యాహ్నం భోజనం లాంటి కార్యక్రమాలు ప్రస్తుతం అమల్లో ఉన్నాయని, శాశ్వత చర్యల్లో భాగంగా రూరల్ మిషన్ భగీరథ, అర్బన్ మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ లాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ప్రారంభించామని కేంద్ర పెద్దలకు వివరించనున్నారు. తెలంగాణాలో సాధారణం కన్నా 14శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఫలితంగా కరువు తీవ్ర ప్రభావం చూపుతోందన్న విషయాన్ని తెలియజేస్తారు. గత ఏడాది ఏడు జిల్లాల్లో మొత్తం 231 మండలాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించడాన్ని, అందుకు గల కారణాలను వివరిస్తారు. వర్షాభావ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టానికి, ఇన్‌పుట్ సబ్సిడీ అందించడానికి, మంచినీటి పరఫరా, పశుగ్రాసం పంపిణీ చేయడానికి, వ్యవసాయ రంగంపై ఆదారపడిన వారికి తగిన ఉపాధి చూపాల్సిన ఆవశ్యకతపై చర్చిస్తారు.

కుల వృత్తులను నమ్ముకున్న వారికి ఉపాధి కల్పించడానికి రూ.3,064 కోట్లు మంజూరు చేయవలసిందిగా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పంపించిన ప్రతిపాదనలను గుర్తు చేస్తారు. ఈ పద్దు కింద ఇప్పటివరకు కేవలం రూ.712 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, మిగతా మొత్తాన్ని సాధ్యమైనంత త్వరలో విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తారని సీఎం కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. కరువు కారణంగా 13.52 లక్షల హెక్టార్లలో వివిధ పంటలకు నష్టం వాటిల్లిందనీ, 21.78 లక్షల మంది పీడిత రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్న విషయాన్ని గుర్తుచేస్తారు. పత్తి, మొక్కజొన్న, సోయాబిన్ లాంటి పంటలు భారీగా దెబ్బతిన్నాయని, 23,700 హెక్టార్లలో కూరగాయలు, బత్తాయి, పసుపు, మిరప లాంటి ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని సీఎం కేసీఆర్ ప్రధానికి వివరిస్తారు. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై నివేదిక అందించనున్న సీఎం 2017 పూర్తయ్యే నాటికే 90 శాతం లక్ష్యాలను నెరవేర్చేందుకు తీసుకుంటున్న చర్యలను నివేదించేందుకు సీఎం కేసీఆర్ సిద్ధమయ్యారు.

గొర్రెలను రక్షించుకుందాం

- వేసవి నేపథ్యంలో గడ్డి, తాగునీటికి ప్రత్యేక చర్యలు
- వచ్చే ఏడాది పంపిణీకి ఇప్పటి నుంచే కార్యాచరణ
- 90 శాతం సబ్సిడీపై గొర్రెల షెడ్లకు ప్రోత్సాహకాలు
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సబ్సిడీ గొర్రెల పథకంపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. ఈ పథకంలో పంపిణీ చేసిన గొర్రెలను సంరక్షించాల్సిన బాధ్యతను గుర్తుచేశారు. వచ్చే వేసవి నేపథ్యంలో గడ్డి, తాగునీటికి చర్యలు తీసుకోవాన్నారు. ఈ సందర్భంగా బుధవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, పశుసంవర్ధక, మత్స్యశాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పెరిగిన గొర్రెల సంఖ్యకు అనుగుణంగా రానున్న వేసవిలో గ్రాసం కొరత ఏర్పడకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. 87 లక్షల మెట్రిక్ టన్నుల పచ్చిమేత అవసరం కాగా, 82.51 టన్నుల గ్రాసం రాష్ట్రంలో అందుబాటులో ఉందని వివరించారు. అవసరమైన 4.52 లక్షల మెట్రిక్ టన్నుల పచ్చిమేత కోసం పెంపకందారులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలను పంపిణీ చేయడం ద్వారా ఆ కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పెంపకందారులు తమ సొంత భూములలో కూడా గడ్డి పెంపకాన్ని చేపట్టే విధంగా చైతన్యపరిచేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

చనిపోయిన గొర్రెల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెప్పించుకొని పరిహారం చెల్లించే విషయాన్ని నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ఇప్పటి వరకు 20,738 క్లెయిమ్‌లు సమర్పించగా, 10,141 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామాలలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 8,642 నీటి తొట్టిలు, 39,372 గొర్రెల షెడ్ల నిర్మాణానికి ప్రణాళికలను రూపొందించినట్లు వివరించారు. గొర్రెల షెడ్ల నిర్మాణానికి 90 శాతం సబ్సిడీపై లక్ష రూపాయల వరకు ఆర్థికసాయం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ ఏడాది 18 కోట్లకు ఉత్పత్తి సామర్థ్యం పెరిగిందన్నారు. దీనిని 25 కోట్లకు చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మత్స్యకారులు చేపల విక్రయాలు జరుపుకునేందుకు , 40 చేపల మార్కెట్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చినా, నేటివరకు 28 మార్కెట్లకు స్థల సేకరణ జరగలేదన్నారు. 2018-19 సంవత్సరంలో చేప పిల్లల విడుదల చేపట్టేందుకు మార్చి నెల నుండే టెండరు ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లాల వారీగా టార్గెట్లు విధించుకొని లక్ష్యాలను సాధించుకొనేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. చేపల పెంపకంలో ఆధునిక పరిజ్ఞానాన్ని తెలియజేసేందుకు మార్చి నెలలో హైదరాబాద్‌లో ఆక్వా ఎక్స్‌పో నిర్వహించడం జరుగుతుందని, ఈ ఎక్స్‌పోకు 25 దేశాల నుంచి ప్రతినిధులు వస్తారని ఆయన వివరించారు. మత్స్యకారులు ఈ ఎక్స్‌పోను సందర్శించేలా అవగాహన కల్పించాలని తలసాని సూచించారు.



జర్మనీ: 1945లో డ్రెస్‌డెన్ పేలుళ్లలో మృతులకు నివాళులు అర్పిస్తున్న ప్రజలు



ముంబై: 'ఎగ్జావమ్ వారియర్స్' పుస్తకాన్ని విద్యార్థులకు అందిస్తున్న మహా సీఎం సతీమణి అమృత



వాషింగ్టన్: డాలర్ షీట్లను కరెన్సీనోట్లుగా చేస్తున్న దృశ్యం (15 నవంబర్ 2017 నాటి ఫైల్ ఫొటో..)

రూ.11,400 కోట్లు కుచ్చు టోపీ

- పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ కుంభకోణం
- వజ్రాల రారాజు నీరవ్ మోడీ హస్తం
- లావాదేవీలతో ఇతర బ్యాంకులకు నగదు
- విదేశాల్లో సొంత ఖాతాలకు బదిలీ
- సీబీఐకి పీఎన్‌బీ ఫిర్యాదు



న్యూఢిల్లీ: కోట్లకు పడగలెత్తిన వజ్రాల డిజైనర్ నీరవ్ మోడీ, ఒక ఆభరణాల కంపెనీతో కలిసి దాదాపు రూ.11,400 కోట్ల విలువైన మోస పూరిత లావాదేవీలకు పాల్పడ్డారని పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) అభియోగం మోపింది. ఈ మేరకు పిఎన్‌బీ నుంచి మంగళవారం తమకు రెండు ఫిర్యాదులు అందాయని సీబీఐ అధికారులు తెలిపారు. ఫిర్యాదులను రూఢీ చేసుకున్న అనంతరం నీరవ్ మోడీ, సదరు ఆభరణాల కంపెనీపై తగిన న్యాయపరమైన చర్య తీసుకుంటామని వారు వెల్లడించారు. అయితే ఇంతటి భారీ ఆర్థిక మోసంపై సీబీఐ భవిష్యత్ కార్యాచరణ ఏమిటనేది అధికారులు స్పష్టం చేయలేదు. నీరవ్ మోడీ రూపొందించే ఆభరణాలకు అంతర్జాతీయ సెలబ్రెటీల్లో ఎంతో పేరు ఉంది. ఒకానొక పిఎన్‌బి శాఖ వద్ద రూ.280 కోట్ల మేరకు మోస పూరితమైన లావాదేవీలకు పాల్పడ్డారనే అభియోగానికి సంబంధించి మోడీపై సీబీఐ దర్యాప్తు ప్రస్తుతం కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు. అయితే ఫిర్యాదుల్లో పేర్కొన్న ఆభరణాల కంపెనీ నీరవ్ మోడీకి సంబంధించినది లేనిదీ తెలియరాలేదు. ఆభరణాల కంపెనీ పేరును అధికారులు గోప్యంగా ఉంచారు. మోసపూరితంగా జరిగిన లావాదేవీలు దేనికి సంబంధించినవనే దానిపై సీబీఐ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

బీఎస్ఈకి సమాచారం

ముంబైలోని ఒకానొక శాఖలో 1771. 69 మిలియన్ డాలర్లకుపైగా విలువైన మోసపూరిత, అనధికృత లావాదేవీల గురించి బీఎస్ఈ స్టాక్ ఎక్స్చేంజ్‌కు కూడా బ్యాంక్ తెలియ పరిచింది. ఈ లావాదేవీలు ప్రాతి పది కగా ఇతర బ్యాంకులు విదేశాల్లో ఈ ఖాతాదారులకు నగదు బట్వాడా చేసినట్టు కనిపిస్తున్నదని బీఎస్ఈకి సమర్పించిన పత్రంలో వెల్లడించింది. కేసును పరిశీలించి నిందితులను అదుపులోకి తీసుకునే దిశగా ఈ మోసాన్ని దర్యాప్తు ఏజెన్సీలకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొంది.

10 రోజుల్లోనే రెండో మోసం

ఒక బ్యాంకు కేవలం 10 రోజుల్లోనే రెండు సార్లు మోసపోవడం భారతీయ బ్యాంకుల చరిత్రలో ఇదే తొలిసారి. 2017లో రూ.280.70 కోట్లుకు పైగా పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసగించారనే అభియోగంపై నీరవ్ మోడీ, ఆయన సోదరుడు నిశ్చల్, భార్య అమి, నీరవ్ వ్యాపార భాగస్వామి చినుభాయి చోస్కి లను సీబీఐ బుక్ చేసింది. వారంతా బ్యాంక్ అధికారులతో కలిసి మోసానికి పాల్పడి నష్టం చేకూర్చారంటూ పిఎన్‌బిచేసిన ఫిర్యాదుపై స్పందించిన సిబిఐ పై చర్య తీసుకుంది.

భయాందోళన వద్దు.. కేసు చేయి దాటిపోలేదు

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరిగిన రూ.11,300 కోట్ల విలువైన మోసపూరిత లావాదేవీలపై భయాందోళనలను పారద్రోలడానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. ఆర్థిక సేవల విభాగం సంయుక్త కార్యదర్శి లోక్ రాజన్ బుధవారం న్యూఢిల్లీలో మాట్లాడుతూ ఇది చేయి దాటి పోయిందని నేను భావించడంలేదు. ప్రస్తుతానికి ఇది పెద్దగా ఆందోళన చెందాల్సిన పనిలేదు అని అన్నారు.

నీరవ్ మోడీ.. డైమండ్ కింగ్

- బడి వదిలేసి.. బిజినెస్‌లోకి
- పిన్న వయస్సులోనే బిలియనీర్
- ఫోర్బ్స్ జాబితాలో చోటు
- న్యూయార్క్‌లో నీరవ్ స్టోర్
- ప్రియాంక బ్రాండ్ అంబాసిడర్



న్యూఢిల్లీ: ప్రస్తుతం పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభ కోణంలో ప్రముఖంగా వినిపిస్తున్న వజ్రాల వ్యాపారి కమ్ డిజైనర్ నీరవ్ మోడీ జీవన ప్రస్థానం అత్యంత ఆసక్తి కరమైనది. నీరవ్ మోడీ వజ్రాల వ్యాపారుల కుటుంబంలో జన్మించాడు. ప్రపంచానికి వజ్రాల రాజధానిగా పేరు గాంచిన బెల్జియంలోని యాంట్‌వెర్ప్‌లో పెరిగారు. అమెరికాలోని పెన్‌సిల్వేనియాలో వార్టసన్ స్కూల్‌లో విద్యాభ్యాసాన్ని మధ్యలోనే వదిలే శాడు. వజ్రాల వ్యాపారంలోకి రంగ ప్రవేశం చేశాడు. నీరవ్ తన మొట్టమొదటి స్టోర్‌ను 2014లో ఢిల్లీలో ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత ముంబైలో మరో దుకాణం నెలకొల్పాడు. ముంబైని తన కంపెనీకి ప్రధాన కేంద్రంగా చేసుకున్నాడు. 2016లో న్యూయార్క్ సమీపంలోని మ్యాడిసన్ స్క్వేర్ వద్ద ఒక స్టోర్‌ను అత్యంత అట్టహాసంగా ప్రారంభించాడు. స్టోర్ ప్రారంభ కార్యక్రమానికి హాలీవుడ్ యాక్టర్ నయోమి వాట్స్, బాలీవుడ్ నటీమణులు, మోడల్స్ లిసా హెడన్. నిర్మత్ కౌర్, టాప్ ఫ్యాషన్ మోడల్ కోకో రోచా హాజరయ్యారు. నీరవ్ ఆభరణాల డిజైన్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా వ్యవహరిస్తున్నారు. అతడు వజ్రాలను ఆభరణాలుగా మాత్రమే కాక పెట్టుబడిగా ప్రమోట్ చేస్తుంటాడు. ఫోర్బ్స్ పత్రిక భారత్‌లో అత్యంత పిన్నవయస్కుడైన బిలియనర్ అంటూ నీరవ్ మోడీని ఆకాశానికి ఎత్తేసింది. 2.3 బిలియన్ డాలర్ల విలువైన ఫైర్‌స్టర్ డైమండ్ కంపెనీకి ఆయన వ్యవస్థాపకుడు. ఆసియాలో చైనా నుంచి ఉత్తర అమెరికాలో హవాయి దీవుల దాకా నీరవ్ వ్యాపారం మూడు ఖండాలకు విస్తరించింది.

ఆయన 2013లో ఫోర్బ్స్ మిలియనీర్ల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. అప్పటి నుంచి అదే జాబితాలో తన స్థానాన్ని పదిలపరుచుకున్నాడు. 2016లో ప్రపంచంలో 1,067, భారత్‌లో 46వ ర్యాంకును నీరవ్ పొందాడు. అంతకు ఏడాది ముందు అంతర్జాతీయంగా 1,054, భారత్‌లో 82వ ర్యాంకును దక్కించుకున్నాడు.

నీరవ్ మోడీని ఫోర్బ్స్ పత్రిక 2016లో భారతదేశపు వజ్రాల రారాజుగా వర్ణించింది.

ఆయన మిగతా సెలబ్రెటీల తరహాలో ప్రజలకు అంత తేలిగ్గా కనిపించే సెలబ్రెటీ కాదు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఫిర్యాదుల మేరకు 10 రోజుల క్రితం సీబీఐ బుక్ చేసేంతవరకు సామాన్యులకు నీరవ్ మోడీ గురించి పెద్దగా తెలియదు. శక్తిమంతమైన వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలు, వజ్రాల కొనుగోలుదార్లకు నీరవ్ సుపరిచితుడు.

ప్రస్తుతం పిఎన్‌బిని మోసం చేశారనే అభియోగాలను ఆయన ఎదుర్కొంటున్నాడు. సీబీఐ మొదట దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో మోసపూరితంగా లావాదేవీల విలువ రూ.280 కోట్లు అని పేర్కొంది. గీతాంజలి బ్రాండ్ పేరుతో ఆభరణాలు, రత్నాభరణాల గొలుసుకట్టు దుకాణాలు నిర్వహిస్తున్న మోహుల్ చోస్కీ, నీరవ్ మోడీపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఇద్దరూ కలిసి రూ.280 కోట్ల మేరకు మోసం, ఫోర్జరీకి పాల్పడ్డారని ఆరోపిస్తూ పిఎన్‌బి చేసిన ఫిర్యాదుకు స్పందనగా సీబీఐ కేసు నమోదు చేసింది. కానీ ప్రస్తుతం ఆ లావాదేవీల విలువ రూ.10,000 కోట్లుగా ఆవిర్భవించింది.

మోసం కేసులో పిఎన్‌బి సీబీఐకి ఒక లిఖిత పూర్వక ఫిర్యాదు చేసిన రెండు రోజుల తర్వాత అంటే జనవరి 31న ఆదాయ పన్ను అధికారులు ఢిల్లీ, సూరత్, జైపూర్‌లోని నీరవ్ కార్యాలయాలపై దాడులు జరపడంతో నీరవ్ మోడీ ఎవరనేది ప్రజా బాహుళ్యానికి తెలిసివచ్చింది.



వాటాకు పట్టు!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నతాధికారుల ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. బ్రిజేష్ ట్రిబ్యునల్ ద్వారా ప్రాజెక్టుల వారీగా నీటికేటాయింపుల ప్రక్రియ అనంతరమే కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిని ఖరారుచేయాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరనుంది. పోలవరంకు కేంద్రజలసంఘం అనుమతి ఇచ్చిన తర్వాత నాగార్జునసాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలకు 45టిఎంసిల నీటిని వాడుకునే హక్కు బచావత్ అవార్డు ప్రకారం లభిస్తుందని.. కేంద్రమే ఈ ప్రాజెక్టు చేపట్టినందున నీటివాటా కేటాయింపుకు పట్టుబట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణాబేసిన్‌లో 36.45లక్షల హెక్టార్ల సాగుకు యోగ్యమైన భూములున్నా కేవలం 5.75లక్షల(15శాతం) హెక్టార్ల భూమికి మాత్రమే సాగునీరు అందుతోందని.. ఈ కొత్త కేటాయింపును సాగునీరు అందని ప్రాంతంలో వాడుతామని తెలంగాణ విన్నవించనుంది. రెండు రాష్ట్రాలకు కృష్ణాలో కేటాయించిన 811టిఎంసిలలో తెలంగాణకు 575టిఎంసిలు కేటాయించమని ఢిల్లీలో కేంద్రాన్ని కోరాలని మంత్రి హరీష్ అధికారులను ఆదేశించారు. రాజోలిబండ డైవర్షన్‌స్కీంద్వారా 15.9టిఎంసిలు నీరు రావాల్సి ఉన్నా, 4.56టిఎంసిలను మించి రావడం లేదు. ఆర్‌డిఎస్ కాలువల ఆధునీకరణపై 2004లో నిపుణుల కమిటీ చేసిన సూచనలు ఇప్పటికీ అమలుకాలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నీటివాడకం లెక్కగట్టేందుకు టెలిమెట్రీ స్టేషన్లు ఏర్పాటుచేయాలని 2016 జూన్‌లో కేంద్రజలవనరుల మంత్రిత్వశాఖ నిర్ణయించినప్పటికీ కెఆర్‌ఎంబి వాటిని అమలుచేయలేదని తెలంగాణ ఆగ్రహంగా ఉంది. టెలిమెట్రీ స్టేషన్ల ఏర్పాటులో జరుగుతున్న జాప్యం వల్ల పోతిరెడ్డిపాడు కింద అధికనీటిని కృష్ణాబేసిన్ అవతలకు అక్రమంగా తరలిస్తున్నట్లు హరీష్‌రావు ఆరోపించారు. సమీక్షలో ప్రభుత్వ సిఎస్ జోషి, ఇరిగేషన్ ప్రిన్సిపల్ కార్యదర్శి వికాస్‌రాజ్, ఈఎన్‌సిలు మురళీధర్, నాగేందర్‌రావు, సిఈలు సునిల్, ఖగేందర్‌రావు, లింగరాజు, హరిరామ్, బంగారయ్య, శంకర్, భగవంతరావు పాల్గొన్నారు.

పోలవరంతో ముంపుపై ఒత్తిడి తెద్దాం: హరీష్

తెలంగాణలోని చారిత్రక భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం సహా పలు గ్రామాలు, మణుగూరు భారజల కర్మాగారం, మణుగూరు సింగరేణిగనులు తదితర ముఖ్యప్రాంతాలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని మంత్రి హరీష్ అన్నారు. భద్రాచలం దాని చుట్టుపక్కల ప్రాంతంలో 124కిమీ మేర పోలవరం ప్రభావం ఉంటుందన్నారు. పోలవరం బ్యాక్‌వాటర్ వల్ల తలెత్తే సమస్యలు అధ్యయనం చేయాలంటూ పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. పోలవరం ముంపు సమస్యపై స్పష్టమైన ప్రకటన వచ్చేలా ఒత్తిడి వ్యూహం అవలంభించాలని నిర్ణయించారు.

త్వరలో 463 గణాంకాధికారుల

పోస్టుల భర్తీ

(మొదటిపేజీ తరువాయి)

ఉండగా, 463 మండలాల్లో గణాంకాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది. ఈ ఖాళీలతో పాటు రెవెన్యూ డివిజన్, జిల్లాస్థాయిలో ఉన్న ఖాళీలను కూడా భర్తీ చేయడానికి ప్రభుత్వం ఆర్థికపరమైన నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. కొత్తగా ఏర్పాటైన రెవెన్యూ డివిజన్లతో పాటు 21 జిల్లాల్లో గణాంకాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆర్థికశాఖ గుర్తించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించిన ఆర్థికశాఖ ఇందుకు ఎంతమేర భారం పడుతుందో అంచనా వేసే పనిలో నిమగ్నమై ఉంది. మండల, జిల్లాస్థాయిలో గణాంకాధికారుల ఖాళీలు ఉండడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వీటిని భర్తీ చేయాలని ఆర్థిక, పౌర సరఫరాలశాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఖాళీలు భర్తీ అయితే రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఫలితాలను గణాంకశాఖ సాధించగలుగుతుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. రెవెన్యూ డివిజన్ స్థాయిలో పనిచేస్తున ఉప గణాంకాధికార పోస్టుల్లో పనిచేస్తున్న వారికి గెజిటెడ్ హోదా కల్పించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. వీరికి గెజిటెడ్ హోదా ఇవ్వాలని తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఇదివరకే ప్రభుత్వాన్ని కోరింది. ఇందుకు సమ్మతించిన ఆర్థికశాఖ వీరికి గెజిటెడ్ హోదా కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసినట్టు చెబుతున్నారు.

సిద్దిపేట మెడికల్ కాలేజీ, ప్రభుత్వ వైద్య కళాశాలకు 931 పోస్టుల భర్తీకి అనుమతుల జారీ

సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల, మెడికల్ కాలేజీకి సంబంధించి 931 పోస్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేటలో మెడికల్ కాలేజీ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో పోస్టులను భర్తీ చేసుకోవడానికి అనుమతి ఇస్తూ ఆర్థిక శాఖ ప్రిన్సి పల్ సెక్రటరీ ఎన్.శివశంకర్ ఉత్తర్వులను జారీ చేశారు.

ఆక్టోపస్‌కు అధునాతన ఆయుధాలు

- జర్మన్ తయారీ వెపన్స్ రాక
- ఏపీకి 18, తెలంగాణకు 12 పీఎస్‌జీఐఎ1
- కి.మీ దూరంలో శత్రువును మట్టుబెట్టే సామర్థ్యం
- ఎన్ఎస్‌జీ తర్వాత ఆక్టోపస్ బలగాలకే



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర పోలీసు శాఖకు కలికితురాయిగా నిలిచిన ఆర్గనైజేషన్ ఫర్ కౌంటర్ టెర్రరిజన్ ఆపరేషన్స్ (ఆక్టోపస్)కు కొత్త ఆయుధాలు సమకూరాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిన ఆయుధాలు ఇటీవల అందాయి. మొత్తం 30 ఆయుధాలు జర్మన్ నుంచి దిగుమతి కాగా అందులో ఆంధ్రప్రదేశ్ ఆక్టోపస్‌కు 18, తెలంగాణ ఆక్టోపస్‌కు 12 లభించాయి.

తీవ్రవాదులు, ఉగ్రవాదుల దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టడం, ముష్కర మూకలను మట్టుబెట్టడం ఈ ఆక్టోపస్ ప్రత్యేకత. హైదరాబాద్ నగర శివార్లలోని ఇబ్రహీంపట్నంలోని ప్రత్యేక క్యాంపస్‌లో ఆక్టోపస్ సిబ్బందికి కఠోరమైన శిక్షణఇచ్చి ఏ క్షణంలో ఎలాంటి ఉపద్రవం ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉంచుతారు. కేంద్ర బలగాలలోని ఏ విభాగానికి లేని విధంగా ఈ ఆక్టోపస్‌కు ప్రత్యేక అధికారాలు కూడా ఉన్నాయి. జర్మన్ తయారీ ఆయుధాలు పిఎస్‌జిఐఎ1 అత్యంత ఆధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేశారు. దాదాపు కిలోమీటర్ దూరంలోని శత్రువును సులభంగా షూట్ చేయడం ఈ ఆయుధం ప్రత్యేకత. కేవలం 7.2 కిలోల బరువు కలిగిన ఈ ఆయుధం నిర్దేశిత లక్ష్యాన్ని ఛేదించడంలో తిరుగులేనిదని అధికారులు అంటున్నారు. ఈ ఆయుధాలను ఇటీవలే నేషనల్ సెక్యూరిటీ గార్డు (ఎన్ఎస్‌జి) సమకూర్చుకుందని, ఎన్ఎస్‌జి తర్వాత ఇవి ఆక్టోపస్‌కు మాత్రమే అందాయని అంటున్నారు. ఎన్ఎస్‌జి భద్రతను ప్రధాని, రాష్ట్రపతితో పాటు ఉగ్రవాదులు, తీవ్రవాదుల హిట్ లిస్ట్‌లో ఉన్న వారికి కల్పిస్తారు. అదే విధంగా కీలకమైన సమయాలలో ఈ సిబ్బందిని వినియోగిస్తుంటారు. గతంలో పార్లమెంట్‌పై ఉగ్రవాదుల దాడి, అక్షరధామ్‌పై దాడి, ముంబై దాడులు తదితర క్లిష్ట పరిస్థితులలో మాత్రమే ఎన్ఎస్‌జిని వినియోగించారు. ఎన్ఎస్‌జికి ధీటుగా ఆక్టోపస్ సేవలు కూడా కీలకం అవుతాయి.

కేవలం ఉగ్రవాదులు, తీవ్రవాదుల దాడులు, చర్యలను ప్రతిఘటించడం కోసం ప్రత్యేక శిక్షణతో తీర్చిదిద్దిన ఆక్టోపస్‌కు ఇప్పటికే పలు అధునాతన ఆయుధాలున్నాయి. ఆ అమ్ముల పొదిలోకి తాజాగా జర్మన్ తయారీ ఆయుధాలు కూడా చేరడంతో ఆ శాఖ మరింత బలోపేతమైంది. ఆక్టోపస్ వద్ద ఇప్పటికే యుఎస్ తయారీ 9 ఎంఎం కోల్ట్ ఎస్ఎంజి, జర్మన్ తయారీ ఎంపి 5 ఎస్‌డి, ఆస్ట్రేలియా తయారీ గ్లోక్ 19, ఇజ్రాయిల్ తయారీ కార్నర్ షాట్ (శత్రువు ఏ మూలన ఉన్నా గురితో వెళ్ళి మట్టుపెట్టే సామర్థ్యం కలిగిన ఆయుధం)తో పాటు సాధారణంగా వాడే ఆయుధాలు, ఎకె 47, ఎకె 57 లాంటి ఎన్నో ఆయుధాలున్నాయి. ఆక్టోపస్‌లో ఎంత మంది సిబ్బంది అనే విషయాలతో పాటు శిక్షణా తీరు ఎలా ఉంటుంది, ఏ విభాగంలో ఎంత మంది సుశిక్షితులనే వివరాలన్నింటినీ వెల్లడించడం సాధ్యం కాదని పేర్కొంటున్న అధికారులు ఎలాంటి విపత్తునైనా సమర్థవంతంగా తిప్పి కొట్టగలిగిన సుశిక్షితులున్నారని మాత్రం వెల్లడించారు.

మోడీ పన్ను.. ట్రంప్ ఫైర్!

(మొదటిపేజీ తరువాయి)

చెల్లిస్తున్నాం. హార్లీ డేవిడ్‌సన్ మోటార్‌సైకిళ్ళు ఒక దేశానికి వెళుతుంటాయి. అది భారత్‌లో జరుగుతున్న వాస్తవాన్ని నేను ప్రస్తావించజాలను అని సభికుల నవ్వుల మధ్య ట్రంప్ వ్యాఖ్యానించారు.

ఘనత వహించిన పెద్దమనిషి నుంచి ఫోన్

దీనికి సంబంధించి ప్రధాని నరేంద్ర మోడీతో ఇటీవల తాను జరిపిన సంభాషణను ఆయన పరోక్షంగా ప్రస్తావించారు.

మరేమో.. ఒకఘనత వహించిన పెద్ద మనిషి ఇండియా నుంచి నాకు ఫోన్ చేశారు. మేం ఇప్పుడే మోటార్‌సైకిళ్ళపై సుంకం తగ్గించాం. దానిని దాదాపు 100, 75 శాతం నుంచి 50 శాతానికి తగ్గించాము అని తెలిపారు అని అమెరికా అధ్యక్షుడు తెలిపారు. మీరు హార్లీ డేవిడ్‌సన్ తయారు చేస్తుంటే, మీ మోటార్ సైకిల్‌ను భారత్‌కు దిగుమతి చేయడానికి 50 నుంచి 75 శాతం సుంకం చెల్లించాలి. భారతదేశం అమెరికాకు వేలాది మోటార్ సైకిళ్ళను విక్రయిస్తుంటుంది. వాటిపై మనమెంత సుంకం విధిస్తామో తెలుసా? సున్నా అని తన కేబినెట్ సహచరులు, చట్టసభ సభ్యులతో ట్రంప్ అన్నారు.

భారత్‌ను తప్పుపట్టడంలేదు

అలాంటి సందర్భాల్లో పరస్పర పన్నులు ఉండాలి. నేనేమీ భారత్‌ను తప్పుపట్టడంలేదు. వారు దాన్నుంచి తప్పుకోవడాన్ని చాలా గొప్ప విషయంగా భావిస్తాను. ప్రజలు వారిని అలా ఎందుకు అనుమతిస్తున్నారో నాకు తెలియదు. కానీ ఇదొక అనుచితమైన నిదర్శనం.

పరస్పర పన్ను విధానంతో స్వేచ్ఛా వాణిజ్యం

అందుకే మనకు పరస్పర పన్ను విధానం ఉండాలి అని తెలిపారు. అప్పుడే అది హేతుబద్ధమైన వాణిజ్యమని అనిపించుకుంటుంది. దాన్నే స్వేచ్ఛా వాణిజ్యమని పిలుస్తారు. ఆ కారణంగా చివరికి ఏమవుతుందంటే అయితే వారు వసూలు చేస్తున్నదే మనమూ వసూలు చేస్తాం లేకుంటే మనలాగే వారు కూడా పన్ను విధింపునకు స్వస్తి చెబుతారు. అప్పుడది స్వేచ్ఛా వాణిజ్యం అవుతుంది అని ట్రంప్ వివరించారు.

ముగ్గురు గ్రూప్-1 అధికారులకు

సూపర్ న్యూమరీ హోదా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్రూప్-1 అధికారులుగా నేరుగా నియామకమై జిల్లాల్లో డిప్యూటీ కలెక్టర్లుగా శిక్షణ పొందుతున్న ముగ్గురు అధికారులకు సూపర్ న్యూమరీ పోస్టులను క్రియేట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లాలో శిక్షణలో ఉన్న ఆర్‌డి మాధురి, నల్గొండలో ఉన్న బి రోహిత్ సింగ్, మహబూబ్‌నగర్‌లో శిక్షణ పొందుతున్న పి బెన్ షాలోమ్‌లను సూపరీ న్యూమరీ పోస్టులను వర్తింపజేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి సూపర్ న్యూమరీ పోస్టుల క్యాడర్‌లోనే వేతనాలను ఇవ్వనున్నారు.



హ్యూస్టన్: టెక్సాస్ చిన్న పిల్లల ఆసుపత్రిలో అవిభక్త కవలలతో జిల్, మైఖేల్ రిచర్డ్ దంపతులు

డిజిటల్ పాలనకు కసరత్తు

ఈ-ఫైలింగ్!



(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించింది. ఈ బాధ్యతను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ తమ భుజస్కందాలపై వేసుకుంది. ఈ విధానం అమల్లోకి వస్తే దస్త్రాల పరిష్కారం త్వరితగతిన జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ-ఫైలింగ్ విధానంవల్ల సత్ఫలితాలు వస్తున్నాయని భావించిన ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేస్తోంది. ప్రజల ముంగిటకు అధికారాన్ని తీసుకువెళ్ళాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ పది జిల్లాలకు తోడుగా 21 జిల్లాలను కలిపి రాష్ట్రంలో 31 జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ-ఫైలింగ్ విధానం అమల్లోకి వస్తే సీఎంతో పాటు మంత్రులు, అధికారులకు వెసులు బాటు కలుగుతుందని కార్యాలయాల్లో గంటల తరబడి దస్త్రాలను పరిశీలించకుండా ఎక్కడుంటే అక్కడ అంతర్జాలం ద్వారా వాటిని పరిశీలించి ఆమోదముద్ర వేసే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో లెక్కకు మించి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ప్రభుత్వం కొత్తగా నూతన పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా నిధులను సక్రమ పద్ధతిలో ఖర్చు చేసే అవకాశం ఏర్పడుతుందని దీంతోపాటు లబ్ధిదారులకు పూరిస్థాయిలో న్యాయం జరుగు తుందన్న విశ్వాసంతో ప్రభుత్వం ఉన్నట్టు తెలు స్తోంది. ఆధునిక పద్ధతిలో దస్త్రాల పరిష్కారం చేయ డం ద్వారా ఏ దస్త్రం ఏ అధికారి దగ్గర ఉంది, ఆ దస్త్రం పరిశీలనకు ఆ అధికారి ఎన్ని రోజుల సమయం తీసుకుంటున్నారు? అక్కడి నుంచి ఆ దస్త్రం మంత్రి కార్యాలయానికి ఎప్పుడు వెళుతున్నది? మంత్రి కార్యాలయంలో దస్త్రాన్ని పరిశీలించి సదరు అమాత్యుని సంతకానికి ఎప్పుడు పంపిస్తున్నారు అన్నది తెలుస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న దస్త్రాల పరిశీలన ద్వారా అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని కొందరు అధికారులైతే అతి ముఖ్యమైన దస్త్రాలను ఇంటికి తీసుకువెళ్ళడంతో పాటు వాటిని జిరాక్స్ చేయించి తమ దగ్గర ఉంచుకుంటున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులందాయి. కొన్ని సమయాల్లో ఫైళ్ళను అధికారులు బయటకు తీసుకువెళ్ళి అప్పగిస్తున్నారని దీంతో ఆ ఫైలుతో సంబంధం ఉన్న వ్యక్తి ఆ ఫైలులో ఏం రాశారన్నది కూడా తెలుసుకోవడంతో పాటు అందుకు సంబంధించిన నకలు పత్రాలను సాధిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనివల్ల న్యాయపరమైన చిక్కులు తలెత్తుతున్నాయని కిందిస్థాయి అధికారి ఫైలుపై ఒక విధంగా రాస్తే ఆ ఫైలు మంత్రి, ముఖ్యమంత్రి దగ్గరకు వచ్చేసరికి నిర్ణయం మారిపోతుందని కిందిస్థాయిలో అనుకూలంగా ఫైలు రాయించుకుంటే పైస్థాయికి వచ్చేసరికి ఆ నిర్ణయం ప్రతికూలమై ఫైలును తిరిగి వెనక్కి పంపించిన దాఖలాలు కోకొల్లలని అంటున్నారు. ఈ-ఫైలింగ్ విధానం ప్రవేశపెట్టం ద్వారా ఇటువంటి అక్రమాలకు చరమగీతం పాడవచ్చన్న భావనతో ప్రభుత్వం ఉంది. ఆయా శాఖలకు వచ్చే ప్రతి ఫైలుకు బార్‌కోడింగ్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆన్‌లైన్‌లో సంబంధిత శాఖ లేదా విభాగంలో ఈ ఫైలు కోడ్‌ను టైప్‌చేస్తే ఆ ఫైలు ఎవరి దగ్గర ఉంది? ఎన్ని రోజుల్లో ఫైలు ప్రక్రియ సాగుతోందన్న విషయం తెలుస్తుందని ఐటి అధికారులు చెబుతున్నారు. ఎన్ని రోజులుగా ఫైలు పెండింగ్‌లో ఉందో ఆ విషయాన్ని తెలుసుకుని దస్త్రాన్ని ట్రాక్‌చేసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సీఎం, సీఎస్ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ కేంద్రాలు

పాలనను డిజిటల్ దిశగా తీసుకువెళ్ళాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న ప్రభుత్వం సీఎం అధికారిక నివాసం ప్రగతి భవన్‌తో పాటు సచివాలయంలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కలెక్టరేట్లు, జిల్లా కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యా లయాలను కమాండ్ కంట్రోల్ కేంద్రాలకు అనుసంధానం చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాలను నేరుగా ప్రగతి భవన్ నుంచే వీక్షించేందుకు ఈ కమాండ్ కంట్రోల్ దోహద పడుతుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా సచివాలయంలోని తన కార్యాల యం నుంచే కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించుకునే అవకాశం ఉంటుంది. ఈ ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని ప్రజలకు మెరుగైన పాలనను, సౌకర్యాలను అందజేయాలని ప్రభుత్వం సంకల్పిం చింది. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ విభాగాలను అనుసంధానం చేస్తే డాష్‌బోర్డు వ్యవస్థను అభివృద్ధి చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. హైదరా బాద్‌లో ఉన్న పోలింగ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని కూడా దీనికి అనుసంధానం చేయను న్నారు. ప్రగతి భవన్, సీఎస్ కార్యాలయాల్లో డిజిటల్ తెరలు ఏర్పా టుచేసి క్షేత్రస్థాయిలో జరుగుతున్న కార్యక్రమాలను నేరుగా వీక్షిస్తారు. ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకురావడానికే ముందే అన్ని స్థాయిల్లోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఇక్కడి మర్రిచెన్నారెడ్డి మానవ అభివృద్ధి సంస్థలో వారం రోజులపాటు అవగాహన కల్పిస్తారు. ఎలక్ట్రానిక్ పాలనకు వీలుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మొదలు మండలంలో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది వరకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి స్మార్ట్‌ఫోన్లను అందిస్తారు. అంతర్జాలం ద్వారా కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానంచేసి పాలనను సాగిస్తారు. ఈ నూతన విధానంపై ఇప్పటికే ఐటిశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ఇందుకోసం కొత్తగా సాఫ్ట్‌వేర్‌ను రూ పొందించడంతో పాటు అవసరమైన మౌలికసదు పాయాలను ఈ శాఖ కల్పిస్తోంది. కమాండ్ కంట్రోల్ కేంద్రాలు అందుబాటులోకి వస్తే ప్రతి సోమవారం ఆయా జిల్లాల కలెక్టర్లు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్య క్రమాన్ని సీఎం కేసీఆర్ నేరుగా వీక్షించడంతో పాటు ప్రజలతో ముఖాముఖి సమావేశమై వారి సమస్యలను ఆలకించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

పాలన కొత్త పుంతలు

త్వరలో సచివాలయంలో కమాండ్ కంట్రోల్ రూం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అన్ని రంగాల్లో అభివృద్ధి లక్ష్యాలను చేదించేందుకు కొత్త విధానాన్ని అవలంబిస్తున్న తెలంగాణ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేస్తోంది. త్వరలోనే రాష్ట్రంలో పరిపాలన కొత్త పుంతలు తొక్కనుంది. క్షేత్రస్థాయి అధికారుల నుంచి రాష్ట్రస్థాయి వరకు 'స్మార్ట్'గా పరిపాలన నిర్వహించేందుకు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు ఉన్నతాధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన శైలేంద్ర కుమార్ జోషి ఈ దిశగా సరికొత్త ప్రయత్నాలు ప్రారంభించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ తరహాలో సచివాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసేందుకు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్రంలో జరిగే పరిణామాలన్నీ ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు గ్రామస్థాయి వరకు ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు, వాటి అమలు తీరును పర్యవేక్షించేందుకు వీలుగా ఈ కంట్రోల్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తారు.

ఇందులో భాగంగా గ్రామస్థాయిలో మౌలిక సదుపాయాలు మొదలు రాష్ట్రస్థాయి వరకు ప్రతి సమాచారం అందుబాటులో ఉండేలా డేటాబేస్‌ను రూపొందిస్తున్నారు. తదుపరి ప్రక్రియలో గ్రామ, జిల్లాస్థాయి నుంచి ప్రజల సమస్యలు క్షేత్రస్థాయిలో పథకాల అమలు, ప్రభుత్వ పనితీరును సచివాలయం నుంచే ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తారు. నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, పనుల పురోగతి, నీటి నిల్వలు, నీటి విడుదల తదితర వివరాలన్నీ సచివాలయం నుంచేపర్యవేక్షించేవీలుంటుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా డిజిటల్ మానిటరింగ్ విధానంలో జిల్లాల కలెక్టరేట్లు, జిల్లాస్థాయి అధికారుల కార్యాలయాలను సచివాలయం నుంచే అనుసంధానిస్తారు. ఇంటిగ్రేటెడ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పేరుతో కొత్త పరిపాలన విధానానికి అవసరమైన పరిజ్ఞానాన్ని ప్రభుత్వం సమకూర్చుకుంటోంది.

స్మార్ట్ పరిపాలనలో భాగంగా అధికారులందరికీ స్మార్ట్‌ఫోన్లు, శాశ్వత సిమ్‌కార్డులు అందించనున్నారు. సీఎస్, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, అన్ని విభాగాల హెచ్‌వోడీలు మొదలు కలెక్టర్లు, జిల్లాల్లో అన్ని విభాగాల అధికారులందరూ ఒకే నెట్‌వర్క్‌లో ఉండేలా ఏర్పాట్లు చేశారు. అందరికీ ఐడియా సిమ్‌కార్డులను అందజేయాలని నిర్ణయించారు. 711 సిరీస్‌తో ఈ నంబర్లు ప్రారంభమవుతాయి. అధికారులు బదిలీపై వెళ్ళినా ఆ హోదాలో ఉన్న అధికారికి తిరిగి అదే నంబర్ ఉండేలా ఏర్పాట్లు చేస్తారు. దీంతో ప్రజలకు అధికారుల నంబర్లు తెలియడంతో పాటు ఎప్పటికప్పుడు సమాచారం పంచుకునే వీలుంటుందని భావిస్తున్నారు. వేగంగా సమాచార మార్పిడి జరిగేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించాలని నిర్ణయించారు. స్మార్ట్‌ఫోన్లను సచివాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానిస్తారు. అత్యవసరమైతే నేరుగా సీఎస్ సంబంధిత అధికారితో మీడియా కాల్‌లో మాట్లాడేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 15 ఫిబ్రవరి 2018

ఉన్నత మిథ్య



యుజీసీ నుండి అకస్మాత్తుగా విడుదలైన 84 పేజీల డ్రాఫ్ట్ భారతదేశ యువతను ఆందోళనలోకి నెట్టేసింది. దేశంలోని వర్సిటీలలో, డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకుల నియామానికి, ఇప్పటికే ఉన్నవారికి పదోన్నతులకి సంబధించిన ప్రతిపాదన లు అవి. ఈనెల 28వ తేదీ దాకా అభిప్రాయాలు తెలపమని సమయం కూడా ఇచ్చింది. వీటిలోని కొన్ని అంశాలు ఆశావహులకు తీవ్ర నిరాశ కలిగించేలా ఉన్నాయి. అవి ఒకటి 2021 జూలైకల్లా పీహెచ్‌డి పూర్తిచేసిన వారికే అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత ఉన్నట్టు. రెండు అధ్యాపకుల నియామ కానికి ఇంటర్వ్యూకి అర్హత సాధించడానికి వారి విద్యా జీవితం లో పొందిన డిగ్రీలలో శాతాన్ని బట్టి వారికి మార్కులు కేటా యించడం. వాస్తవానికి 2021 జూలై కల్లా పీహెచ్ డి తప్పనిసరి చేయడం ఒక పెద్ద జాతీయ విద్యా విపత్తు. ఇప్పటిదాకా నెట్ వంటి జాతీయ అర్హత పరీక్ష, సెట్ వంటి రాష్ట్రస్థాయి అర్హత పరీక్ష ఈ రెండు కాని పక్షంలో 2009 యుజీసీ గైడ్ లైన్స్ ప్రకారం పీహెచ్‌డి పూర్తి చేసినవారికి అధ్యాపకులుగా అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పుడు వీటితో పాటు పీహెచ్‌డిని కూడా తప్పనిసరి చేయడం వల్ల ఒరిగే ప్రయోజనమేమీ లేకపోగా అసలే అధ్యాపక ఉద్యోగాల భర్తీ జరగక కునారిల్లుతున్న ఉన్నత విద్య, ప్రమాణాల పరంగా మరింత దిగజారుతోంది. ఒకపీహెచ్‌డి పూర్తి చేయడం డిగ్రీ పీజీ పూర్తి చేయడం వంటి ప్రక్రియ కాదు, నెట్, సెట్ వంటి జాతీయ రాష్ట్రస్థాయి అర్హత పరీక్షల ద్వారా గానీ , లేదా యూనివర్సిటీల ప్రవేశ పరీక్ష ద్వారా గానీ మాత్రమే పీహెచ్‌డి అడ్మిషన్ పొందగలం. దేశంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఏటా పీహెచ్‌డి అడ్మిషన్ల ప్రవేశ పరీక్షను నిర్వహిస్తాయి . తర్వాత ఇంటర్వ్యూల ద్వారా సంబంధిత సబ్జెక్టుల్లో ప్రవేశాలు చేపడతాయి. ప్రతి సబ్జెక్టులో అక్కడున్న అధ్యాపకుల అర్హతను బట్టి మరియు అప్పటికే తమ వద్ద ఉన్న ఖాళీలను బట్టి సీట్ల సంఖ్య ఉంటుంది. అందుకే వాటి సంఖ్య చాలా తక్కువ . ఇక రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డి ప్రవేశ పరీక్ష ఏటా జరగదు . రెండేళ్ళకోసారి, మూడేళ్లకోసారి నిర్వహిస్తుంటారు.

పీహెచ్‌డి పట్టా పొందాలంటే ఒక ప్రక్రియ ఉంటుంది. ఎవరైనా తమ సిద్ధాంత గ్రంథాలు 3 సంవత్సరాల తర్వాత సమర్పించొచ్చు. వాటిని పరిశీలనకు పంపడం తరువాత ఆ సిద్ధాంతాన్ని డిఫెండ్ చేసుకునే వైవా ఇవన్నీ జరుగుతాయి. ఇదంతా జరగడానికి 4 ఏళ్ళు కనీసం పడుతుంది. కొన్నిసార్లు ఆలస్యమయ్యి ఆ సమయం 7 లేదా 8 ఏళ్ళు పట్టేవారు ఉన్నారు. ఇంత సమయం పట్టే ఒక డిగ్రీని అధ్యాపక ఉద్యోగాల నియామాకానికి అర్హతగా పెట్టడం వల్ల ఏమి సాధించాలని కోరుకుంటున్నట్టు? పీహెచ్‌డి వంటి ఉన్నత విద్యపై ఇప్పుడిప్పుడే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవగాహన ఏర్పడుతున్న నేపథ్యంలో ఆ డిగ్రీనే ఒక నిర్దేశిత సమయానికి తప్పనిసరి చేసినట్లైతే వారి హక్కులు ఎలా కాపాడగలం. నిజంగానే ఈ అర్హత తప్పనిసరి చేస్తే ఇప్పుడు పీహెచ్‌డి అడ్మిషన్ పొందే విద్యార్థులు కూడా 2021 కి డిగ్రీ పొందలేరు. అదొకటైతే 2021 జూలై తరువాత, ఇప్పుడు అర్హతలుగా ఉన్న నెట్ మరియు సెట్ వంటి పరీక్షలలో ఉత్తీర్ణులైన వారు పీహెచ్‌డి పూర్తి చేసేదాకా అధ్యాపక ఉద్యోగాలకు అర్హులే కారు. ఇదెలా న్యాయం. ఇప్పుడు ఈ రూల్ పెట్టడం వల్ల, కొండంత ఆశతో జాతీయ స్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణులయ్యి టీచింగ్ వైపు మళ్లాలి అనుకునే ప్రస్తుత డిగ్రీ, పీజీ విద్యార్థుల మీద తీవ్ర ప్రభావం చూపుతుంది ఈ నిర్ణయం.

దేశంలో జాతీయ విశ్వ విద్యాలయాలు మొదలుకుంటే రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కాలేజీల్లో ఖాళీలు కలిపితే సంఖ్య వేలల్లో తేలుతుంది. నిధులు లేక రాష్ట్ర విశ్వవిద్యాలయాలు మూలుగుతున్నాయి. అధ్యాపక ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడం, అభ్యర్థుల నుండి ఫీజు వసూలు చేయడం ఏదోఒక కారణంతో వాయిదా వేయడం ఇలా అభ్యర్థుల జేబులు గుల్ల కావడం తప్ప భర్తీ జరిగిందే లేదు. తెలుగు రాష్ట్రాలలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. నియమాకాలకు ఏదోఒక చట్టపరమైన కారణాలు అడ్డుపడుతూనే ఉన్నాయి. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పీహెచ్‌డి అడ్మిషన్లు ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా ఇవ్వాలి అనే ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఇవెప్పటికి జరిగేనో తెలియదు. వీరంతా 2021 జూలై కల్లా పీహెచ్‌డి పూర్తవ్వాలనే నిబంధనతో బాధితులుగా మారతారనడంలో సందేహం లేదు. ఇక అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులను ఇంటర్వ్యూకి షార్ట్ లిస్టు చేయడానికి విద్యా జీవితంలో పొందిన డిగ్రీల మార్కుల శాతంని బట్టి ఇచ్చే ప్రాధాన్యంలో కూడా కొంత గందరగోళానికి తెరతీసింది. వర్సిటీలలో భర్తీచేసే ఉద్యోగాలకు పీహెచ్‌డికి ఇచ్చే మార్కులు 30 గా నిర్ణయిస్తే, కాలేజీల్లో అధ్యాపకుల భర్తీకి పీహెచ్‌డికి 20 మార్కులు కేటాయించారు. జాతీయ స్థాయి అర్హత పరీక్ష నెట్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి వర్సిటీల్లో 7 మార్కులు కేటాయిస్తే కాలేజీల్లో భర్తీకి 10 మార్కులు కేటాయించారు. ఒకే తరహా ఉద్యోగాలకు ఒక డిగ్రీకి వేరు వేరు మార్కులు ఎందుకో ఇప్పటికీ అర్థం కాని పరిస్థితి.

దేశమంతా విద్యా వ్యవస్థ ఒకటిగా ఉన్నప్పుడు ఒకే రకమైన సదుపాయాలు అర్హత కలిగిన అధ్యాపకులు ఉన్నప్పుడు చేయాల్సిన పనిని అస్తవ్యస్తంగా ప్రాంతాలను బట్టి ప్రాధాన్యతలు మారిపోయే దేశంలో ఒక ఉన్నత స్థాయి కాలేజీ నుండి వచ్చిన వారికి, సదుపాయాలు లేని ప్రదేశాల నుండి అసలు చదువుకునే హక్కే తృణీకరించిన వర్గాల నుండి కష్టపడి చదువుకొన్న వారి మధ్య డిగ్రీ పీజీ మార్కుల శాతం ఏమి సాధిస్తుంది. అందరూ అర్హత కలిగిన వారే. అత్యవసరతలో పీహెచ్‌డి సిద్ధాంత గ్రంథం ఖచ్చితంగా ఒక విద్యా వ్యాపార వస్తువు (అకడమిక్ కమోడిటీ)గా మారుతుంది అనడంలో సందేహం లేదు.

అధ్యాపకుల నియామాకాలకు అర్హతలు నిర్దేశిస్తున్న యుజీసీ అసలు అధ్యాపకుల నియామకం జరుగుతుందో లేదో చూడకపోవడం బాధాకరం. అధ్యాపకుల నియామకాల్లో అవినీతి జరుగుతుంది అంటూ రోజూ పత్రికల్లో చూస్తూనే ఉంటాం. భారతీయార్ వర్సిటీ వీసీ ఒక అధ్యాపక పోస్టు ఇవ్వడానికి 30 లక్షల లంచం డిమాండ్ చేసి ఇటీవల ఏసీబీకి దొరికిపోవడం చూశాం, ఆధ్యాపకుల నియమాకాల్లో అవకతవకలు అంటూ ఇంటర్వ్యూ ప్రక్రియనే నిలిపేసిన సంఘటనలు ఆంధ్రాలో చూసాం, ఇంటర్వ్యూలో మార్కుల మాయాజాలం అంటూ తెలంగాణా నుండి వార్తలు చూశాం, పేరు గాంచిన డిల్లీ వర్సిటీలో లా అధ్యాపకుల నియామకంలో అవకతవకలు అంటూ టీచర్ల సంఘం ఆందోళన చూశాం, కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో 6000 పైగా బోధనా ఖాళీలు ఉన్నాయని సాక్షాత్తూ కేంద్రమే ప్రకటించాక ఇంత దారుణంగా పరిస్థితి ఉంటే చక్కదిద్దే పని చేయకుండా నేటి పరిస్థితికి ఎటువంటి ఉపయోగం చేయని నిబంధనలతో ఉన్నత విద్యను ఉత్త విద్యగా మార్చేసే నిర్ణయాలు ప్రతిపాదించడం పూర్తిగా అనవసరం. ఈ నిర్ణయమే తీసుకున్న నేపథ్యంలో తప్పకుండా ఇది ''జాతీయ ఉన్నత విద్యా విపత్తు''గా మారుతుంది అనడంలో సందేహమే లేదు.

✦ పచ్చల రాజేష్, 8331823086.

రెండో రాజధానిగా ఏది బెటర్?

దేశానికి రెండో రాజధాని అంశం మళ్ళీ చర్చకు వచ్చింది. రాజకీయ కోణం నుంచి కాకుండా, భౌగోళికంగా, ఆర్థిక పరంగా అన్ని ప్రాంతాలకూ అనుకూలంగా ఉండే నగరాన్ని రెండో రాజధానిగా చేయాలన్న ఆలోచన మంచిదే.బెంగళూరు ను రెండో రాజధానిగా చేయాలన్న ప్రతిపాదన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ కోణం నుంచేవచ్చింది.కానీ, వాస్తవ పరిశీలన జరిపితే, బెంగళూరు కన్నా, హైదరాబాద్ అన్ని విధాల అర్హమైనదన్న అభిప్రాయం చాలా మందిలో ఉంది. ఈరెండునగరాలకూ దక్షిణాదిన ప్రాధాన్యం ఉన్నప్పటికీ, రెండో రాజధానిగా దేనికి ఎక్కువ సానుకూలతలు ఉన్నాయన్న అంశంపై విశ్లేషణ ఇది....

పాలనా సౌలభ్యం కోసం దేశానికి రెండు రాజధానులు ఉండటం అసాధారణంకాదు. భౌగోళికంగా వేర్వేరు ప్రాంతాల ప్రజల ఆకాంక్షలు తీర్చడానికి ఒక్క రాష్ట్రా నికే రెండు రాజధానులు ఉండటం సహజమే. రెండో రాజధాని కోసం వివిధ ప్రాంతాల నుంచి డిమాండ్లు రావడమూ సహజమే. ఆశలూ, ఆకాంక్షలూ తీర్చడానికి ఆ డిమాండ్లను ఆమోదించిన ప్రభుత్వాలూ ఉన్నాయి. ఒకే రాష్ట్రా నికి రెండు రాజధానులు ఉన్నాయి. మహారాష్ట్రకు అసలు రాజధాని ముంబాయి నగరమైతే, వేసవి రాజధాని నాగపూర్.అలాగే, గుజరాత్‌కు మొదటి నుంచి రాజధానిగా అహ్మదాబాద్ ఉండేది.తర్వాత గాంధీనగర్‌ని కొత్త రాజధాని గా నిర్మించడంతో అహ్మదాబాద్‌ని వాణిజ్యరాజధా నిగా చేశారు.అలాగే, దేశానికి వాణిజ్య రాజధానిగా ముంబాయి ప్రసిద్ధి చెందింది.బ్రిటిష్ వారి కాలంలో ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాలన్నీ కోల్‌కతా నుంచే జరిగేవి.తర్వాత ముంబాయికి,మద్రాసుకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇప్పటికీ కోల్‌కతా, ముంబాయి,చెన్నై సర్క్యూట్స్ కొనసాగుతున్నాయి. రెండవ రాజధానిగా ప్రకటిస్తే, తమ నగరంలో దేశ రాజధానితో సమానంగా మౌలిక సదుపాయాలు పెరుగుతాయని ఆయా నగరాల ప్రజల ఆకాంక్ష.మద్రాసు నుంచి ఆంధ్ర రాష్ట్రం విడిపోయినప్పుడు తొలి రాజధానిగా కర్నూలును ఎంపిక చేశారు. విశాలాంధ్ర ఏర్పడిన తర్వాత హైదరాబాద్ ను రాజధానిగా చేశారు.

దేశాలకు కూడా రెండో రాజధానులు ఉన్నాయి. అగ్రరాజ్యమైన అమెరికా రాజధానిగా మొదట్లో న్యూయార్క్ ఉండేది.తర్వాత వాషింగ్టన్‌కి మార్చారు. అందువల్లనే, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం అక్కడే ఉంది.వరల్డ్ ట్రేడ్ సెంటర్ న్యూయార్క్ లోనే ఉంది. వాషింగ్టన్ దేశ రాజధాని అయిన తర్వాత అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థల ప్రధాన కార్యాలయాలు ఆ నగరానికి మార్చారు. పూర్వపు బర్మాయే మయన్మార్. బర్మా రాజధానిగా యాంగన్ ఉండేది.మయన్మార్ రాజధాని నయ్‌పయ్ థా. అలాగే,వియత్నాం రాజధానిగా పాతనగరం స్థానే కొత్త రాజధానినిర్మించి దానికి ఆ దేశానికి జాతిపితగా పరిగణించే హోచ్‌మిన్ పేరు పెట్టారు. పాకిస్తాన్‌తొలి రాజధాని రావల్పిండి కాగా, ప్రస్తుత రాజధాని ఇస్లామాబాద్. రావల్పిండిలో ఇప్పటికీ రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం నడుస్తోంది. ఆఫ్ఘనిస్థాన్‌కి పూర్వపు రాజధాని కాందహార్ కాగా, ప్రస్తుత రాజధాని కాబూల్. చైనా కి బీజింగ్ రాజధాని కాగా, షాంఘై వాణిజ్య రాజధానిగా రెండవ రాజధాని హోదాని కలిగి ఉంది.ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి దేశానికీ, రాష్ట్రా నికీ రెండో రాజధాని డిమాండ్లు నానాటికీ పెరిగి పోతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ విభజనను నివారించడానికి హైదరాబాద్‌ని రెండో రాజధానిగా చేయాలన్న డిమాండ్లు అన్ని ప్రాంతాల నుంచి వచ్చాయి. దేశానికి రెండో రాజధాని అయ్యేందుకు అవసరమైన అర్హతలన్నీ హైదరాబాద్‌కి ఉన్నాయి. రాష్ట్రపతి వేసవి విడిది హైదరాబాద్. ఢిల్లీలోని రైసానా హిల్స్‌లో రాష్ట్రపతి భవన్ ఉంది.ఆ తర్వాత సికిందరాబాద్ బొలారం లో రాష్ట్రపతి నిలయం ఉంది. నిజాం కాలంలో హైదరాబాద్ స్టేట్‌కు రాజధానిగా ఉండటం వల్ల హైదరాబాద్ లో దేశంలో అన్ని ప్రాంతాలు,మతాలు, భాషలు,నాగరికతల వారు స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. హైదరాబాద్‌ని సకల సంస్కృతుల సంగమం అనీ,మినీ ఇండియా అని ఇప్పటికీ అభివర్ణిస్తుంటారు. రక్షణ శాఖకు చెందిన డిఆర్ డిఓ వంటి,సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీసు అకాడమీ,జాతీయ స్థాయిలో పేరొందిన కాసు బ్రహ్మానంద రెడ్డి జాతీయ పార్కు,సీసీఎంబి,భారత్ ఎలక్ట్రానిక్స్ (బిహెచ్ ఈఎల్), హిందూస్తాన్ ఎయిరో నాటిక్స్ (హెచ్‌ఏఎల్)వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా ఉంది.వాయుసేన వైమానిక విన్యాసాలను సికిందరాబాద్‌లో నిర్వహిస్తూ ఉంటుంది. ఆర్థిక పరంగా రిజర్వు బ్యాంకు కార్యాలయం ఉంది . రాజ ధానిఢిల్లీలో మొగలాయీ ల కాలం నాటి కట్టడాలు ఉన్నట్టే,హైదరాబాద్‌లో చార్మినార్,గోల్కొండ కోట, సాలార్ జంగ్ మ్యూజియం వంటి చారిత్రక ప్రదేశాలు న్నాయి. అందువల్ల హైదరాబాద్‌ని రెండవ రాజధాని గా చేయాలన్న డిమాండ్



రాష్ట్ర విభజన సమయంలో పలువురి గళాల నుంచి వినిపించింది.హైదరాబాద్‌ని రెండో రాజధాని చేస్తే ఎన్నో మౌలిక సదుపాయాలు ఏర్పడతాయన్న వాదనలు కూడా వినిపించాయి. రాష్ట్ర విభజనపై ఏర్పాటైన శ్రీకృష్ణ కమిషన్ సూచించిన ప్రత్యామ్నాయాల్లో హైదరాబాద్ ని రెండో రాజధానిగా చేయాలన్న ప్రతిపాదనకూడా ఉంది. శివరామకృష్ణకమిటీ సూచించిన ప్రత్యామ్నాయాల్లో కూడా ఇది ఉంది. కట్టలు తెగిన భావోద్వేగాల మధ్య ఈ ప్రత్యామ్నాయాలన్నీ దూది పింజలయ్యాయి. ఇప్పుడంతా సర్దుకుని నాల్గేళ్ళుగా తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిపై దృష్టిని ముందుకు సాగుతున్న సమయంలో, అభివృద్ధిలో ఎవరు ముందున్నారని బేరీజు వేసుకునే సమయంలో వనరులు, ఆస్తుల పంపిణీ జరుగుతుండటం. స్థిర ఆస్తులను



విడగొట్టలేని పరిస్థితులు ఉన్నప్పుడు మళ్ళీ రెండో రాజధాని మాట తెరమీదికి వచ్చింది.

కేసీఆర్ ఇప్పుడు సుముఖం!

ఈ మాట ఎవరో సామాన్యుల నోటంట కాకుండా, సాక్షాత్తూ తెలంగాణ ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) అధ్యక్షుడు కల్వకుంట చంద్రశేఖర రావు (కేసీఆర్) నోటివెంట వచ్చింది. రెండో రాజధానిగా హైదరాబాద్‌ని చేయాలన్న ప్రతిపాదనకు గతంలో ససేమిరా అన్న కేసీఆర్ ఇప్పుడు అందుకు అభ్యంతరం లేదని చెప్పడం గుణాత్మక పరిణామమే. దీనిపై తెలుగునాట మేధావుల మస్తిష్కాలు జోరుగా పని చేస్తున్నాయి. హైదరాబాద్ డెక్కన్ ప్రాంతంగా వ్యవహరించబడుతున్నప్పటికీ, దక్షిణాది రాష్ట్ర రాజధానిగానే చాలా కాలంగా ప్రసిద్ధి చెందింది.అందువల్ల దక్షిణాది వారి ఆకాంక్ష మేరకు హైదరాబాద్‌ని రెండో రాజధానిగా చేయడం అన్ని విధాలా అభిలషణీయమని వాదించేవారేఎక్కువ .

రేసులో బెంగళూరు: తెలుగువారంతా కలిసి ఈ డిమాండ్‌ని సాధించేస్తారేమోనని కన్నడిగుల్లో వణుకు ప్రారంభమైంది. రెండో రాజధానిగా బెంగళూరును చేయాలని కోరుతూ ప్రధానికి ఒక లేఖ రాసినట్టు కర్నాటక మంత్రి,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆర్ వి దేశపాండే ఈ మధ్య ఒక ఇంటర్వ్యూలో వెల్లడించడంతో ప్రకంపనాలు మొదలయ్యాయి. ఆయన రాష్ట్ర శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చేసిన ప్రతిపాదనగా బీజేపీ వారూ, ఇతరులూ కొట్టి వేశారు. బెంగళూరు నగరంలోనూ, దాని ఆనుకున్న శివార్లలోనూ 24 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. సాధారణంగా వీరంతా ఐదేళ్ళ కోసారి కాంగ్రెస్, బీజేపీలను వంతుల వారీగా గెలిపిస్తూ ఉంటారు. ఈసారీ అలాగే జరుగుతుందేమోనని మళ్ళీ అధికారంలోకి రావలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకునిగా ఆయన ఈ ప్రతిపాదనపై చర్చకు తెరలేపారు. సాధారణంగా ఇలాంటి ప్రతిపాదనలపై పారిశ్రామికవేత్తలూ, వాణిజ్య వేత్తలూ వెంటనే స్పందిస్తూ ఉంటారు. ఈసారీ అలాగే జరిగింది. బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ వంటి పారిశ్రామికవేత్తలు వెంటనే స్పందించారు. ఇది ఏ నాటి నుంచో పరిశీలనలో ఉన్న ప్రతిపాదన అంటూ ఆమె స్వాగతించారు.

దేశపాండేది ఎన్నికల జిమ్మిక్ అని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి సురేష్ కుమార్ తేల్చిగ్గా కొట్టి వేశారు. బెంగళూరులోనూ, శివారులలోని 24అసెంబ్లీ స్థానాల్లో 20 సీట్లను తమ పార్టీ సునాయాసంగా గెలుస్తుందని ఆయన ధీమాగా చెప్పారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బెంగళూరు నగరంలో అభివృద్ధి కార్యక్రమాలకు వేల కోట్ల రూపాయిలను కుమ్మరిస్తున్నారు. సబ్సిడీ రేట్లపై అల్పాహారం, భోజనం సరఫరా చేసేందుకు చెన్నైలో అమ్మ క్యాంటీన్ల మాదిరిగా క్యాంటీన్లను ప్రారంభించారు. ఇంకా ఎన్నో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీ మాదిరిగా బెంగళూరు సాఫ్ట్ వేర్ పరిశ్రమకు కేంద్రంఅయిందనీ,ఎన్నో మెడికల్ సంస్థలు వెలిశాయని వాదిస్తున్నారు.

బీజేపీ నాయకుడు సురేష్ కుమార్ పేర్కొన్నట్టు ఇది ఎన్నికల ఎత్తుగడే కావచ్చు. ఏమైనా, దేశానికి రెండో రాజధానిగా దక్షిణాది రాష్ట్ర రాజధానిని చేయడంఎంతైనా అవసరం. పంజాబ్, హర్యానాలకు ఉమ్మడి రాజధానిగా ఉన్న చండీగఢ్‌ని రెండో రాజధానిగా చేయాలన్న ప్రతిపాదన కూడాచాలా కాలంగా వినిపిస్తోంది.

రాజకీయ కోణం నుంచి కాకుండా, భౌగోళిక, వాణిజ్య, ఆర్థిక,సాంస్కృతిక కోణాల నుంచి పరిశీలిస్తే, హైదరాబాద్ రెండో రాజధానిగా మేలైనదని నిపుణులు,అభివృద్ధి హితైషులు ఏనాడోతేల్చారు. ఏపీ విడిపోయినప్పటికీ, పదేళ్ళ పాటు ఉమ్మడి రాజధానిగా ఉండాలన్న నిబంధన విభజన చట్టంలో స్పష్టంచేశారు కనుక, అలా చేస్తే, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ఉమ్మడి రాజధానిగా, దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్ అభివృద్ధి చెందేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. అలాంటి సందర్భంలో అమరావతి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రా నికి రెండో రాజధానిగా చేయవచ్చు. వరంగల్‌ని తెలంగాణకు రెండో రాజధానిగా చేయాలన్న ఆ ప్రాంత వాసుల ఆకాంక్షా నెరవేరుతుంది. రాజకీయ కోణం నుంచి కాకుండా, పాలనాసౌలభ్యపరంగా ఇది సానుకూలమైన ప్రతిపాదన.

✦ ఎ.పి.స్వామి

విధి లేకే సయీద్‌పై వేటు

ముంబయి దాడుల ప్రధాన సూత్రధారి హఫీజ్ సయీద్‌ని ఉగ్రవాదిగా పాకిస్తాన్ ప్రకటించడం అనూహ్య పరిణామం ఏమీ కాదు. పాకిస్తాన్‌ని ఇప్పుడు ఒక్క చైనా తప్ప ఎవరూ నమ్మడం లేదు. చైనా కూడా తాను తలపెట్టిన బృహత్ ప్రాజెక్టుల అమలుకు పాకిస్తాన్ సహకారం కావాలి కాబట్టి సమర్థిస్తోంది. సయీద్‌ని గౌరవ భాజనుడనీ, ఆయన నేతృత్వంలోని జమత్ ఉద్ దవా (జెయుడి) గొప్ప ధార్మిక సంస్థ అని పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అనేక సందర్భాల్లో పొగిడారు. అదే నోటితో కాశ్మీరీ యువకులను సాయుధ పోరాటానికి సంసిద్ధంచేసి ఎదురుకాల్పుల్లో మరణించిన బుర్హాన్ వనీని అమరజీవి అంటూ కీర్తించారుకూడా. సయీద్‌కి పాకిస్తాన్ రహస్య గూఢచార సంస్థ ఐఎస్ఐతో సన్నిహిత సంబంధాలున్నాయి. నిజానికి ఆయన ఆదేశాలపైనే ఆ సంస్థ పని చేస్తోందనడం అతిశయోక్తి కాదు.అంతటి ప్రాధాన్యం కలిగిన వ్యక్తిని ఉగ్రవాదిగా పాక్ ప్రభుత్వం ప్రకటించిందంటే విడ్డూరమే. చాపకింద నీళ్ళు వచ్చిన చందంగా అన్ని వైపుల నుంచి ఒత్తిళ్ళు వెల్లువెత్తడంతో వేరే మార్గం లేకపోవడంతో పాక్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు. పారిస్‌లో వచ్చే వారం జరిగే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటిఎఫ్) సమావేశంలో పాక్ పై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టు వార్తలు వెలువడిన నేపథ్యంలో పాక్ ప్రభుత్వం దిగివచ్చింది. ఈ టాస్క్ ఫోర్స్‌ని 1989లో పారిస్‌లో జి-7 దేశాల శిఖరాగ్ర సమావేశాల సందర్భంగా ఏర్పాటు చేశారు. మనీ ల్యాండరింగ్, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం, ఆశ్రయం కల్పించడం, స్థావరాలు ఏర్పాటుకు అనుమతించడం వంటి చర్యలకు పాల్పడే దేశాలపై చర్యలు తీసుకునేందుకు ఈ టాస్క్ ఫోర్స్ ఏర్పాటైంది. జి- 7 కూటమి దేశాలే కాక, యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా ఈ సమావేశాలకు హాజరవుతూ ఉంటాయి. పాకిస్తాన్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడమే కాకుండా పూర్తి సహాయ సహకారాలను అందిస్తోందనే వాస్తవాన్ని అన్ని దేశాలూ గుర్తించాయి. ఇస్లామిక్ దేశాల మద్దతును కూడగట్టడానికి మతపరమైన సంఘీభావాన్ని పాచికగా ఉపయోగించింది. ఇస్లామిక్ దేశాల్లో ఉగ్రవాద బాధిత దేశాలు చాలా ఉన్నాయి. పాకిస్తాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాద సంస్థల వల్ల ఎక్కువగా నష్టపోతున్నది మన దేశమే. అదే మాదిరిగా ఐసిస్, అల్ ఖైదా వంటి ఉగ్రవాద సంస్థల వల్ల నష్టపోయిన, ఇప్పటికీ నష్టపోతున్న ఇస్లామిక్ దేశాలు ఉగ్రవాదంపై అంతర్జాతీయ పోరులో సహకరిస్తున్నాయి. పాకిస్తాన్ కూడా ఈ పోరులో అమెరికాకు భాగస్వామిగా ఉంటానని నమ్మబలికింది. అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. ప్రపంచంలోని అన్ని దేశాలూ ఏదో ఒక రూపంలో ఉగ్రవాదానికి దెబ్బతిన్నవే కావడంతో ఇప్పుడు అందరి నోటా ఉగ్రవాదాన్ని తుదముట్టించాలన్న మాట వినిపిస్తోంది. ఇప్పుడు ఆ దేశాలన్నీ ఒత్తిడి తేవడంతో పాక్ సయీద్‌పై చర్య తీసుకుంది. సయీద్ నెలకొల్పిన లష్కర్ ఎ తోయిబాను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి 1267తీర్మానం ప్రకారం నిషేధిత సంస్థగా 2005లోనే ప్రకటించింది. సయీద్ నేతృత్వం వహిస్తున్న జమాత్ ఉద్ దవా (జెయుడి)ని 2014లో విదేశీ ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

అమెరికా పరిధిలోని బ్యాంకుల్లో ఆ సంస్థ ఖాతాలను స్తంభింపజేసింది. మనీ ల్యాండరింగ్ వంటి అక్రమాలకు పాల్పడకుండా ఆదేశాలు జారీ చేసింది. పాక్ ప్రభుత్వం అండతో లష్కర్ సంస్థ ఇంతకాలం మనుగడ సాగిస్తోంది. లష్కర్‌ని పాక్ సైనికాధికారులు, రహస్య గూఢచార సంస్థ (ఐఎస్ఐ) అధికారులు ఇంతకాలం ఆదుకుంటూ వచ్చారు. అంతర్జాతీయ వేదికల మీద చైనా అండగా ఉంటూ వస్తోంది. సయీద్‌నీ, మసూద్ అజార్‌ని ఉగ్రవాదులుగా ప్రకటించే తీర్మానాలను సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశాల్లో చైనా చాలా సార్లు అడ్డుకుంది. చైనా అండతోనే పాక్ ప్రభుత్వం సయీద్ సంస్థలనే కాకుండా, పాక్ కేంద్రంగా మసూద్ అజార్ నేతృత్వంలోని జైష్ ఎ మహ్మద్, హఖానీ నేతృత్వంలోని ఉగ్రవాద ముఠా, పాక్ తాలిబన్లు వంటి సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించాలన్న డిమాండ్ పలు వర్గాల నుంచి చాలా కాలంగా వినిపిస్తోంది. పాకిస్తాన్ దారికి వస్తుందేమోనని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన కొత్తలో స్నేహ హస్తాన్ని అందించారు. పాక్ వైఖరి మారకపోవడంతో ఆ దేశాన్ని ఏకాకి చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రతి విదేశీ పర్యటనలోనూ ఉగ్రవాదులకు పాక్ అండదండల గురించి ప్రస్తావిస్తూవచ్చారు. ఈ దేశాల్లో ఇస్లామిక్ దేశాలు కూడా ఉన్నాయి. ఇటీవల ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ఎర్రతివాచీ స్వాగతం పలికిన మోడీ ఇరాన్ ప్రధాని హసన్ రోహానీ కూడా అదే మాదిరిగా స్వాగతం పలకనున్నారు. ఇజ్రాయెల్‌కి బద్ధశత్రువైన పాలస్తీనాలో ఇటీవల మోడీ పర్యటన ముమ్మాటికీ చారిత్రాత్మకమైనదే. ఇస్లామిక్, యూదు దేశాలనే తేడా లేకుండా ఉగ్రవాదం ఉమ్మడి అజెండాగా అన్ని దేశాల సహాయ సహకారాలను తీసుకునేందుకు మోడీ సాగిస్తున్న కృషి ఫలించిందనడానికి ఇదే నిదర్శనం. జి-7 కూటమిలో అమెరికా, జపాన్, జర్మనీ, ఇటలీ, యునైటెడ్ కింగ్ డమ్, కెనడా, ఫ్రాన్స్ లకు సభ్యత్వం ఉంది. ఈ దేశాలన్నీ ఉగ్రవాద బాధిత దేశాలే. అందువల్ల ఉగ్రవాదులకు ఆర్థికంగా సాయ పడుతున్న పాకిస్తాన్‌కి ముకుతాడు వేసేందుకు ఇవి కృత నిశ్చయంతో ఉన్నాయి. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిననాటి నుంచి ఉగ్రవాదులకు ఊతమివ్వడం మానుకోవాలని హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. ఇటీవల పాక్‌కి ఇచ్చే సహాయాన్ని తగ్గించారు. సౌదీ అరేబియా రాజు సమక్షంలోనే పాక్‌ని హెచ్చరించడమే కాకుండా, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం వల్ల భారత్ ఎక్కువ నష్టపోతోందని ప్రకటించారు. ఇస్లామిక్ దేశాల నుంచి గతంలో మాదిరిగా ఇప్పుడు పాక్‌కి సాయం లభించడం లేదు. జి-7 దేశాల కూటమి ఏర్పాటు చేసిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ వచ్చే వారం పారిస్‌లో పాక్‌కి ముకుతాడు వేయడం గురించే ప్రధానంగా చర్చించే అవకాశం ఉందన్న వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వంపై వేటు పడే ప్రమాదం ఉందని గ్రహించి సయీద్‌ని పాక్ ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించింది.

మంచి మాట

తన ఆలోచనను అమలుపరచడానికి భయపడని వాడే నిజమైన స్వేచ్ఛాజీవి.

✦ లియోన్ బ్లమ్

అన్నీ అలవి కాని వాగ్దానాలే!

అచ్చేదిన్ వారి కలర్‌ఫుల్ ఎన్ని'కలల' బడ్జెట్ (2018-19)లో వాగ్దానాల వెల్లువ తప్ప మరేదీ కనిపించడం లేదు. ఇప్పటి వరకూ ఇచ్చిన వాగ్దానాలను ఏమేరకు అమలు చేశారో ప్రస్తావన పూర్వకంగానైనా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొనలేదు. ఎన్నికల సంవత్సరం కావడం వల్ల వాగ్దానాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అందరికీ ఆరోగ్యం, ఉచిత విద్య, మహిళలకు పెద్ద పీట మొదలైనవన్నీ వినడానికి ఆకర్షణీయంగానే ఉంటాయి. వీటిని అమలులో పెట్టేందుకు ఎంత సమయం పడుతుందో ఎవరూ చెప్పలేరు. ఇది దేశ ప్రజలకు అనుభవైకమే. ఈసారి మోడీ ప్రభుత్వం గ్రామీణ ఓటర్లకు గాలం వేసింది. నాలుగు సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాలనూ, రైతులను పట్టించుకోని ప్రభుత్వం చివరి సంవత్సరంలో భారీ ఎత్తున సాయమందిస్తుందంటే నమ్మశక్యం కాదు. ఈ బడ్జెట్‌లో ప్రకటించిన ఆరోగ్య పథకం అమలులోకి రావాలంటే చాలా వ్యవధి పట్టవచ్చు. గిరిజన సంక్షేమం గురించి బడ్జెట్ లో చేసిన ప్రతిపాదనలు అమలవ్వాలంటే మరింత సమయం తీసుకోవచ్చు. కేవలం ఓటర్లకు గాలం వేయడానికే ఈ వాగ్దానాలు చేసినట్టుగా కనిపిస్తోంది. మధ్యతరగతి వేతన జీవుల ఆశలపై నీళ్ళు చల్లారు. తెలుగు రాష్ట్రాలకు మొండిచేయి చూపించారు. కార్పొరేట్ల రాయితీలూ ఇస్తూ, వరాలు ప్రకటించారు. సామాన్య ప్రజలపై భారాలు మోపారు. మొత్తానికి ఎన్నికల మాయల మరాఠీ గారడి బడ్జెట్‌ను జైట్లీ ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో చెప్పే అంకెలు వేరు తరువాత కేటాయించే అంకెలు వేరు ఈ కేటాయింపులోంచి వాస్తవంగా ఖర్చు పెట్టేది వేరు. ప్రజాసంక్షేమమే పరమావధిగా భావించి, సత్వర సామాజిక ఆర్థికాభివృద్ధిని సాధించాలి.

కార్పొరేటీకరణ మొదలైనప్పటి నుంచి బడ్జెట్ అర్థం పూర్తిగా మారిపోయింది. కడుపులో చల్ల కదలకుండా కార్పొరేట్లకు ఎర్ర తివాచీలు పరిచి మరి వారిపై వరాల జల్లులు, అనేక రాయితీలు కల్పిస్తూ బడ్జెట్‌లు తయారౌతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే బడ్జెట్ రూపకల్పన మొత్తం ప్రపంచ బ్యాంకు దేశ, విదేశీ కార్పొరేట్ల కనుసన్నల్లో రూపుదిద్దుకుంటే అట్టహాసంగా తెచ్చి పార్లమెంట్‌లో చదవటమే ఆర్థిక మంత్రుల పని ఇందులో వారి ప్రయోజనాలే ఉంటాయి. భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధిరేటు అమాంతంగా 7.5 శాతం పెరిగి చైనాను కూడా మించిపోయిందని మోడీ ప్రభుత్వం ఊదరగొడుతోంది. మరోవైపు ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో బడా పారిశ్రామిక వేత్తలకు వేల కోట్లు రాయితీలు ఇస్తూ, సాధారణ పేద ప్రజానీకానికి ఇచ్చే సబ్సిడీలకు కోత పెడుతోంది. ఇది సహించరానిది ఉపాధి దొరకక, ఉద్యోగ భద్రత లేక కార్మికులు వేతన భరోసాలేని అడ్డాకూలీలుగా మారుతున్నారు.ప్రకృతి ప్రతికూలతలు, నకిలీ విత్తనాలు రుణభారాలు, గిట్టుబాటు ధరలు లభించక దేశవ్యాప్తంగా రైతులు నిరాశ నిస్పృహలకు లోనయి ఈ దశాబ్దంలో వేల సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతులకు గిట్టుబాటు ధర కూడా కల్పించలేని చేతకాని స్థితిలో ప్రభుత్వాలున్నాయి. దీనికి సమాధానం బడ్జెట్‌లో ఉందా? ఈ బతుకు తెరువు సంక్షోభాన్ని పరిష్కరించలేని ఉత్తుత్తి బడ్జెట్‌లు ఎందుకు? ఇక ఆరోగ్యరంగానికి అరకొర నిధులే విదిలించారు. ఈరంగానికి రూ.1.38 లక్షల కోట్లు కేటాయించారు. కొత్త బీమా పథకం అంటూ కొత్త ముసుగు వేశారు. ఈ పథకం కొత్త సీసాలో పాత సారాలా ఉంది. ఈ నిధులు ఎలా సరిపోతాయి? భారత పాలకులు ప్రజలకు వైద్యం అందించే బాధ్యత నుండి ఎప్పుడో తప్పుకున్నారు. ఇక్కడ రోగం మార్కెట్ సరకు గాను, వైద్యం వ్యాపారంగాను మారింది. అనుత్పాదక రంగమైన రక్షణ రంగానికి ఈ బడ్జెట్‌లో గతేడాది కంటే 7.81 శాతం మేరకు కేటాయింపులు పెంచారు. (రూ.2.95 లక్షల కోట్లు). ఇన్ని లొసుగులుంటే ఈ దేశం బాగుపడమంటే ఎలా బాగుపడుతుంది. రోజులు గడుస్తున్నకొద్దీ దేశ ప్రజలకు అచ్చేదిన్ ఆంతర్యం అర్థమవుతోంది. త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సామాన్యులకు అర్థం కాని అంకెల గారడి తప్పితే ఏమి లేదు. ఉపాధి లేమి ద్రవ్యోల్బణం, పేదరికం లాంటి సమస్యలకు పరిష్కారం చూపడంలో బడ్జెట్ విఫలమైంది. బడ్జెట్ కేటాయింపుల్లో దాగిన మోడీ సర్కారు సంపన్న సేవా తత్పరత మరోమారు తేటతెల్లమైంది.

✦ షేక్ కరిముల్లా, 9705450705

అహింసకు ప్రతిరూపం

నేడు సేవాలాల్ జయంతి

తిరుపతి తిరుమల, శ్రీశైలం, వేములవాడ రాజన్న, సమక్క-సారలమ్మ, సప్తమాతలు (బంజారా) నిర్దేశము తెలియని బంజారాలకు దిశా నిర్దేశం చేసిన మహానుభావుడు సంత్ సేవాలాల్ మహరాజ్.సమస్త జీవకోటికి అమ్మగా వెలిసిన భవాని మాత పూజించాలని కాని ఫలితాన్ని ఆశించవద్దని బంజారాలకు బోధించాడు ఆయన. సేవాలాల్ మహారాజ్ జననం 1739 ఫిబ్రవరి 15వ తేదీన అనంతపూర్ జిల్లా రాంజీ నాయక్ తండాలో జన్మించారు. ఈయనకు సేవాలాల్ అని నామకరణం చేశారు. జగదాంబ ప్రత్యక్షమై సేవాలాల్‌ని నాకు అప్పజెప్పమని భీమనాయక్‌ను అడుగుతుంది.

అమ్మ వారికి ఇచ్చిన వాగ్దానం ప్రకారం సేవాలాల్ అందుకు ఒప్పుకోడు. తల్లిదండ్రులు సేవాలాల్‌ను అమ్మవారికి అప్పగిస్తుంటే నేను శాఖాహారిని జగదాంబ మాంసాహారి కనుక ఆమెకు నేను ఎలాంటి జీవాలను బలి చేయదలచుకోలేదని అంటాడు. అప్పుడు మేరామ సేవాలాల్ ఎన్నో కష్టాలకు గురి చేస్తుంది. అమాయక మూగ జీవుల్ని బలిచేస్తుంటే చూడలేక,అమ్మవారికి బలులను వ్యతిరేకిస్తాడు. ఒకవేళ అమ్మవారికి బలే ఇష్టమైతే తానే బలైపోతానని సేవాలాల్ ప్రజల సమక్షంలో తన తలను ఖండించుకొని అమ్మవారి కాళ్ల దగ్గర పడేస్తారు. అమ్మవారు సేవాలాల్ శిరస్సును తిరిగి అతని శరీరానికి జోడించి జీవం పోస్తారు. అప్పటినుంచి సేవాలాల్ అన్ని విద్యలను నేర్చుకొని బంజారాల సేవలో నిమగ్నమయ్యాడు.

✦ జి.శంకర్ నాయక్, 9908817986

ఆర్టీఏ ఆన్‌లైన్



•అందరికీ అందుబాటులో సేవలు •మీ-సేవ కేంద్రాలకు విస్తరణ •బ్రోకర్లకు తావులేని పారదర్శకత •కార్యాలయానికి రాకుండానే సేవలు పొందే వెసులు బాటు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రవాణా సేవల కోసం ఇక మీదట ఆర్టీఏ కార్యా లయాలకు వెళ్లనవసరం లేదు. బ్రోకర్లను సంప్రదించాల్సిన పనే ఉండబోదు. మధ్యవర్తి ప్రమేయం లేకుండా నివాసాలు, కార్యాలయాల సమీపం నుండే ఆర్టీఏ సేవలను పొందే వసులుబాటు త్వరలో అందుబాటులోకి రాబోతుంది. ఇప్పటికే ఆర్టీఏ సేవలను అన్నింటిని ఆన్‌లైన్ చేశారు. దీంతో కొంత వరకు మధ్యవర్తుల ప్రమేయం తగ్గింది. కొన్ని సేవలకు మధ్యవర్తులను సంప్రదించడం అనివార్యం అవుతుంది. ఆర్టీఏ కార్యాలయాల్లో వ్యక్తిగతంగా వెళ్లి సేవలు పొందడం కష్టంతో కూడిన పని, అదే బ్రోకర్ ద్వారా వెళ్లడంతో ఇబ్బందులే ఉండవు. ఈ సమస్యలన్నింటికి స్వస్తి పలకాలని ఆర్టీఏ అధికారులు భావించారు. గ్రామీణ వాహనదారులు కూడా దూరంలోని ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లడం, కార్యాలయం ఎదుట తిష్టవేసి ఉన్న బ్రోకర్లను సంప్రదించి తమకు కావలసిన సేవలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించుకోవడం, ఆ తర్వాత గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడటం జరుగుతుంది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఆర్టీఏ సేవలను ఇక మీదట మీ సేవ, ఈ సేవ కేంద్రాల ద్వారా అందించాలని అధికారులు సంకల్పించారు.

ఈ మేరకు సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి పరీక్షిస్తున్నారు. మీ సేవ, ఈ సేవ కేంద్రాల్లో అక్రమాలకు తావు లేని విధంగా సాఫ్ట్‌వేర్‌ను పటిష్టంగా రూపొందించడం జరిగిందని జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రమేష్ తెలిపారు. ఆర్టీఏ సేవలను సులభంగా, అందరికి అందుబాటులోకి తీసుకురావడం కోసం సరికొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి అంతర్గతంగా పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. అన్ని విధాలుగా నిర్దిష్ట ప్రమాణాల మేరకు ఈ సాఫ్ట్‌వేర్ పని చేస్తుందనే నిర్ధారణకు వచ్చిన తర్వాత ఈ సేవ, మీ సేవ కేంద్రాలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ నాటికి ఆర్టీఏ సేవలను మీసేవ, ఈ సేవ కేంద్రాలకు విస్తరింపచేయడానికి వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ సేవ, మీ సేవ కేంద్రాల సిబ్బంది కూడా కొంత మేరకు శిక్షణ పొందవలసి ఉంటుందన్నారు. ఆర్టీఏ నుండి వాహనదారులకు దాదాపు 17 సేవలను ఆన్‌లైన్‌లో అందచేస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం, ఆ తర్వాత స్లాట్ బుక్ చేసుకొని వెబ్‌ఫొటో దిగడానికి, సంతకాల కోసం ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లడం అనివార్యం అవుతుంది.

ఇక మీదట దరఖాస్తుదారుల సంతకాలు, వెబ్‌ఫోటోలను కూడా ఈ సేవ, మీ సేవ కేంద్రాల వద్ద తీసుకొనే వెసులుబాటు కల్పించబోతున్నారు. వాహనదారులు ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లకుండానే సేవలను పొందడం కోసం ఆన్‌లైన్ సేవలను ఈ సేవ, మీ సేవ కేంద్రాలకు విస్తరించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. గ్రామాలు, మండల కేంద్రాలలో ఈ సేవ, మీ సేవ కేంద్రాలు అందుబాటులో ఉన్నందున వాహనదారులు ఇక మీదట తమ గ్రామాలకు దూరంలో ఉన్న ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లవలసిన అవసరం ఉండబోదన్నారు. కొన్ని వాహన పరీక్షలకు మాత్రం ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లడం తప్పనిసరి అన్నారు. రాబోవు కాలంలో వాహన విక్రయదారులైన డీలర్ల వద్ద వాహనాల రిజిస్ట్రేషన్‌లు జరిగే విధంగా చర్యలు తీసుకోవడం కూడా ఆర్టీఏ అధికారుల పరిశీలనలో ఉంది. ఇప్పటికే తాత్కాలిక రిజిస్ట్రేషన్ సదుపాయం డీలర్ల వద్ద అందుబాటులో ఉంది. కొన్ని రకాల రుసుములను కూడా డీలర్ల ద్వారా చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఈ సేవ కేంద్రాలలో ఇప్పటి వరకు స్లాట్ బుక్ చేసుకోవడం, రుసుములు చెల్లించడం వరకే అవకాశం ఉంది. ఇక మీదట డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందడం, వాహనాల రుసుములు చెల్లించడం, వాహనాల రిజిస్ట్రేషన్లకు దరఖాస్తు చేసుకోవడం, పర్మిట్లు పొందడం, చిరునామా మార్పు, డూప్లికేట్ లైసెన్స్ పొందడం, వాహనాల రిజిస్ట్రేషన్లను బదిలీ చేసుకోవడం లాంటి అనేక సేవలను ఇక మీదట ఈ సేవ, మీ సేవ ద్వారా పొందే వెసులుబాటు కల్పించబోతున్నారు.

ఈ సేవ, మీ సేవ కేంద్రాల ద్వారా ఆర్టీఏ సేవలను పొందడానికి నిర్ధిష్ట రుసుము చెల్లించవలసి ఉంది. ఈ విధంగా మీ సేవ, ఈ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకున్న తర్వాత వారం పది రోజుల్లోనే తపాలా ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను ఆర్టీఏ అధికారులు నేరుగా ఇంటికి పంపించడం జరుగుతుంది. ఈ సేవ, మీ సేవ కేంద్రాల్లో ఆర్టీఏ సేవల కోసం దరఖాస్తు చేసుకొన్నది మొదలు ఇంటికి పత్రాలు చేరే వరకు సేవల పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చూసుకొనే వెసులుబాటు కూడా కల్పించడం జరుగుతుంది. రోజు కొన్ని వేల మంది ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఎంతో వ్యయప్రయాసాలతో జిల్లా కేంద్రంలోని ఆర్టీఏ కార్యాలయాలకు రావడం జరుగుతుంది. ఇక మీదట ఎవరు క ూడా ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరిగే పనే ఉండదు. సమీపంలోని మీ సేవ కేంద్రాల ద్వారా ఆర్టీఏ సేవలను సులభంగా పొందవచ్చు అని ఉన్నతాధికారులు వివరించారు.

ఎంఎస్ఎంఇ రుణాలపై 21న సదస్సు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఇ)లకు కేంద్ర ప్రభుత్వం అందించే రుణాల గురించి వివరించేందుకు ఈనెల 21న ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నారు. ముద్రా, సిజిటిఎంఎస్ఇ, క్లాస్, స్టార్టప్, స్టాండప్ తదితర ఎంఎస్ఎంఇ ఆర్థిక పథకాల గురించి ఈ సదస్సులో వివరించేందుకు ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజస్ బాలానగర్‌లోని ఎంఎస్ఎంఇ అభివృద్ధి సంస్థలో నిర్వహించనుంది.

ఈ సదస్సులో ఎస్ఎల్‌బీసీ, ఆర్‌బిఐ, జాతీయ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొంటారు. ఎంఎస్ఎంఇకి సంబంధించిన ఔత్సాహికులు ఏర్పాటుచేసే ప్రతిపాదిత ప్రాజెక్టు నివేదికలతో సదస్సుకు హాజరై అక్కడికక్కడే రుణాలు మంజూరుచేసే అవకాశాన్ని వినియోగించుకోవచ్చునని పబ్లిక్ ఎంటర్‌ప్రైజస్‌పేర్కొంది.

టీచర్లకు సీఎస్ హామీ



హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి హామి ఇచ్చారని తెలంగాణరాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు తెలిపారు. బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్‌కే జోషిని టిఎస్ యుటిఎఫ్ నేతలు సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి, ఉపాధ్యక్షులు పి మాణిక్ రెడ్డి, ఎం దేవదాస్ తదితరులు ఉన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఏకీకృత సర్వీస్ రూల్స్‌కి సంబంధించిన సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఎయిడెడ్ ఉపాధ్యాయుల రికవరీలను నిలిపివేయాలన్నారు, కెజిబివి, యుఆర్ఎస్, మోడల్ స్కూల్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్యతో చర్చించి త్వరగా సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని సీఎస్ చెప్పారని తెలిపారు.

రైల్వేలో ఖాళీలు భర్తీ చేయాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారత రైల్వేలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయ డంతో పాటుగా కొత్త పోస్టులను మంజూరు చేయాలని రైల్వే మంత్రి పియూష్ గోయల్‌ను కోరామని భారత రైల్వేల జాతీయ సమాఖ్య (ఎన్ఎఫ్ఐఆర్) ప్రధాన కార్యదర్శి డాక్టర్. ఎం. రాఘవయ్య తెలియచేశారు. మంత్రిని కలిసిన సందర్భంగా కార్మికుల సమస్యలతో పాటుగా రైల్వేలో భద్రత, సామర్థ్యం పెంపు, సమయపాలన అంశాలపై పలు సూచనలు చేశామన్నారు. కార్మికులకు సంబంధించి ఆరవ పిఆర్‌సి గ్రేడ్ పే రూ. 4600లను గ్రేడ్ పే రూ.48000లుగా మార్చవలసి ఉందని మంత్రికి నివేదించామన్నారు.

గ్రూప్ సీ లోని 3,335 పోస్టులను గ్రూప్ బి గజిటెడ్ పోస్టుగా మార్చవలసి ఉందని మంత్రికి వివరించామని పేర్కొన్నారు. టెక్నికల్ టూ గ్రేడ్‌ను టెక్నికల్ వన్‌గా మార్చాల్సిన అవసరం గురించి కూడా తెలియచేశామన్నారు. లోకో ఇన్స్‌పెక్టర్ల సమస్యలను మంత్రి సావదానంగా విన్నారని వెల్లడించారు. రైల్వేలో కొత్త పెన్షన్ విధానం రద్దు చేయాలని, గుర్తింపు కార్మిక సంఘంతో కుదిరిన ఒప్పందం మేరకు పెన్షన్ చెల్లింపులు జరగాలని కోరడం జరిగిందన్నారు. అవుట్ సోర్సింగ్ నియామకాలు, రైల్వే సంస్థల మూసివేతలు, ప్రైవేటీకరణల పైన విధాన నిర్ణయాలు తీసుకొనే ముందు సంప్రదింపులు జరపాలని, నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలని సూచించామన్నారు. సిబ్బందిపైన పని భారం పెరుగుతున్నందున కొత్త పోస్టులను మంజూరు చేయడంతో పాటు ఇప్పటికే ఏర్పడిన ఖాళీలను వెంటనే భర్తీ చేసే విధంగా రైల్వే బోర్డుకు ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర మంత్రిని కోరామని రాఘవయ్య తెలియచేశారు.

తిరుపతి, కాకినాడకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రయాణికుల రద్దీ పెరగడంతో హైదరాబాద్ నుండి తిరుపతి, కాకి నాడకు ప్రత్యేక రైళ్లు నడి పిం చబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. తిరుపతి ప్రత్యేక రైలు 16వ తేదీన 18.50 గంటలకు హైదరాబాద్‌లో బయ లుదేరి మరుసటి రోజు 08.50 గంటలకు తిరుపతి చేరు కుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు తిరుపతిలో 18వ తేదీన 17.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 05.00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుందన్నారు. కాకినాడ ప్రత్యేక రైలు 16వ తేదీన 18.50 గంటలకు హైదరాబాద్‌లో బయ లుదేరి మరుసటి రోజు 05.30 గంట లకు కాకినాడ టౌన్ చేరు కుంటుంది.

తిరుగు ప్రయాణంలో కాకినాడలో ఈ రైలు 18వ తేదీన 18.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 06.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. మార్గ మధ్యలోని అన్ని ప్రధానమైన రైల్వే స్టేషన్లలో ఈ ప్రత్యేక రైళ్లను నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు.

ప్రియా ప్రకాశ్‌కు షాక్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తన కొంటె చూపులతో కుర్రకారు మనసులను అమాంతం దోచేసింది. గత నాలుగు రోజులుగా సోషల్ మీడియాలో ఆమె ఒక ట్రెండింగ్. తనే ప్రియా ప్రకాశ్ వారియర్. కేరళకు చెందిన ఈ అమ్మడు ఒక్క టీజర్‌తోనే వార్తల్లోనిలిచింది. తన కనుసైగలతో యువతను కట్టిపడేసింది. లక్షలాది మంది యువతీ యువకులు ఈ వీడియోను తమ వాట్సప్ స్టేటస్‌గా పెట్టుకున్నా రంటే అతిశయోక్తి కాదు. అయితే ఈ బ్యూటీపై హైదరాబాద్‌లో పోలీస్ కేసు నమోదైంది.

మూసీ ఆక్రమణలపై పోరాటం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లో మూసీనది ఆక్రమణలపై పోరాటం చేయనున్నట్లు ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి చెప్పారు. మూసీనదికి ఇరువైపుల కట్టిన గోడలు కూలగొట్టి ఆక్రమిస్తున్నారని, దీంతో నది వెడల్పు తగ్గిపోయి వరదలు వచ్చినపుడు ముంపు ఏర్పడుతుందని ఆయన చెప్పారు. మూసీనది పరీవాహక ప్రాంతంలో కూడా నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు వచ్చాయని, వీటన్నింటిపై పర్యావరణ, సామాజికవేత్తలు స్పందించాల్సి ఉందని బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. పర్యావరణాన్ని దెబ్బతీసే విధంగా వస్తున్న కట్టడాలు, ఆక్రమణలపై గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించనున్నట్లు పురుషోత్తంరెడ్డి చెప్పారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, అందరికీ పౌష్టికాహారం కల్పిస్తూ అసమానతలు తగ్గించినపుడే సుస్థిర అభివృద్ధి సాధ్యమని ఐక్యరాజ్య సమితి (ఐరాస) స్పష్టంచేసిందని ఆయన గుర్తుచేశారు.గ్రీన్ రెవల్యూషన్ పేరుతో అభివృద్ధి సాధించినప్పటికీ అది వాతావరణాన్ని కలుషితం చేసిందని, ఇప్పటికైనా సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి మళ్ళించాలని ఆయన సూచించారు.

పర్యావరణవేత్తలకు ప్రతి ఏటా అవార్డులు

సుస్థిర అభివృద్ధికి కృషిచేసే వారికి ఎర్త్ లీడర్స్ అవార్డులు ఇవ్వనున్నట్లు పురుషోత్తంరెడ్డి ఫౌండేషన్ తెలిపింది. పురుషోత్తంరెడ్డి శిష్యబృందం 32 మంది ఈ ఫౌండేషన్ ఏర్పాటుచేసి ప్రతి ఏటా అంతర్జాతీయ, దేశీయంగా ఇద్దరిని ఎంపికచేసి ఈ అవార్డులు ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ సభ్యుడు డాక్టర్ ఎన్.సాయిభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జె.బాపురెడ్డి, ఆర్.దిలీప్‌రెడ్డి, దొంతి నర్సింహారెడ్డి, కె.లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

'అలిపిరి' నిందితులు అరెస్ట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై సుమారు 15 సంవత్సరాల క్రితం తిరుపతిలోని అలిపిరిలో బాంబు దాడికి పాల్పడ్డ ఘటనతో సంబంధం ఉన్న మావోయిస్టు దంపతులు పోలీసులకు చిక్కారు. వీరిద్దరూ పట్టుబడ్డ సమయంలో తప్పించుకున్న మరో 10 మంది మావోయిస్టుల కోసం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రా ల సరిహద్దుల్లో తమిళనాడు క్యూబ్రాంచ్ పోలీసులు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని తిరువళ్ళూరు సమీపంలోని పూండి గ్రామంలో వెర్రి వీర పాండ్యన్ అనే వ్యక్తి ఇంట్లో కొంత మంది మావోయిస్టులు సమా వేశమవుతున్నారన్న సమాచారం ఈ నెల 10 వ తేదీన పోలీసులకు చేరింది. దీంతో జిల్లా ఎస్పి శిబిచక్రవర్తి నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా తనిఖీలను తీవ్రం చేశారు. ఈ తనిఖీలలో దశరథన్, సెన్బగవళ్ళి అనే ఇద్దరు పట్టుబడ్డారు. వారి వద్ద ఉన్న చేతి సంచులను పరిశీలించగా విప్లవ సాహిత్యం బయట పడింది. అనంతరం విచారించగా పట్టుబడ్డ ఇద్దరూ భార్యాభర్తలని బయటపడింది.

చాపకింద నీరులా టీబీ!

•ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందేవారి వివరాలు నమోదు •ప్రైవేటులో చికిత్స పొందితే నమోదు నిల్ •సమాచారం ఇవ్వని ఆస్పత్రులు •అధునాతన ల్యాబ్‌ను సమకూర్చుకున్న స్టేట్ టీబీ డెమో సెంటర్



మొబైల్‌వ్యాన్ ఏర్పాటు చేసిన ల్యాబ్
ఇన్ సెట్‌లో మొబైల్ వాహనం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో క్షయ వ్యాధి చాప కింద నిరులా విస్తరిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందే వారి సంఖ్య రోజు రోజుకు ఎక్కువగా ఉంటోంది. ఈ వ్యాధి నియంత్రణకు కేం ద్రం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాల వైద్య ఆరోగ్య శాఖ గతంలోనే సూచించింది. 2025 సం వత్సరానికి దేశ వ్యాప్తంగా ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూ లించాలని ప్రపంచ దేశాలతో కలిసి కట్టుగా మనదేశం కృషి చేస్తోంది. క్షయ వ్యాధి నిర్మూలనపై మనరాష్ట్రం మాత్రం 2023 సంవత్సరం వరకే దీనిని పూర్తిగా అరికట్టాలన్న ఉద్దేశ్యంతో పనిచేస్తోంది. దీనికోసం ఇంటింటికీ తిరిగి వ్యాధిగ్రస్తులను గుర్తించే పనిలో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ కేసులను గుర్తించిన వెంటనే వారి వివరాలను అనుసంధానం చేస్తూ డాటాబేస్‌ను తయారుచేసే పనిలోఇప్పటికే రాష్ట్ర అధికారులు నిమగ్నమ య్యారు.

ఇండియాతో 1998 సంవత్సరంలో అవగాహన ఒప్పందం

క్షయ వ్యాధిని సమూలంగా రూపుమాపడానికి అమెరికాకు చెందిన యూఎస్ఏఐడీ (ఓఎన్జీఓ) సంస్థ ఇండియాతో 1998 సంవత్సరంలో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీనికోసం అప్పటి నుంచి 140 డాలర్లను ఈ వ్యాధి నిర్మూలనకు ఖర్చు చేసినట్టు గతంలో ఈ సంస్థ ప్రకటించింది.ప్రతి లక్షమందిలో 217 మంది ఈ వ్యాధిన బారిన పడుతున్నట్టు ఓ సర్వేలో తేలింది.

రాష్ట్ర వ్యాప్తంగా 391 డయాగ్నస్టిక్ సెంటర్లు

రాష్ట్రవ్యాప్తంగా టీబీ వ్యాధిని గుర్తించడానికి ప్రభుత్వం 391 డయాగ్నస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఈ వ్యాధి గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్జీఓల సహకారం కూడా తీసుకుంటుంది. ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ఇంటింటికీ తిరిగి ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తారు.

నల్లగొండ, రంగారెడ్డి, ఖమ్మం, హైదరాబాద్‌లోని పాతబస్తీల్లో ఎక్కువగా ఈ వ్యాధిగ్రస్తులు ఉన్నట్టు కొన్ని సర్వేలో తేలింది. ఆదిలాబాద్ జిల్లాలో మార్చి చివరివరకు ఈ వ్యాధి లక్షణాలను గుర్తించే అధునాతన ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నారు.

ప్రస్తుతం 56 శాతం మందికే చికిత్స పొందుతున్నారు

ప్రస్తుతం కొత్త వ్యాధిగ్రస్తుల్లో 56 శాతం మందే చికిత్స పొందుతున్నట్టు అధికారికంగా నమోదయ్యింది. దీనిని బట్టి దాదాపు 34,800 కేసులు గుర్తింపునకు నోచుకోలేదని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అంచనాకు వచ్చింది. తెలంగాణ సహాదేశవ్యాప్తంగా ఈ వ్యాధి తీవ్రత, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ తాజాగా రాష్ట్రానికి లేఖ పంపింది. బాధితుల్లో కొందరు పూర్తిస్థాయిలో ఔషధాలు వాడకుండా మధ్యలోనే మానేస్తుండగా కొంత కాలానికి వ్యాధి తిరగతోడుతుంది.

ప్రతి జిల్లాకు తిరగనున్న మొబైల్ డయాగ్నస్టిక్ వ్యాన్

మామూలుగా టీబీ వ్యాధి పరీక్ష చేయించాలంటే ప్రైవేటు ఆస్పత్రుల్లో 4నుంచి 5 వేల వరకు ఖర్చు అవుతోంది. దీంతో డయాగ్నస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేసింది. దీంతో పాటు వచ్చేనెల నుంచి ఆర్ఎన్‌టీసీపీ కింద కేంద్ర అందిస్తున్న మొబైల్ డయాగ్నస్టిక్ వ్యాన్‌ను ప్రతి జిల్లాకు పంపించి ఉచితంగా పరీక్షలను నిర్ధా రించాలని ప్రభుత్వం భావిస్తోంది.

చికిత్స పొందినన్నీ రోజులు రూ.500లు జమ

చికిత్స పొందుతున్నన్నీ రోజులు గిరిజన రోగులకు నెలకు రూ.500ల వరకు వారి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. కొత్త రోగి ఔషధాలు క్రమం తప్పకుండా తీసుకునేలా ప్రోత్సహించే ఆరోగ్య సిబ్బందికి రూ.1000 ఇప్పటికే గుర్తించిన రోగి మందులు ఉపయోగించేలా చూస్తే క్షయ తిరగబడిన రోగి ఔషధాలు వాడే బాధ్యత తీసుకుంటే రూ.5వేల చొప్పు ఒకే దఫాగా అందిస్తారు.



టీసీఎస్ ఎంటర్ ప్రైజెస్ డేటాలేక్ ఆవిష్కరణ

న్యూయార్కు / ముంబై : టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) బుధ వారం నాడు ఎంటర్‌ప్రైజెస్ డేటా లేక్ (ఈడీఎల్) అడ్వాన్స్డ్ ఎనలిటిక్స్‌ను అమెజాన్ వెబ్‌స ర్వీసెస్ (ఎడబ్ల్యుఎస్) కోసం ఆవిష్కరించింది. ఈ సేవలు కావాలనుకొనే కంపెనీలు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగానికి చెం దిన వారికి కూడా ఈ సేవలందిస్తామని ప్రకటించింది. బ్యాంకింగ్‌తో పాటు ఫైనాన్షియల్ కంపెనీలు ఇతర వ్యాపారాలు తమ డేటా ను వేగవంతంగా పం పించుకోవచ్చునని తెలిపింది. సాధారణంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీ సెస్‌లో డేటా పంపించడంలో కొన్ని ఇబ్బందు లు తలెత్తుతుం టాయని, దీంతో బ్యాం కులు, ఫైనా న్షియల్ సర్వీసెస్‌లు ప్రొ డె కంటే కస్టమర్‌లను దృష్టిలో ఉంచుకొన్ని కొత్త ప్లాట్‌ఫాంకు మారిపోవాలని సూ చిం చింది. ఎం దుకంటే బ్యాం కింగ్, ఫైనాన్షియల్ రంగాల్లో పెద్దమొత్తంలో డేటా చెయిన్‌తో కూడుకున్నదని, కస్టమర్‌కు వీలైనంత త్వరగా డేటా అంది వ్వా ల్సిన బాధ్యత బ్యాంకులపై ఉం టుందని టీసీఎస్ గ్లోబల్ హెడ్ అండ్ అల యె న్స్ టె క్నాలజీ యూనిట్ రామన్ వెంకటరామన్ ఒక ప్ర కటనలో తెలి పారు. ప్రపం చవ్యా ప్తంగా ఉన్న తమ క స్టమర్లు కొత్త టెక్నాలజీ ద్వారా లబ్ది పొందవచ్చునని తెలిపారు.



ఎఫ్‌పీఐలను మించిన

దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు

• గతేడాది మొత్తం పెట్టుబడి 1400కోట్ల డాలర్లు

న్యూఢిల్లీ : భారత్ స్టాక్ మార్కెట్లో గతేడాది దేశీయ ఇన్వెస్టర్లు రికార్డు స్థాయిలో 1400 కోట్ల డాలర్లు (రూ.90,700 కోట్లు) పెట్టుబడులు పెట్టాయి. విదేశీ ఇన్వెస్టర్లతో పోల్చుకుంటే ఇది రెట్టింపు అని తాజా నివేదికలో వెల్లడైంది. దేశీయ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడంతో విదేశీ ఇన్వెస్టర్ల ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. దీంతో మార్కెట్లు స్థిరపడతాయి. భారతీయ ఫండ్ మేనేజర్లే కాకుండా దేశీయ ఇన్వెస్టర్ కూడామార్కెట్లో పెద్ద కరెక్షన్ రావాలని చూస్తున్నారని.. ఎందుకంటే కరెక్షన్ వస్తే పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టాలని వారి ఆలోచన అని మార్నింగ్‌స్టార్ సీనియర్ రీసెర్చి ఎనలిస్టు హిమాంషు శ్రీవాత్సవ తెలిపారు. గతేడాది మొత్తానికి చూస్తే దేశీయ ఇన్వెస్టర్లు రూ.90,700 కోట్లు పెట్టుబడులు పెడితే, విదేశీ ఇన్వెస్టర్లు రూ.51,000 కోట్లు మాత్రమే పె ట్టుబడులు పెట్టాయి. కేవలం మార్చి నెలలో మాత్రం దేశీయ ఇన్వెస్టర్లు షేర్లని వి క్రయిం చారు. అటు తర్వాత నుంచి వరుసగా కొనుగోళ్లకు పాల్పడ్డారని త్రెలియజేశారు.

అపోలో లాభం రూ.67.44కోట్లు



న్యూఢిల్లీ : అపోలో హాస్పిటల్స్ ఎంటర్ ప్రైజెస్ డిసెంబర్‌తో ము గిసిన త్రై మాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతి పది కన నిక రలాభం 7.4 శా తం క్షీణించి రూ. 67 .44 కోట్ల కు దిగి వచ్చింది. దీనికి ప్రధాన కారణం కంపెనీ వ్యయం పెర గడమేనని బీ ఎస్‌ఈకి సమా చారం అం దించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.72.80 కోట్లని.. రెవెన్యూ విష యానికి వస్తే డిసెంబర్ త్రైమాసికంలో రూ.1896.14 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏ డాది ఇదే త్రైమాసికంలో రూ.1680.61 కోట్లని తెలియజేసింది. అయితే కంపెనీ వ్యయం రూ.1806.16 కోట్లకు చేరిపోగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 1599.62 కోట్లుగా తేలింది. హెల్త్‌కేర్ సర్వీసెస్ ద్వారా రూ.1,008.21 కోట్ల రెవెన్యూ ఆర్జిస్తే.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.891.89కోట్లుగా ఉంది. ఫార్మా వ్యాపారం రెవెన్యూ రూ.888.09 కోట్లు కాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.788.84 కోట్లని బీఎస్‌ఈకి సమాచారం అందించింది.

లేటెస్ట్ వన్ డాట్‌కామ్

రెవెన్యూ 18శాతం వృద్ధి

హైదరాబాద్ : పాల్‌రెడ్ టెక్నాలజీస్ లిమిటెడ్‌కు చెందిన లేటెస్ట్‌వన్ డాట్ కామ్ ...డిసెంబర్ త్రైమాసికంలో రెవెన్యూ 18 శాతం వృద్ధితో రూ.13.91కోట్ల ఆర్జించినట్లు ప్రకటంచింది. అదే సమయంలో నష్టాలను కూడా 14 శాతం నుంచి ఆరు శాతానికి తగ్గించుకుందన్నట్లు తెలిపింది. ఈ- కామర్స్ రంగానికి చెందిన కంపెనీ వరుసగా గత రెండు ఆర్థిక సంవత్సరాల నుంచి మెరుగైన ఆర్థిక ఫలితాలను సాధిస్తోందని పేర్కొంది. గత తొమ్మిది నెలల నుంచి రోజుకు 3,500 నుంచి 5,000 వరకు ఆర్డర్లను ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపింది.

గ్యారెంటీ పీఎన్‌బీది...

షోకు నీరవ్‌మోడీది!

• యూనియన్, అలహాబాద్, యాక్సిస్ బ్యాంకులకు సెగ



హైదరాబాద్ : ప్రభుత్వరంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11,400 కోట్ల మోసం జరిగిందన్న వార్త బ్యాంకింగ్ రంగాన్ని కుదిపేసింది. కేంద్రంలో ఆర్థికమంత్రిత్వశాఖ షాక్ గురైంది. బిలియనీర్ నగల వ్యాపారి నీరావ్ మోడీ మోసపూరితంగా ముంబైలోని పీఎన్‌బీ బ్రాంచీ నుంచి లెటర్ ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఒక విధంగా చెప్పాలంటే బ్యాంకు గ్యారంటీ) తీసుకున్నారు. ఈ బ్యాంక్ గ్యారంటీ దక్కించుకోవడానికి ఆయన బ్యాంకుకు చెందిన ద్వితీయ శ్రేణి అధికారులతో సహాయంతో దక్కించుకున్నారు. పీఎన్‌బీ బ్యాంకు గ్యారంటీని తీసుకుని మోడీ విదేశీ బ్యాంకులతో పాటు భారతీయ బ్యాంకుల నుంచి వేలాది కోట్ల రూపాయల రుణాలు తీసుకున్నారు. దీనిపై సీబీఐ విచారణ చేపట్టింది. బ్యాం కు యాజమాన్యం పది మంది అధికారులు సస్పెన్షన్ చేసింది. రూ.11,400 కోట్ల పీఎన్‌బీఐ గ్యారంటీతో మోడీ ఇతర ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులతో పాటు ప్రైవేట్ బ్యాంకుల నుంచి రుణాలను తీసుకున్నారు. అవి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకులున్నాయి. ఈ బ్యాంకులు కూడా పీఎన్‌బీ ఇచ్చిన బ్యాంకు గ్యారంటీని తీసుకుని రుణాలు ఇచ్చినట్లు చెప్పుకోచ్చాయి. సాధారణంగా బ్యాంకులు వ్యాపారులకు లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ (ఎల్‌ఓయు)లను జారీ చేస్తుంటాయి. ఇక్కడ పీఎన్‌బీ జారీ చేసిన ఎల్‌ఓయును తీసుకుని బ్యాంకులు మోడీకి పెద్దమొత్తంలో రుణాలు ఇచ్చాయి. సాధారణంగా బ్యాంకుల ఎల్‌ఓయులను వ్యాపారులకు జారీ చేస్తుంటాయి. ఈ లెటర్‌ను తీసుకొని సదరు వ్యాపారవేత్త ఆ బ్యాంకు బ్రాంచీ నుంచేకాకుండా ఇతర బ్యాంకుల నుంచి .. లేదా అవే బ్యాంకులు విదేశాల్లోని బ్రాంచీలు ఉంటే వాటిని రుణాలు తీసుకున్నారు. సాధారణంగా బ్యాంకులు నగల కంపెనీలతో మంచి సంబంధాలు కొనసాగి స్తుంటాయి. వారి వ్యాపార టర్నోవర్‌ను బ్యాలెన్స్‌షీట్లను బట్టి బ్యాంకులు వారిపై నమ్మకంతో ఎల్‌ఓయులు జారీ చేస్తుంటాయి.గత వారం పీఎన్‌బీకి సీబీఐకి చేసిన ఫిర్యాదులో నగల వ్యాపారి మోడీ మోసపూరితంగా జనవరి 16వ తేదీన ఎల్‌ఓయు దక్కించుకున్నారని తెలిపింది. దీంతో విదేశాల్లో బ్రాంచీలపై నియంత్రణా సంస్థలుదృష్టి పెట్టాయి. నీవార్‌మోడీకి చెందిన నగల కంపెనీకి విదేశాల్లో పెద్ద షోరూం లున్నాయి. ఆయనకు హాంగ్‌కాంగ్, దుబాయి, న్యూయార్కులో షాపులున్నాయి. బ్యాంకింగ్ వర్గాల సమాచారం ప్రకారం ఆయన 2010 నుంచి బ్యాంకుల నుంచి క్రెడిట్ ఆధారిత ఎల్‌ఓయూ తీసుకుంటున్నారని తెలిసింది. పీఎన్‌బీఐ ఇచ్చే ఎల్‌ఓయులను గత కొన్ని సంవత్సరాల వరకు బ్యాంకులు అంగీకరించి మోడీకి డబ్బులు సమకూర్చి పెట్టాయి. చివరగా జనవరి 5వ తేదీన కూడా బ్యాంకులు మోడీ ఇచ్చిన పీఎన్‌బీ గ్యారంటీకి నగదు సమకూర్చాయి. ఇంతకు అసలు చిక్కు ఎక్కడ వచ్చిందంటే జనవరి 25వ తేదీన మోడీ చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో అసలు కథ బయటికి వచ్చింది. బ్యాంకింగ్ వర్గాల సమాచారం ప్రకారం పీఎన్‌బీ నగల వ్యాపారాన్ని అదనంగా పది శాతం మార్జిన్ కట్టాలని కోరింది. ఎంత రుణం తీసుకుంటారో దానికి అదనంగా పది శాతం ఇస్తే ఎల్‌ఓయు ఇస్తామని, లేదంటే ఎల్‌ఓయు ఉపసంహరించుకుటామని స్పష్టం చేసిందని చెబుతున్నారు. ఇతర బ్యాంకులు నుంచి వస్తున్న ఎల్‌ఓయు చెల్లింపులను చెల్లించడానికి పీఎన్‌బీ ఆయా బ్యాంకులకు డబ్బు చెల్లించడానికి నిరాకరించింది. దీంతో ఒక బ్యాంకు హాంగ్‌కాంగ్ సెంట్రల్ బ్యాంకుకు, రిజర్వుబ్యాంకుకు పీఎన్‌బీపై ఫిర్యాదు చేశాయి. అయితే ఎల్‌ఓయుపై ఇతర బ్యాంకులు ఇచ్చిన రుణాల గురించి ఆ బ్యాంకులు చెప్పేదేమిటంటే తాము వ్యక్తిని చూసి రుణం ఇవ్వమని.. పీఎన్‌బీఐ ఎల్‌ఓయు జారీ చేసింది కాబట్టి దాన్ని గౌరవించి రుణాలు ఇస్తామని స్పష్టంచేస్తున్నాయి. పీఎన్‌బీ జారీ చేసిన ఎల్‌ఓయును చూసి రూ.2,000 కోట్లు రుణాలు మంజూరు చేశామని పేరుచెప్పడానికి నిరాకరించిన బ్యాంకర్ ఒకరుచెప్పారు. దీనిపై హాంగ్‌కాంగ్ సెంట్రల్ బ్యాంకుకు ఫిర్యాదు కూడా చేసినట్లు, వివరాలు కూడా ఇచ్చినట్లు ఆ బ్యాంకర్ చప్పారు. ఇదిలా ఉండగా పీఎన్‌బీఐ బుధవారం నాడు బీఎస్‌ఈకి ముంబై బ్రాంచీలో 1.77 బిలియన్ డాలర్ల మోసం జరిగినట్లు గుర్తించినట్లు చెప్పింది. ఎంపిక చేసిన ఖాతాల్లోనే ఈ లావాదేవీలు జరిగాయని గుర్తించామని తెలిపింది.ఇదిలా ఉండగా పీఎన్‌బీఐలో జరిగిన మోసం ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది.

ఇప్పటికే మొండిబకాయిలతో కునారిల్లు తున్న పీఎస్‌యు బ్యాంకులను గాడిలో పెట్టాలని ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తోంది. దీనికి గాను రూ. 2.11 లక్షల కోట్ల మూలధనం ఇవ్వాలనుకుంది. తాజాగా రూ.88వేల కోట్ల మూలధనం కూడా బ్యాం కులకు మంజూరు చేసింది. తాజా పరిణామంలో ఆర్థికమంత్రిత్వశాఖ షాక్ గురైనా.. తర్వాత తబాయించుకుని పరిస్థితి చేయి దాటలేదని సర్ది చెబుతోంది.ఇక్కడ అసలు విషయానికి వస్తే పంజాబ్ నేషనల్ బ్యాంకు మొత్తం రూ.4.5 లక్షల అడ్వాన్స్‌లు ఇచ్చింది. అంటే రుణాలుగా చెప్పుకోవచ్చు. ఈ బ్యాంకు మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.36వేలకోట్లు.. మొత్తం ఇచ్చిన రుణాల్లో రూ.11,400 కోట్ల మోసం జరిగితే మొత్తం ఇచ్చిన అడ్వాన్స్‌లో 2.5 శాతం ఎన్‌పీఏగా మారిపోయినట్లు అని బ్యాంకర్లు చెబుతున్నారు. 2015లో ఢిల్లీలోని బ్యాంకు ఆఫ్ బరోడాలో బిలియన్ డాలర్ల స్కాం బయటపడింది. భారతీయ కరెన్సీ ప్రకారం రూ.6 లక్షల కోట్లు చెప్పుకోవచ్చు. ఇక్కడ సిబ్బందితో వ్యాపారులు కుమ్మక్కయ్యారు. ఇలాంటి మోసాలు పీఎస్‌యు బ్యాంకుల్లో ఇంకా ఎన్ని వెలుగు చూడాల్సి వస్తోందో కాలమే చెప్పాలి.

జీఎంఆర్ నష్టాలు

రూ. 566 కోట్లు

హైదరాబాద్ : జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరనష్టం రూ.568.94 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.643.44 కోట్లు ఆర్జించినట్లు బీఎస్‌ఈకి కంపెనీ సమాచారం అందించింది. కంపెనీ ఆదాయం కూడా స్వల్పంగా తగ్గి రూ.2295.83 కోట్లకు దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2587.26 కోట్లుగా ఉంది. అదే సమయంలో కంపెనీ వ్యయం కూడా కాస్తా దిగి రూ.2487.90 కోట్లకు దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.2623.74కోట్లని తెలిపింది. జీఎంఆర్ గ్రూపు విషయానికి గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ విమానాశ్రయాలు, ఎనర్జీ, రవాణా, పట్టన మౌలికరంగాల్లో వ్యాపారాలు చేస్తోంది. కంపెనీ ఫోర్టుపోలియో విషయానికి వస్తే ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, హైదరాబాద్‌లో రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రమయం, మాక్టాన్ సెబు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును మెగావైడ్ భాగస్వామ్యంతో ఫిలిప్పీన్స్‌లో నిర్మిస్తోంది. అలాగే గోవాలో మోపా గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మిస్తోంది. గ్రీస్‌లో కూడా భాగస్వామ్యంలో విమానాశ్రయాలు నిర్మించి .. నిర్వహిస్తుంది. అలాగే ఢిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాలను ఆనుకొని స్మార్ట్‌సిటిలను నిర్మిస్తుంది.



రీసైక్లింగ్ మెటీరియల్‌తో

అదానీ విల్‌మార్ వంటనూనె ప్యాకింగ్

హైదరాబాద్: వంటనూనెల రంగంలో మార్కెట్ లీడర్ అదానీ విల్‌మార్ లిమిటెడ్ (ఎడబ్ల్యుఎల్), మార్కెట్లో ఫార్చ్యూన్ ఎడిబుల్ ఆయిల్ బ్రాండ్‌ను (వంటనూనె)ను విక్రయిస్తోంది. పర్యావరణానికి హానికలిగించేప్యాకేజికి బదులు రీసైక్లింగ్ మెటిరియల్ వినియోగించి కొత్త ప్యాక్‌లో ఫార్చ్యూన్ వంటానూనెలు త్వరలో మార్కెట్లో విడుదల చేయబోతోంది. ఒక లీటర్ వంటనూనెను ప్యాక్ దేశంలో మొట్టమొదటిసారి మార్కెట్లో విడుదల చేస్తామని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఈఫీ సర్ అగ్నుష్ మాలిక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే రోజుల్లో కంపెనీకి చెందిన ఇతర బ్రాండ్‌లను కూడా రీసైక్లింగ్ మెటిరియల్ ప్యాకింగ్‌ను వినియోగిస్తామని ఆయన చెప్పారు. అదానీ గ్రూపు, విల్‌మార్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సింగపూర్‌లో 1999లో ప్రారంభించారు. ప్రస్తుతం మార్కెట్లో రూ.22వేల కోట్ల వ్యాపారం చేస్తోంది. దేశీయ వంట నూనెల మార్కెట్లో 21 శాతం వాటాను కైవసం చేసుకుంది.

గ్రాసీమ్ ఇండస్ట్రీస్‌కు

ఐడియా సెగ!

• తగ్గిన లాభాలు • క్యూ3లో రూ. 787కోట్లు



న్యూఢిల్లీ : ఆదిత్యబిర్లా గ్రూపునకు చెందిన గ్రాసీమ్ ఇండస్ట్రీస్ డిసెంబర్‌తో ము గిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభం రూ. 786. 87 కోట్లు ఆర్జిం చింది. కంపె నీకి అ ను బంధ సంస్థ నష్టా లు శాప ంగా మారాయి. క్రితం ఏడా ది ఇదే త్రైమాసి కంలో కంపెనీ ని కరలాభం రూ.952.33 కోట్లని బీఎస్ ఈకి స మా చారం అందించింది. మొత్తం ఆదాయం క్యూ3లో రూ.15, 523. 75కోట్లు కాగా క్రి తం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 7, 743.51 కోట్లని తెలి పింది. అయితే డిసెం బర్ త్రైమాసికం ఆదాయాన్ని గతేడా ది తో పోల్చు చూడరాదని కోరింది. ఎందు కంటే ఆదిత్యబిర్లా నువో కు చెందిన అ ను బంధ సంస్థ ఆల్ట్రాటెక్ సిమెంట్ గతేడాది జయప్రకాశ్ అసోసియేట్ లిమిటెడ్‌తో పాటు జెపీ సిమెంట్ కార్పొరేషన్‌ను గత ఏడాది టేకోవర్ చేసింది. దీంతో పాటు జులై 1,2017 నుంచి కొత్త జీఎస్టి అమల్లోకి వచ్చినందు వల్ల డిసెంబర్ త్రైమా సి కం రెవెన్యూ... అంతకం ముందు ఏడాదితో పో ల్చుకోరాదని పేర్కొంది. కంపెనీ లాభాలు తగ్గడానికి ప్రధాన కారణం ఐడియా సెల్యూలార్ లిమిటెడ్‌తో పాటు దా ని అనుబంధ సంస్థలు భారీగా నష్టపోవడమే కారణం తెలిపింది. కంపెనీకి చెం ది ను అనుబంధ సంస్థ ఫలితాలు ఇలా ఉన్నా యి. దేశీయ విస్కోస్‌స్టేపుల్ ఫైబ ర్(వీ ఎస్‌ఎఫ్) అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 9 ట శాతం పెరిగాయి. ఆల్ట్రాటెక్ రెవె న్యూ 34 శాతం పెరిగి రూ.8,019 కోట్లకు చే రిందని గ్రాసీం ఇండస్ట్రీస్ తెలిపింది. కంపెనీ భవిష్యత్తు గురించి ప్రస్తావిస్తూ.. వీ ఎస్‌ఎఫ్ వ్యాపారంపై మరింత ఫోకస్ పెడతామని, ప్రభుత్వం మౌలికరంగంతో పాటు గ్రామీణాల్లో చౌకగృ హాలను పెద్దెత్తున నిర్మిస్తామని ప్రకటించడంతో సిమెంట్‌కు డిమాండ్ ఉంటుం దన్నారు.

ఆస్పత్రుల్లో రోగులకు విక్రయించే ఆహారంపై జీఎస్టీ లేదు

న్యూఢిల్లీ : ఆసుపత్రుల్లో రోగులకు అందించే ఆహారంపై జీఎస్టీ విధించవద్దని డాక్టర్ల సలహాకు ప్రభుత్వం సమ్మతించింది. అయితే ఆస్పత్రుల్లో రోగులను చేర్చకపోతే (రోగుల తరపున వచ్చిన వారికి) మొత్తం ఆహారం విలువపై టాక్స్ చెల్లించాల్సి వస్తుందని స్పష్టం చేసింది. రెవెన్యూశాఖకు తరచూదీనిపైవచ్చే ప్రశ్నకు ప భుత్వం సమాధానంఇచ్చింది. వీటితో పాటు ఆస్పత్రుల్లో సీనియర్ డాక్టర్లు, కన్సెల్టెంట్లు, టెక్నిషియన్లసేవలపై కూడా జీఎస్టి విధించమని వివరించింది. వీరంతా హెల్త్‌కేర్ సర్వీసెస్‌కు కిందికి వస్తారని పేర్కొంది.

ఆంధ్రాబ్యాంకు ఎంసీఎల్‌ఆర్ రేట్లు తగ్గింపు

హైదరాబాద్ : ప్రభుత్వరంగానికి చెందిన ఆంధ్రాబ్యాంకు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ .. బేస్డ్ ఆన్ లెండింగ్ రేట్స్ (ఎంసీఎల్‌ఆర్)15.02.-18 నుంచి .. వోవర్‌నైట్ కాలానికి వడ్డీరేట్లను 15 బేసిస్ పాయింట్లు తగ్గించింది. 8.00 శాతంనుంచి 7.85 శాతానికి సవరించింది. ఒక నెల కాలపరిమితిపై10 బేసిస్ పాయింట్లు 8.05 శాతం నుంచి 7.95 శాతానికి మూడు నెలలు, ఆరు నెలలు, ఒక సంవత్సరం కాలానికి మాత్రం రేట్లలో ఎలాంటి మార్పుల్లేవు. ఒక సంవత్సరం కాలపరిమితిపై బ్యాంకు వడ్డీరేటు 8.40 శాతంలో ఎలాంటి మార్పులేదని ప్రకటనలో పేర్కొంది.

భారత్ మార్కెట్ కీలకం: బీఎండబ్ల్యు

• ప్రీమియం బైక్‌ల ధర రూ. 15.6లక్షల నుంచి రూ. 29.9లక్షలు • ఆటోఎక్స్ 2018లో ప్రదర్శన

న్యూఢిల్లీ : జర్మీనికి చెందిన లగ్జరీ కార్ల కంపెనీ బీఎండబ్ల్యుకు అనుబంధ సంస్థ బీఎండబ్ల్యు మోటోరాడ్ ప్రీమియం మోటారసైకిల్‌ను తయారు చేస్తోంది. భవిష్యత్తులో భారత్ తమకు కీలకమార్కెట్‌ని స్పష్టం చేసింది. గతేడాది భారత్ మార్కెట్లో ప్రీమియం బైక్‌లను విక్రయించడం మొదలు పెట్టింది. ప్రారంభించిన తొమ్మది నెలల కాలానికి 252 యూనిట్లు విక్రయించింది. వీటి ధర రూ.15.6 లక్షల నుంచి రూ. 29.9 లక్షలు (ఎక్స్ షోరూం). ప్రస్తు తం ఢిల్లీలో కొనుసాగుతున్న ఆటోఎక్స్‌లో కంపెనీ కొత్త రెండు మోడల్స్ బీఎండబ్ల్యు ఎఫ్ 750 జీఎస్ ధర రూ.12.2 లక్షలు, బీఎండబ్ల్యు ఎఫ్ 850 జీఎస్ దీని ధర రూ.13.7 లక్షలుగా ప్రకటించింది.



ఈ ఏడా ది రెండవ సగభాగం నుంచి కంపెనీ ఎంట్రీ లెవెల్ మోడల్స్‌ను జీ310 రేంజి బైక్‌లను మార్కెట్లో విడు దల చేస్తుంది. ఈ బైక్‌లను దీనికి దీర్ఘకాలిక భాగ స్వామి చెన్నైకు చెం దిన టీవీఎస్ మోటార్ కంపెనీలో ఉత్పత్తి చేస్తుంది. మొత్తానికి తమ ప్రీమిమం బైక్‌లకు భారత్ కీ లక మార్కెట్ అని బీఎం డబ్ల్యు మో టోరాం డ్ వైస్ ప్రెసి డెంట్, మార్కె టింగ్ సేల్స్ టిమో రెచ్ చెప్పా రు. దీంతో పాటు మెరు గైన డీలర్ నెట్‌వర్కు కూడాకావాల్సి ఉంటుంద న్నారు. ప్రస్తు తం దేశ వ్యా ప్తంగా ఏడు మంది డీలర్లు ఉన్నారు. ఈ ఏడాది చి వరినాటికి 10 డీలర్లకు పెంచు తామని.. కనీసం నాలుగు కొత్త మోడల్స్ ను తీసుకొస్తామ న్నారు. జీ310 రేంజి బైక్‌లను గ్లోబల్ మార్కెట్లు మెక్సికో, బ్రెజిల్, యూరోప్‌లో విడుదల చేశామని.. ఈ ఏడాది చివరి నాటికి భారత్ మార్కెట్లో ఎంట్రీ ఇస్తుందని వివరించారు.

సన్‌ఫార్మా లాభంలో 75శాతం ఆవిరి!

• క్యూ3లో రూ. 365కోట్లు

న్యూఢిల్లీ: ఫార్మా దిగ్గజం సన్‌ఫార్మా డిసెంబర్ త్రైమాసికం ఫలితాలు నిరుత్సాహానికి గురి చేశాయి. నికరలాభంలో 75.2శాతం క్షీణించి రూ.365.4 కోట్లకు దిగివచ్చాయి. అనుకోని పన్ను వ్యయం భారం లాభాలపై పడింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.1,471.82 కోట్లని కంపెనీ బీఎస్‌ఈకి సమాచా రం అందించింది. అనుకోకుండా రూ.513.02 కోట్ల వ్యయం భరించాల్సివచ్చిం దని తెలిపింది. రెవెన్యూ విషయానికి వస్తే 16 శాతం క్షీణించి రూ.6653.23 కోట్లకు దిగివచ్చింది. బీఎస్‌ఈ దాని షేరు 2.53 శాతం క్షీణించి రూ.574.45 వద్ద ముగిసింది.

స్వల్పంగా తగ్గిన టాటాపవర్ లాభాలు

• క్యూ3లో రూ. 611కోట్లు

ముంబై : టాటాపవర్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన చూస్తే స్వల్పంగా తగ్గి రూ.611 కోట్లకు దిగివచ్చింది. కంపెనీకి ఖర్చులతో పాటు రెవెన్యూ కూడా పెరిగింది. పన్ను లబ్ది కొంత వరకు కలిసొచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.619 కోట్లు ఆర్జించింది. కాగా రెవెన్యూ విషయానికి వస్తే 6 శాతం పెరిగి రూ.6,949 కోట్లు సాధించగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.6,574 కోట్లని ఒక ప్రకటనలో తెలియజేసింది.

లాభాల స్వీకరణ!


• భారీగా క్షీణించిన బ్యాంకు షేర్లు • 10శాతం నష్టపోయిన పీఎన్‌బీ • గ్లోబల్ మార్కెట్లో మిశ్రమ స్పందన • 114పాయింట్ల పతనం



ముంబై : మార్కెట్ చివరి గంటలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డంతో సెన్సెక్స్ 144 పాయింట్ల వరకు పతనమైంది. రిజర్వుబ్యాంకు మొండిబకాయిలు గుర్తించేందుకు కొత్త నిబంధనలు తీసుకొస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు కుప్పకూలాయి. ప్రభుత్వరంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) లో 1.77 బిలియన్ డాలర్లు రూ.11,335 కోట్ల మోసం జరిగినట్లు బహిర్గతం కావడంతో పీఎస్‌బీ షేరు 9.81 శాతం క్షీణించింది. బ్యాంకులు మొండిబకాయిలు త్వరగా గుర్తించడానికి కొన్ని నిబంధనలు కఠినతరం చేసింది. రుణాలు చెల్లింపులో జాప్యాన్ని గుర్తించడానికి ఆర్‌బీఐ కొన్ని నిబంధనలు తీసుకొచ్చింది. ఆర్‌బీఐ ఇప్పటికే అరడజను రుణపునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనను రద్దు చేసింది. దీనికి బదులు 180 రోజుల గడువు ఇచ్చింది. బ్యాంకులు వీటిని అంగీకరించిన వెంటనే డిఫాల్టర్‌ను ఖాతాను బ్యాంక్‌రప్టసీ కోడ్‌ను పంపిస్తుంది. ఇక మార్కెట్ల విషయానికి వస్తే ప్రారంభంలో 34,436.98 వద్ద ప్రారంభమైంది. అటు తర్వాత గ్లోబల్‌మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు రావడంతో వెంటనే సూచి 34,473.33 పాయింట్లకు ఎగబాకింది. అయితే చివరిగంటలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డంతో 144.52 పాయింట్లు క్షీణించి 34,155.95వద్ద ముగిసింది. నిఫ్టీ విషయానికి వస్తే 38.85 పాయింట్లు నష్టపోయి 10,500.90 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 10.590.55 నుంచి 10,456.65 మధ్య తచ్చాడింది. అయితే సోమవారం నాడు విడుదలైన డిసెంబర్ పారిశ్రామికోత్పత్తి 7.1శాతానికి ఎగబాకడంతో పాటు రిటైల్ ద్రవ్యోల్బణం కాస్తా తగ్గడంతో ఈ రెండు అంశాలు మార్కెట్లకు బాగా కలిసొచ్చాయి. ఆర్‌బీఐ రుణాల పునర్వ్యవస్థీకరణ పథకాన్ని రద్దు చేయడంతో పీఎస్‌యు బ్యాంకులు నష్టాల్లో మునిగిపోయాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ)లు సోమవారం నాడు రూ.814.11 కోట్ల షేర్లను విక్రయించగా, విదేశీయ ఇన్వెస్టర్లు రూ. 1342.70 కోట్ల షేర్లు కొనుగోలు చేసినట్లు మార్కెట్ గణాంకాలు తెలి యజేస్తున్నాయి. బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్ల విషయానికి వస్తే ఎస్ బ్యాంకు 4.40 శాతం, ఎస్‌బీఐ 4.06 శాతం, యాక్సిస్ బ్యాంకు 3.35 శాతం, ఐసీఐసీఐ బ్యాంకు 2.29 శాతం, బ్యాంకు ఆఫ్ బరోడా 1.75 శాతం వరకు నష్టపోయాయి. వీటితో పాటు ఒఎన్‌జీసీ, సన్‌ఫార్మా, టీసీఎస్, పవర్‌గ్రిడ్, ఎన్‌టిపీసీ, ఐటీసీ, బజాజ్‌ఆటో, మారుతి సుజుకి, డాక్టర్ రెడ్డీస్, టాటాస్టీల్, హీరోమోటోకార్ప్, ఇన్ఫోసిస్, కోటక్ మహీంద్రా బ్యాంకు, 2.62 శాతం వరకు నష్టపోయాయి. దీనికి వ్యతిరేకంగా కోల్ ఇండియా, రిల్, విప్రో, భారతి ఎయిర్‌టెల్, అదానీపోర్ట్స్, టాటామోటార్స్, ఎల్ అండ్‌టి, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, హెచ్‌యూఎల్, ఇండస్‌ఇండ్ బ్యాంకు 2.47 శాతం వరకు లాభపడ్డాయి. ఆసియా మార్కెట్లో విశ్రమ స్పందన కనిపించగా... యూరోపియన్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి.

ఎన్‌ఎండీఏ లాభం రూ.887కోట్లు

• క్యూ3లో 40శాతం వృద్ధి



హైదరాబాద్ : ప్రభుత్వరంగానికి చెందిన ఎన్‌ఎండీసీ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం టర్నోవర్ స్వల్పంగా ఒకశాతం తగ్గి రూ.2,469 కోట్లకు దిగివచ్చింది. అయితే పన్ను చెల్లించడానికి ముందు నికరలాభం 50 శాతం వృద్ధితో రూ.1,377 కోట్లకు చేరగా.. పన్ను చెల్లించిన తర్వాత రూ.887 కోట్లకు చేరిందని ఒక ప్రకటనలో తెలిపింది. అదే తొమ్మది నెలల కాలానికి చూస్తే టర్నోవర్‌లో 30 శాతం పెరిగి రూ.7,732 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే తొమ్మిది నెలల కాలానికి రూ.5,958 కోట్లుగా తేలింది. పన్ను చెల్లించడానికి ముందులాభం 37 శాతం పెరిగి రూ.4,187 కోట్లు కాగా.. అంతకు ముందుఏడాది ఇదే కాలంలో రూ.3062 కోట్లుగా తేలింది. పన్ను చెల్లించిన తర్వాత నికరలాభం 30 శాతం పెరిగి రూ.2,700 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదేకాలంలో రూ.2,077 కోట్లని ఎన్‌ఎండీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా ముడి ఇనుము ఉత్పత్తి తొమ్మిది నెలల కాలానికి 24.23 మిలియన్ టన్నులకు చేరింది. ఉత్పత్తిలో మూడు శాతం పెరిగింది. అయితే అమ్మకాల్లో మాత్రం ఒకశాతం క్షీణించి 25.24 మిలియన్ టన్నులకు దిగివచ్చింది. మూడు నెలల కాలానికి ముడి ఇనుము ఉత్పత్తి 12 శాతం క్షీణించి 8.56 మిలియన్ టన్నులకు దిగిరాగా.. అమ్మకాల విషయానికి వస్తే 20 శాతం క్షీణించి 8.06 మిలియన్ టన్నులకు దిగివచ్చిందని కంపెనీ ఒకప్రకటనలో తెలిపారు. మంగళవారం నాడు ఎన్ బైజేంద్రకుమార్ చైర్మన్ నేతృత్వంలో బోర్డు సమావేశంలో క్యూ3 ఫలితాలను ఆమోదించారు.

అవినీతి అధికారులకు అందలం

● పాఠశాల విద్యాశాఖలో ఏడుగురికి పదోన్నతులు ● ఒకరు సస్పెన్షన్‌లో ఉండటంతో నిలిపివేత ●ఆరుగురికి జిల్లా విద్యాశాఖాధికారులుగా పదోన్నతులు ●రెండు రోజుల్లో ఉత్తర్వులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: పాఠశాల విద్య శాఖలో కొందరు అధికారులకు పదోన్నతులు లభించనున్నాయి. ప్రభుత్వం అధికారులకు పదోన్నతులు ఇచ్చి జిల్లా విద్యాశాఖాధికారులుగా నియమించనుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం రెండు రోజుల్లో జారీ చేయనుంది. కొద్ది రోజుల క్రితం జరిగిన పదోన్నతుల కమిటీ 7 మందికి పదోన్నతులు కల్పించవచ్చని పేర్కొంటూ తమ సిఫారసులను ప్రభుత్వానికి సమర్పించింది. అయితే ఇందులో ఒకరిపై అవినీతి ఆరోపణలు ఉండటంతో ఆ అధికారిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ప్రస్తుతం ఆ అధికారి సస్పెన్షన్‌లో ఉండటంతో మిగిలిన ఆరు మందికి పదోన్నతులను ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం రెండు రోజుల్లో వెలువరించే అవకాశం ఉంది. పదోన్నతుల అనంతరం రాష్ట్రంలోని 6 జిల్లాలకు పర్మినెంట్ జిల్లా విద్యాశాఖాధికారులు(డీఈవో) నియామకం కానున్నారు. పదోన్నతులు పొందుతున్న వారిలో ముగ్గురు డిప్యూటీ జిల్లా విద్యాశాఖాధికారులుగా కాగా, మరో ఇద్దరు ఏడీలుగా, ఒకరు ఎస్‌సీఈఆర్‌టిఅధికారి ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలకు మాత్రమే పర్మినెంట్ డీఈవోలు ఉన్నారు. పదోన్నతుల అనంతరం మొత్తం 9 జిల్లాలకు పర్మినెంట్ డీఈవోలు కొనసాగనున్నారు. రాష్ట్రంలోని పాత 10 ఉమ్మడి జిల్లాలకు మాత్రమే పర్మినెంట్ డీఈవో పోస్టులు మంజూరు అయ్యాయి. కొత్తగా ఏర్పడిన 21 జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌డీఈవోలను నియమించిన ప్రభుత్వం వారితోనే కాలం వెళ్లదీస్తోంది.

అధికారులపై అవినీతి ఆరోపణలు..!

పదోన్నతులు పొందుతున్న వారిలో సుమారు నలుగురు అధికారులపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. పదోన్నతులు పొందిన వారిలో మేడ్చల్ జిల్లా విద్యాశాఖాధికారిగా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారిపై అవినీతి ఆరోపణలు రావడంతో ప్రస్తుతం ఆ అధికారి పదోన్నతిని ప్రభుత్వం నిలిపివేసినట్టు సమాచారం. ఆ అధికారి కాకుండా పదోన్నతులు పొందుతున్న వారిలో మరో ముగ్గురిపై కూడా అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఉపాధ్యాయులపై ఆరోపణల నేపథ్యంలో వారికి తిరిగి పోస్టింగ్ ఇచ్చే క్రమంలో అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు వచ్చి, ఆ విషయం పత్రికల్లో రావడంతో ఆ అధికారిని వ్యవహారశైలిపై స్థానిక జిల్లా కలెక్టర్ మందలించినట్టు తెలిసింది. మరో జిల్లా విద్యాశాఖాధికారిగా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారిపై కూడా ఆరోపణలు ఉన్నాయి. అధికారులపై అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ, రోస్టర్ పాయింట్లు, సీనియారిటీ పరంగా పదోన్నతులకు డీపీసీ సిఫారసు చేసింది. పదోన్నతులు పొందుతున్న వారిలో ఒకరు తెలంగాణ రాష్ట్రా నికి చెందిన వారు కాదని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అవినీతికి అడ్డాగా మారాయి: అయ్యప్ప, ఏబివిపి

రాష్ట్రంలోని జిల్లా విద్యాశాఖాధికారుల(డీఈవో) కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారాయని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబివిపి) విమర్శించారు. డీఈవో ఆఫీసుల్లో ఏ పని కావాలన్నా డబ్బులు లేకుండా కావడం లేదని మండిపడ్డారు. డీఈవోలు మరిబరితెగించి లంచాలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ మధ్యకాలంలో జరిగిన సంఘటనలే ఇందుకు తార్కాణమని అన్నారు. హైదరాబాద్, మేడ్చల్, సూర్యాపేట, కామారెడ్డి జిల్లాల్లో జరిగిన ఘటనలు వీటిని తేటతెల్లం చేస్తున్నాయని అన్నారు. అవినీతి ఆరోపణలు లేకుండా నిజాయితీపరులకు పదోన్నతులు కల్పించాలని అయ్యప్ప డిమాండ్ చేశారు.

అటవీ ఉత్పత్తుల చట్టంలో మార్పులు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ అటవీ ఉత్పత్తులు, ట్రాన్సిట్ నిబంధనల ప్రకారం 1970 చట్టంలో కొ న్ని మార్పులు చేస్తూ బుధవా రం ప్రభు త్వం ఉత్తర్వులను జారీ చేసింది. వనపర్తి, వరంగల్, జనగాం జిల్లా లకు చెందిన రైతులు జనవరి 30 వ తేదీన ప్రభుత్వానికి ఒక వినతిపత్రాన్ని అందించారు. నిమ్మ, రావి, నేరేడు, నల్లతుమ్మ, జామ, వేపలను తరలించే సందర్భంలో కేసులు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ చెట్లను షెడ్యూల్-2 నుంచి మినహాయించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆయా చెట్లు తమ భూమిలో పెరుగుతున్నాయని వాటిని వేరే చోటుకు తరలించేందుకు తమకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి రైతులు విజ్ఞప్తి చేశారు.

19 నుంచి టీఆర్‌టీ హాల్‌టికెట్స్ డౌన్‌లోడ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం కోసం నిర్వహించనున్న టిఆర్‌టి పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను 19 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. టిఆర్‌టికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల బయోడేటాలో తప్పులను సరిచేసుకోవడం కోసం మూడోసారి చివరి అవకాశాన్ని 16 ఉదయం 5 గంటల వరకు కల్పించినట్టు కమిషన్ కార్యదర్శి వాణిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీడియం, పేరులో తప్పులు తదితర వాటిలో తప్పులను సరి చేసుకోవాలని సూచించారు. స్థానికతకు సంబంధించి 31 జిల్లాలకు చెందిన వారు పాత 10 జిల్లాల ప్రకారం స్థానికతను 15 సాయంత్రం లోపు సరిచేసుకోవాలని సూచించారు.

నల్సార్‌కు రూ. 77 లక్షలు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయానికి రూ. 77,03,000 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.2017-18 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి సంబంధించి గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద విశ్వవిద్యాలయంలో క్యాంపస్ అభివృద్ధికి ఈ నిధులు వినియోగిస్తారు. రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి వి నిరంజన్ రావు ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అటవీ సిబ్బందికి ఆపోలో ఉచిత వైద్యం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : అడవుల్లో ప్రత్యక్షంగా పనిచేస్తున్న అటవీ సిబ్బందికి ఉచిత వైద్య చికిత్సను అందించడంలో భాగంగా డబ్ల్యు డబ్ల్యుఎఫ్-ఇండియా మరియు అపోలో ఆస్పత్రి ఫౌండేషన్ మధ్య భాగస్వామ్య ఒప్పందం పునరుద్ధిరస్తున్నట్టు ఆపోలో ఆస్పత్రి వైస్ ఛైర్‌పర్సన్ శ్రీమతి ఉపాసన కామినేని కొణిదెల తెలిపారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డబ్ల్యు డబ్ల్యుఎఫ్-ఇండియా, సీఓఓ కరణ్‌భల్లాతో పాటు ఉపాసన దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఉపాసన మాట్లాడుతూ అటవీశాఖ సిబ్బందికి, అడవుల్లో నివసించే స్థానికులకు అత్యవసర వైద్య సహాయాన్ని అందించేందుకు 2015 సంవత్సరంలో ఒక భాగస్వామ్యాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. 2018 ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చే ఈ భాగస్వామ్యం ఒక సంవత్సర కాలం పాటు కొనసాగుతుందని ఆమె తెలిపారు. 18 రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలు కొనసాగుతాయన్నారు. ఈ భాగస్వామ్యం కింద అటవీ సిబ్బందికి మరియు అడవుల్లో నివసించే స్థానికులకు వైద్యశిబిరాలను ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. ఈ రెండు సంస్థల భాగస్వామ్యం వలన అస్సోం, తమిళనాడులో 1500 మంది అటవీ సిబ్బంది ప్రయోజనం పొందారని ఆమె తెలిపారు. ఈ భాగస్వామ్యం వల్ల తమపై మరింత బాధ్యత పెరిగిందని కరణ్‌భల్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యు డబ్ల్యుఎఫ్-ఇండియా సెక్రటరీ జనరల్ రవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.



ముదురుతున్న పాత పెన్షన్ వివాదం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తర్వాత కూడా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదంటూ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్ అవలంబిస్తున్న తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మిగతా సమస్యలు ఎలాగున్నా ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన కాంట్రిబ్యూటరీ పెన్షన్ (సీపీఎస్) విధానాన్ని రద్దుచేసే విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అంశంపై గత మూడేళ్ళ కాలంగా అనేక సందర్భాల్లో ముఖ్యమంత్రిని కలిసి విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తమ సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యపు ధోరణి అవలంభిస్తోందని ఆరోపిస్తున్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలన్న ప్రధానమైన డిమాండ్‌తో తెలంగాణ ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఉద్యమానికి సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి మార్చి 22న హైదరాబాద్ నగరంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన టీఎన్‌జీవో కేంద్ర కమిటీ కార్యవర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి ఆ స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నది ఉద్యోగసంఘాల జేఏసీ ప్రధానమైన డిమాండ్. అయితే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసే సందర్భంలోనే తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెల్లడించాల్సి ఉందని ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు. దాదాపు మూడేళ్ళ క్రితం జరిగిన ఈ వ్యవహారంలో ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్నే అమలు చేస్తామని కేంద్రానికి లిఖితపూర్వత సమాచారం ఇచ్చినట్లు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటే మళ్ళీ కేంద్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనను ఆమోదించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధిన ఆర్థిక భారమంతా రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉన్నందున కేంద్రం తక్షణమే అంగీకారం తెలుపుతుందని, అయితే రాష్ట్రం తరపున ప్రతిపాదనను పంపించాల్సి ఉందని తెలంగాన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.పద్మాచారి తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాత పెన్షన్ విధానాన్ని సాధించుకునేంత వరకూ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలకు 1600 మొబైల్ సైన్స్ వ్యాన్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైన్స్ పరిజ్ఞానం పెంచేందుకు ఎక్రిటి సంస్థ మొబైల్ సైన్స్ వ్యాన్లద్వారా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు ఆధునిక విజ్ఞాన శాస్త్రం అందుబాటులోకి తెచ్చేందుకు 1600 ప్రభుత్వ పాఠశాలలకు మొబైల్ వ్యాన్లను పంపించనుంది. వీటితో పాటు 200 ఆదర్శ పాఠశాలలకు కూడా మొబైల్ సైన్స్ వ్యాన్లు వెళ్ళి సైన్స్ ప్రయోగాల గురించి విద్యార్థులకు వివరించనున్నారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ అయిన యునైటెడ్ వే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, హైదరాబాద్‌లో కాల్‌కం ఇండియా పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తూ విద్యార్థులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెం చనుంది.అత్యాధునికంగా సైన్స్‌కు సంబంధించిన విజ్ఞానాన్ని అందించే విధంగా మొబైల్ ల్యాబ్స్‌ను తీర్చిదిద్ది 16వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. పల్లెటూర్లలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద బాలికలకు వార్షిక సైన్స్ ఫెయిర్ నిర్వహించే ఆవిష్కార్ సంస్థ టెక్నాలజీలో ఫెయిర్ నిర్వహిస్తోంది.మొబైల్ సైన్స్ వ్యాన్లద్వారా ప్రదర్శించే మోడల్స్, ప్రాజెక్టులు సందర్శించి తమ అనుమానాలు నివృత్తి చేసుకోవాలని ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసిన యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ చాప్టర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రేఖా శ్రీనివాసన్ కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగ శాలలు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని, వీటికి తోడు మొబైల్ వ్యాన్లు విస్తృతంగా పర్యటిస్తాయని ఆమె చెప్పారు. కొత్త విష యాలపై అవగాహన పెంచడం, విషయ పరిజ్ఞానం నేర్చు కునేలా ప్రోత్సహించేందుకు సైన్స్ ల్యాబ్‌ల అవసరం ఎంతైనా ఉందని రేఖా శ్రీనివాసన్ పేర్కొన్నారు.

చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతి

చిల్పూరు, ప్రభన్యూస్: మండలంలోని పల్లగుట్ట గ్రామం వడ్డెర గూడెంకు చెందిన ఇదరు బాలురు గ్రామశివారు చింతల చెరువులో పడి నీట మునిగి మృతిచెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం వడ్డెరగూడెంకు చెందిన నలుగురు విద్యార్థులు ఆడుకుంటూ చెరువు వద్దకు వెళ్లగా ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తు మృతిచెందారు. మిగతా ఇద్దరు క్షేమంగా ఉన్నారు. ఆల్లకుంట సుజాత హన్మంతుల దంపతుల ఒక్కగానొక్క కుమారుడు ఆల్లకుంట రాజేందర్(8), శివరాత్రి ఉపేంద్రకు ఇద్దరు కుమారుల్లో పెద్దకుమారుడు శివరాత్రి చందు(10) మృతిచెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న సీఐ రావుల నరేందర్, ఎస్సై కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని శవపంచనామ జరిపి పోస్టుమార్టం నిమిత్తం ఎంజిఎంకు తరలించారు. వలస కూలీలు అయిన ఈ నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

ఇరాన్ అధ్యక్షుడి పర్యటన ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ పర్యటనకు వస్తున్న ఇస్లామిక్ రిపబ్లిక్ ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ హసన్ రౌహానీకి భద్రతతో పాటు ఇతర ఏర్పాట్లు సమర్థంగా కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఇరాన్ అధ్యక్షుని పర్యటన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో బుధవారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. హసన్ గురువారం హైదరాబాద్ చేరుకుని రెండు రోజులపాటు నగరంలో పర్యటిస్తారు.బేగంపేట విమానాశ్రయంలో కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు.హసన్‌కు బేగంపేట విమానాశ్రయంలో స్వాగతం పలికేందుకు కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌పి సింగ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించిందని తెలిపారు. శ హైదరాబాద్‌లో పర్యటించడం విశేషమని, వారిని స్వాగతించడం ఒక గొప్ప అవకాశమని జోషి అన్నారు ఇరాన్ కాన్సులేట్ మహమ్మద్ వాఘ్ బిన్ ఘోమీ మాట్లాడుతూ, దేశ అధ్యక్షుని పర్యటనకు తెలంగాణ ప్రభుత్వం అతితక్కువ సమయంలో ఏర్పాట్లు చేయడంపట్ల సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో జిఏడీ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా, నగర పోలీస్ కమిషనర్ వివి శ్రీనివాసరావు, మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి దాన కిషోర్, హైదరాబాద్ కలెక్టర్ యోగితా రాణా, ఇంటలిజెన్స్ ఐజీ నవీన్ చంద్, అడిషనల్ ఐజి అంజనీ కుమార్, ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

100 మండలాల్లో కాలేజీల్లేవ్

● నిబంధనలు కఠినతరంతో మూతపడిన ప్రైవేటు జూనియర్ కాలేజీలు
● వచ్చే ఏడాది కొత్తగా 30 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ప్రారంభం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో విద్యకు ప్రాధాన్యత ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ సుమారు 100 మండలాల్లో జూనియర్ కాలేజీలు లేవు. ఈ మండలాల్లో ప్రభుత్వ కాలేజీలే కాదు ప్రైవేటు జూనియర్ కాలేజీలు కూడా లేని పరిస్థితి. గత ఏడాది, ఈ ఏడాది ఫీజురీయింబర్స్ బకాయిలు ఎక్కువగా ఉండటంతో కాలేజీలను నడపలేక కొన్ని ప్రైవేటు జూనియర్ కాలేజీలను ఆయా యాజమాన్యాలు మూసేశాయి. ఈ ఏడాదిలో అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోని కాలేజీలు ఇందులో ఉన్నాయి.

రాష్ట్రంలో 402 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు

రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 584 మండలాలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 402 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. మండలానికొక ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేదు. అయితే కొన్ని మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేకన్నప్పటికీ ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు లేని మండలాలు 183 ఉండగా వాటిలో సుమారు 100 మండలాల్లో ప్రభుత్వ కాలేజీలతోపాటు, ప్రైవేటు కాలేజీలు కూడా లేవు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రైవేటు జూనియర్ కాలేజీలకు కొత్తగా అనుమతులు ఇవ్వలేదు. కానీ కొన్ని ప్రభుత్వ హైస్కూల్స్‌లో జూనియర్ కాలేజీల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. కొద్ది రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో తమ నియోజకవర్గాల్లోని కొన్ని మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేదని, సర్కార్ అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని కోరారు. అయితే వాటిపై పరిశీలిస్తోందని ప్రభుత్వం సమాధానం చెప్పింది.

నిబంధనలు కఠినతరంతో మూతపడిన ప్రైవేటు కాలేజీలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రంలోని విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేకుల షెడ్డు, తాటాకుల కప్పుల్లో కాలేజీలు కొనసాగిస్తే అనుమతులు ఇవ్వబోమని ఖరాఖండిగా చెప్పింది. అలా ఉన్న కాలేజీలను పక్కా భవనాల్లోకి మార్చుకోవాలని లేకపోతే అనుబంధ గుర్తింపును ఇవ్వబోమని అధికారులు స్పష్టం చేశారు. వీటితోపాటు ప్రభుత్వం విద్యార్థులకు ఇస్తున్న ఫీజురీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడిన కాలేజీలు పక్కా భవనాల్లోకి మార్చుకోలేక, లెక్చరర్లకు వేతనాలు చెల్లించలేక అనుబంధ గుర్తింపుకు దరఖాస్తు చేసుకోకుండా మూతవేసుకున్నారు. ఈ మధ్య కాలంలో సుమారు 20 నుంచి 30 కాలేజీల వరకు మూతపడినట్టు తెలుస్తోంది.

వచ్చే ఏడాది 30 కొత్త ప్రభుత్వ జూనియర్ కాలేజీలు!

రాష్ట్రంలో 183 మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు లేకపోవడంతో వచ్చే ఏడాదిలో సుమారు 30 కొత్త కాలేజీలకు అనుమతులు ఇవ్వాలని సర్కార్ ఆలోచిస్తోంది. ఇప్పటికే ఇంటర్‌బోర్డు ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించింది. ప్రభుత్వం కూడా అందుకు సానుకూలంగా స్పందించి వాటికి అనుమతులు ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. వచ్చే ఏడాది నుంచి వీటికి అనుమతి ఇచ్చి, అడ్మిషన్లను కూడా తీసుకోవాలనే ఆలోచన సర్కార్ చేస్తున్నట్టు సమాచారం.

సుబాబుల్ సమస్యపై మంత్రుల సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ప్రాంతంలో సుబాబుల్ రైతులు పడుతున్న కష్టాలు, మద్దతుధర అంశంపై మంత్రులు హరీష్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సాయంత్రం సమీక్షించారు. సమీక్షలో ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మదన్‌లాల్, ఖమ్మం జిల్లా సుబాబుల్ రైతులు పాల్గొన్నారు. ఆంధ్రప్రాంతంలో లభించే మద్దతు ధర తెలంగాణ ప్రాంతంలోనూ లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మద్దతు ధర లభించకుండా అడ్డుపడుతున్న దళారీవ్యవస్థను తొలగిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా చెప్పారు. ఐటిసి సంస్థ నియమించిన ఏజెంట్లను, దళారులను తొలగించాలని ఆదేశించారు. తెలంగాణ రైతుల నుంచి ఐటిసి నేరుగా కొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల సమక్షంలో ఐటిసి మండలానికి ఒక డిపో ద్వారా సుబాబుల్ సేకరిస్తే రైతులకు ప్రయోజనం ఉంటుందని, 15రోజుల్లో మద్దతు ధర ప్రకారం రైతుకు డబ్బులు అందేలా చర్య తీసుకోవాలన్నారు.

ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో
అవకతవకలపై కమిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు (స్పోర్ట్స్‌కోటా కింద) ఇచ్చే అడ్మిషన్లలో జరిగిన అవకతవ కలు, ఆరోపణల నేపథ్యంలో నిజాలు నిగ్గు తేల్చేందుకు రిటైర్డ్ ఐఏఎస్ మహ్మద్ అలీ రాఫత్ నేతృత్వంలో ఈ విచారణ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూలై 2017 సంవత్సరంలో జరిగిన ఎంబీబీఎస్, బీడీఎస్ మెడికల్ కౌన్సిలింగ్‌లో అనేక అవకతవకలు జరిగాయని రాత పూర్వకంగా ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి.

దీంతో పాటు కొన్ని పత్రికల్లో కథనాలు సైతం ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ విషయమై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని నిర్ణయించింది. దీంతో చీఫ్ విజిలెన్స్ కన్సల్టెంట్ అయిన మహ్మద్ అలీ రాఫత్‌తో దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వెరిఫికేషన్ కమిటీ మెంబర్లను, బాధితులతో పాటు ఇతర మార్గాల ద్వారా సమగ్ర విచారణ జరుపుతారు. ఈ విచారణకు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఎండీ ఓఎస్డీ డాక్టర్ కె. నర్సయ్య సహకరిస్తారని ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ఈనెల 24వ తేదీలోపు పూర్తి స్థాయి నివేదికను అందించాలని స్పోర్ట్స్, టూరిజం కార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు.

భూ సేకరణలో రైతులకు
8 నెలల్లో పరిహారం చెల్లించండి

- ఆరు వాయిదాల్లో పూర్తి చేయాలి
- ఏపీ, తెలంగాణలకు హైకోర్టు ఆదేశం
- దాఖలైన ఈపీల వివరాలు సమర్పించండి
- రిజిస్ట్రార్‌కు ఆదేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వివిధ ప్రాజెక్టుల నిర్మాణం కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లోని రైతుల నుంచి సేకరించిన భూములకు బడ్జెట్ కేటాయింపులతో సంబంధం లేకుండా 8 నెలల్లో పరిహారం చెల్లించాలని హైకోర్టు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను ఆదేశించింది. అయితే ఆ పరిహారాన్ని ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చునని స్పష్టం చేసింది. పరిహారం చెల్లించాలని అభ్యర్థిస్తూ రైతులు దాఖలు చేసిన ఎక్స్‌క్యూటివ్ పిటిషన్ల (ఈపీ) వివరాలతో పాటు రైతులకు చెల్లించాల్సిన పరిహారం బకాయిల వివరాలను జిల్లా కోర్టుల నుంచి తెప్పించాలని ఉమ్మడి హైకోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు రూ.453 కోట్లు, కాగా కేవలం మహబూబ్ నగర్ జిల్లా రైతులకే రూ.7 కోట్లు చెల్లించాల్సి ఉందని , ఏపీలో రైతులకు రూ.62 కోట్లు పరిహారంగా చెల్లించాల్సి ఉందని ప్రభుత్వ న్యాయవాదులు హైకోర్టుకు నివేదించారు. ఈ వ్యవహారంలో వచ్చే డిసెంబర్‌లో నివేదికలు తమకు సమర్పించాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు చేసింది. తదుపరి విచారణ మార్చి 1కి వాయిదా వేసింది. రైతుల నుంచి సేకరించిన భూములకు చెల్లించాల్సిన పరిహారం వ్యవహారంలో ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు హైకోర్టుకు నివేదికలు సమర్పించారు. ఏపీలో మొత్తం 918 ఎక్స్ క్యూటివ్ పిటిషన్లు (ఈపీలు) పెండింగులో ఉన్నాయని, రూ.84.32 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ. 21.55 కోట్లు డిపాజిట్ చేసి నట్లు, మిగతా రూ.62.88 కోట్లు మూడు నెలల్లోపు చెల్లించనున్నట్లు ఏపీ ప్రభుత్వం పేర్కొంది. తెలంగాణలో 1669 ఎక్స్ క్యూటివ్ పిటిషన్లు (ఈపీలు) పెండింగ్‌లో ఉన్నాయని, రూ.457.79 కోట్లు రైతులకు పరిహారంగా చెల్లించాల్సి ఉందని, ఆ మొత్తాన్ని ఆరు వాయిదాల్లో, ఏప్రిల్ నుంచి డిసెంబర్, 2018 వరకు చెల్లించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ధర్మాసనానికి నివేదికలు సమర్పించారు. ధర్మాసనం స్పందిస్తూ రైతులకు చెల్లించాల్సిన పరిహారాన్ని 6 వాయిదాల్లో ఎనిమిది నెలల్లోపు చెల్లించాలని ప్రభుత్వాలను ఆదేశించింది. తదుపరి విచారణ మార్చి 1కి వాయిదా వాయిదా వేసింది.

రైతుల నుంచి ముందుగా భూములు తీసుకుని పరిహారం చెల్లించకుండా కోర్టుల చుట్టూ తిరిగేలా చేస్తే , ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో భూసేకరణ ప్రక్రియను నిలిపివేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను హైకోర్టు హెచ్చరించిన విషయం తెలిసిందే. ప్రభుత్వాలు అనుసరిస్తున్న అవాంఛనీయమైన విధానంపై హైకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ఏపీ ఇంతవరకు ఎలాంటి నివేదికను సమర్పించకపోవడం పట్ల హైకోర్టు గత విచారణ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక వేళ వారు ప్రమాణ పత్రాలతో రాకుంటే, వచ్చే విచారణ తేదీనాడు కోర్టుకు హాజరు కావాలంటూ ఆదేశిస్తామని హైకోర్టు ఇరు రాష్ట్రాల సీఎస్‌లను హెచ్చరించిన విషయం తెలిసిందే. రైతులకు పరిహారం ఇచ్చే వ్యవహారంపై దాఖలవుతున్న ఈపీల వల్ల పెండింగ్ కేసుల సంఖ్య పెరిగిపోతోందని మహబూబ్ నగర్ జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి జి.వెంకట కృష్ణయ్య రాసిన లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించిన హైకోర్టు విచారణకు స్వీకరించిన విషయం తెలిసిందే.

వచ్చే ఎన్నికల్లో ఎవరితో పొత్తుండదు

- ఏప్రిల్‌లో సీపీఎం జాతీయ మహాసభలు: తమ్మినేని



హైదరాబాద్,ఆంధ్రప్రభ : వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు ఉండబోదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు. వివిధ పార్టీలతో పొత్తుల వల్ల చాల నష్టపోయామని ఆయన వివరించారు. టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా 28 పార్టీలతో ప్రత్యామ్నాయ శక్తిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నల్లగొండలో నిర్వహించిన సీపీఎం పార్టీ రాష్ట్ర మహాసభలు విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు వివరించారు. ఈ సభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల పరిస్థితితో పాటు తమ పార్టీ బలోపేతానికి తీసుకునే చర్యలపై చర్చించినట్లు తమ్మినేని తెలిపారు. అంతే కాకుండా ఏప్రిల్ 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరిగే సీపీఎం అఖిల భారత మహాసభల నిర్వహణపైన చర్చించినట్లు వివరించారు. మహాసభల నిర్వ హణకు 20 కమిటిలను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తీసుకురావడంలో సీఎం చంద్రశేఖర్ రావు విఫలమయ్యారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ఆయన సూచించారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను కూడా కేంద్రం నెరవేర్చకపోవడం శోచనీయ మన్నారు. బీజేపీతో లాలూచి పడిన టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగితే సీఎం కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు. కోదండరామ్ పార్టీని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. సీపీఎంతోపాటు వివిధ ప్రజా సంఘాలు, పార్టీలతో ఏర్పాటు చేసిన బీఎల్ఎఫ్ కార్యాలయాన్ని త్వరలో ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. బీఎల్ఎఫ్ జిల్లాల ఆవిర్భావ సభలు 20న సంగారెడ్డి, 25న మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

కేబినెట్ హోదా వ్యవహారం...
కౌంటర్ దాఖలు చేయండి: హైకోర్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వ సలహాదారులు,ప్రత్యేక ప్రతినిధులకు క్యాబినెట్ హోదా కల్పించిన వ్యవహారంలో మార్చి14 లోగా పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే ఈ వ్యాజ్యంలో ప్రతివాదులైన రాజకీయ నాయకులకు వ్యక్తిగత నోటీసులు జారీ చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాదికి హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.అమర్ నాథ్ గౌడ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ ఆదేశాలు వెలువరించింది. తదుపరి విచారణ మార్చి 14కు వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం కొందరిని ప్రభుత్వ సలహాదారులుగా, మరి కొందరిని కొత్త ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధులుగా నియమిస్తూ, వారికి క్యాబినెట్ ర్యాంకును కూడా కేటాయిస్తూ జారీ చేసిన జీవోలన్నింటినీ సస్పెండ్ చేసేలా ఆదేశాలివ్వాలని అభ్యర్థిస్తూ కొడంగల్ ఎమ్మెల్యే ఎ.రేవంత్ రెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

పాత పద్ధతిలోనే ఉపాధ్యాయ సెలవులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల సెలవులపై పాఠశాల విద్యా శాఖ జారీ చేసిన ఆర్‌సీ 83ను సవరిస్తూ పాఠశాల విద్య సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సెలవుల మంజూరు స్థానిక ప్రధానోపాధ్యాయుడికే ఇచ్చారు. అయితే ఆ విషయాన్ని మండల విద్యాశాఖాధికారికి తెలియజేయాలి. ఏకోపాధ్యాయుడు ఉన్నచోట కాంప్లెక్స్ హెచ్ఎంకు చెబితే తగిన ఏర్పాట్లు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని డైరెక్టర్ జిల్లా విద్యాశాఖాధికారులకు సూచించారు.

నేడు జరగాల్సిన ఉపాధ్యాయ సంఘాల సమావేశం వాయిదా

విద్యా సంవత్సరం క్యాలెండర్ రూపకల్పన, పాఠశాలల రేషనలైజేషన్ టీచర్ల ఏకీకృత సర్వీస్ రూల్స్ తదితర సమస్యలపై చర్చించడం కోసం ఉపాధ్యాయ సంఘాలతో నేడు జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. తిరిగి ఎప్పుడు నిర్వహించేది ఉపాధ్యాయ సంఘాలకు తర్వాత తెలియజేస్తారు.

న్యాయ సేవా సంస్థకు ప్రచార బహుమతి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : హైదరాబాద్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో తెలంగాణ న్యాయ సేవా సంస్థకు ప్రచార విభాగంలో మొదటి బహుమతి వచ్చింది. ఎగ్జిబిషన్ ముగింపు రోజున జరిగిన కార్యక్రమంలో సభ్యకార్యదర్శి బహుమతిని స్వీకరించారు. న్యాయసేవలు సామాన్యులకు కూడా తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. న్యాయసేవల సంస్థ పరంగా ఇస్తున్న సహకారాన్ని గూర్చి కరపత్రాలు, పోస్టర్ల ద్వారా వివరించారు. 825 మంది స్టాల్‌ను సందర్శించారు. 280 మంది న్యాయ పర అంశాలను గూర్చి తెలుసుకున్నారని సభ్య కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

ట్రిపుల్ ఐటీ, మిలటరీ కాలేజీల ఒప్పందం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అకడమిక్, మేధోపరమైన చర్చాగోష్టుల ద్వారా పరస్పరం తన సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ట్రిపుల్ ఐటి హైదరాబాద్, మిలటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ (ఎన్‌సిఇఎంసి) ఈ మేరకు ఒక అవగాహన కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం మేరకు ఈ రెండు సంస్థల మధ్య పరస్పరం విజ్ఞానం, అన్వేషణలు, సంయుక్తంగా దేశీయ పరిజ్ఞానం సొల్యూషన్స్‌లో పరిశోధనలు నిర్వహించేందుకు సదస్సులు, సెమినార్లు, ఉపన్యాసాలు, వర్క్‌షాప్ నిర్వహిస్తాయి. సైన్యానికి అవసరమైన ఇంజనీరింగ్, టెక్నాలజీలో ట్రిపుల్ ఐటి రిసెర్చ్ సెంటర్ మిలటరీ కాలేజీకి సహకరిస్తుంది. అలాగే ట్రిపుల్ ఐటి ఫ్యాకల్టీ రక్షణశాఖ విద్యార్థి అధికారులకు ఎంటెక్ కోర్సులో అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తుంది.

ఎక్సలెన్స్ అవార్డులకు 'సెర్చ్' కమిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు ప్రత్యేక చొరవ చూపి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్న ఉన్నతాధికారులకు ఎక్సలెన్స్ అవార్డులను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ కేటగిరిల్లో ఈ అవార్డులకు అర్హతగల వారిని ఎంపిక చేసేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారుల నేతృత్వంలో సెర్చ్ కమిటీని నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి బుధవారం జీవో విడుదల చేశారు. మైనారిటీ కమీషన్ చైర్మన్‌గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జి.సుధీర్ అధ్యక్షతన ఈ కమిటీ ఏర్పాటైంది. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథిలను కమిటీలో సభ్యులుగా నియమించారు. సాధారన పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

దెందలూరు ఎమ్మెల్యే చింతమనేనికి
మూడేళ్ల జైలు.. వెంటనే బెయిలు

ఏలూరు ప్రభన్యూస్: దెందలూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు కోర్టు ఊహించని షాక్ ఇచ్చింది. వివిధ కేసుల్లో ఆయనకు మూడేళ్ళ జైలు శిక్ష, ఐదు వేల జరిమానా విధించింది. 2011లో అప్పటి మంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై చేయి చేసుకున్న చింతమనేనిని పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలు కోర్టు దోషిగా తెల్చింది. 2011లో జరిగిన రచ్చబండ కార్య క్రమంలో వట్టి వసంతకుమార్‌తో పాటు ఆయన గన్‌మ్యాన్‌పైనా చింతమనేని దాడి చేశారు. మంత్రి వట్టి వసంతకుమార్‌ను స్టేజీ మీదే కాలర్ పట్టుకుని లాగేశాడు. కిందిపడేసి పిడిగుద్దులు కురిపించారు. ఈ దృశ్యాలు మీడియా కెమెరాలకు కూడా చిక్కాయి. మంత్రిపై దౌర్జన్యం కేసులో రెండేళ్ళ జైలు శిక్ష విధించింది కోర్టు. గన్ మ్యాన్‌పై చేయి చేసుకున్నందుకు ఆరు నెలల పాటు, రచ్చ బండ కార్య క్రమాన్ని అల్లరి పట్టించి నందుకు ఆరు నెలల శిక్షను కోర్టు విధించింది. తీర్పు చెప్పే సమయంలో చింతమనేని ప్రభాకర్ కూడా కోర్టుకు హాజరయ్యా రు. చింతమనేనిపై పోలీసులు, అధికారులపై చేయి చేసుకు న్న కేసులు కూడా విచారణలో ఉన్నాయి. సెక్షన్ 506(2)గా రెండేళ్ళ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా, సెక్షన్ 353గా ఆరు నెలల జైలు శిక్ష వేయి రూపాయల జరిమానా, సెక్షన్ 7(1)గా ఆరు నెలలు జైలు శిక్షతో పాటు 500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. మొత్తంగా మూడు సంవత్సరాల జైలు శిక్ష, 2500 జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ సంచలన తీర్పును ఇచ్చారు. తీర్పు వెలువడిన వెంటనే చింతమనేని బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

200 'అన్న' క్యాంటీన్లు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో 200 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నట్లు ఏపీ రాష్ట్ర పురపాలకశాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. తొలి విడతగా లక్ష జనాభా పైబడిన 33 మున్సిపాల్టీల్లో మొదటి విడతగా అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాంటీన్లకు సొంత భవనాలు నిర్మించనున్నామన్నారు. ముఖ్యమంత్రి అధ్యక్ష తన బుధవారం జరిగిన సీఆర్‌డీఏ సమావేశంలో పలు విషయాలపై చర్చించిన అంశాలను అనంతరం మంత్రి నారాయణ సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూన్ 2 నుంచి రాష్ట్రంలో లక్షజనాభా పైబడిన 33 మున్సిపాల్టీల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నారు.

ఒకే వేదికపైకి ఏపీ ప్రభుత్వ శాఖలు


- ఈ ప్రగతి సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: రియల్‌టైం గవర్నెన్స్ (ఆర్టీజి)తో ఈ ప్రగతిని అనుసంధానం చేయాలని, దీనివలన మంచి ఫలితాలు సాధించవచ్చని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికార యంత్రాంగానికి సూచించారు. బుధవారం రాత్రి ఆయన తన నివాసంలో ఈ-ప్రగతి పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రియల్‌టైం గవర్నెన్స్ ద్వారా ఈ-ప్రగతిని మరింత పట్టిష్టంచేయాలని ఆదేశించారు. ముప్పైకి పైగా ప్రభుత్వ శాఖలు, 130 ప్రభుత్వ విభాగాధిపతి కార్యాలయాలు, ఎనిమిది వందల సూచికలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఈ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయాలని దిశానిర్దేశం చేశారు. 15శాతం స్థిర వృద్ధి సాధనకు చర్యలు ఎంతోగానే దోహదపడతాయన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న వినూత్న సంక్షేమ కార్యక్రమాలు పారదర్శక పాలనకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకున్న తీరును ప్రముఖ పారిశ్రామిక వేత్త, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబాని కొనియాడిన విషయాన్ని సిఎం గుర్తు చేశారు. ప్రభుత్వం వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, చేపడుతున్న చర్యలను అధికారులకు, ప్రజలకు తెలిసేలా చేసేందుకు విరివిగా శిక్షణా కార్యక్రమాలు నిర్విహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమీక్షలో ఐటి ముఖ్యకార్యదర్శి విజయానంద్, ఈ ప్రగతి సీఈవో బాలసుబ్రహ్మణ్యం, ఆర్టీజి సీఈవో బాబు ఎ, ముఖ్యమంత్రి కార్యదర్శి గిరిజా శంకర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చంటబాబుతో మాజీ క్రికెటర్ లక్ష్మణ్ భేటీ

అమరావతి, ఆంధ్రప్రభ: భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ క్రీడాలకు, క్రీడాకారులకు సిఎం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అభినందించారు. గతంలో కూడా ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు అనేక జాతీయ, ఆంతర్జాతీయ క్రీడా అకాడమీలు ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు కోసం కృషిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. నవ్యాంధ్రలో యువ క్రికెట్ క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే
ఎంవీ కృష్ణారావు మృతి



శ్రీకాకుళం, ప్రభ న్యూస్ బ్యూరో: ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే ఎం.వి.కృష్ణారావు బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన వయస్సు 83 సంవత్సరా లు. ఇఛ్ఛాపురం ప్రాంతంలో కాంట్రాక్ట్ పనులతో ఇక్కడ వారికి పరిచయమైన ఎం.వి.కృష్ణారావు, తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తరువాత ఆ పార్టీలో చేరారు. పెద్దమనిషిగా ఎన్‌టిఆర్ వద్ద గుర్తింపు పొందిన ఆయన ఇఛ్ఛాపురం నియోజక వర్గం నుంచి 1983లో పోటీచేసి గెలుపొందారు. ఆ తరువాత ఆయన 85, 89, 99 సంవత్సరాలలో కూడా తెలుగుదేశంపార్టీ టిక్కట్టుపై పోటీచేసి గెలుపొం దారు. 1994 ఎన్నికల సమయానికి ఎంవి కృష్ణారావుపై అనర్హతవేటు పడటంతో ఆ ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేకపోయారు. ఆ ఎన్నికల్లో కృష్ణారావు తన అనుచరుడైన దక్కత అచ్యుతరామిరెడ్డిని పోటీకి నిలిపి, ఆయన విజయం లో కీలకపాత్ర పోషించారు. మళ్లీ ఆయన 1999లో ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధిం చారు. ఆయన రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కూడా పదవిని నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా కొంత కాలం పదవి నిర్వహించారు. 2004లో ఎం.వి.కృష్ణారావును స్థానికేతరుడు అనే కారణంగా వేరేవారికి పార్టీ టిక్కట్టు ఇవ్వడంతో తీవ్ర మనస్థాపం చెందిన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆ తరువాత ఆయన వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ కూడా 2014 ఎన్నికల్లో టిక్కట్టు ఇవ్వకపోవడంతో అప్పటి నుం చి ఆయన క్రియాశీలక రాజకీ యాలకు దూరంగా ఉండి పోయారు. కొంతకాలంగా అనారోగ్య సమ స్యలతో బాధపడు తున్న ఆయన హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణిం చారు. ఆయన మృతి పట్ల జిల్లాలో పార్టీలకతీతంగా అందరు నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

రైతు కేటాయింపులపై శ్వేతపత్రం

● హరీష్‌ను డిమాండ్ చేసిన బీజేపీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రజలకు సంబంధించిన అన్ని సమస్యలు కేంద్రమే తీర్చాలన్న పద్ధతిలో టిఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బిజెపి మండి పడింది. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు మాట్లాడుతూ, కందుల కొనుగోలు అంశంలో కేంద్రం సహకరించడం లేదంటూ మార్కెటింగ్ శాఖ మంత్రి హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రస్థాయిలో మండి పడ్డారు. రైతుల కోసం కేంద్రం ఏం చేయడం లేదంటూ హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ఏ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుందో ప్రజలకు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. రైతుల కోసం పని చేస్తున్నా మని అంటున్న హరీష్‌రావు 2017 -18 బడ్జెట్‌లో రైతులకు కేటాయించిన నిధుల వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు వెన్నుదన్నుగా నిలిచేవిధంగా కేంద్రం బడ్జెట్‌ను రూపొందించిందన్నారు. కేంద్రం సూచించిన విధంగా రైతులు నేరుగా మార్కెట్లో అమ్ముకునే విధంగా కూరగాయలు, పండ్లు తదితర వాటికి వెసులుబాటు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

మజ్లిస్‌కు హఠావో...హైదరాబాద్‌కు బచావో

హైదరాబాద్ ఎంపి తనకు ఓట్లేసి గెలిపించిన ప్రజలను, ప్రాంతాన్ని పట్టించుకోకుండా మిగతా విషయాలన్నింటిపై మాట్లాడుతున్నారని కృష్ణసాగర్‌రావు ఆరోపించారు. కేసీఆర్‌ను ప్రేమిస్తున్నానని బహిరంగంగా ప్రకటించిన అసదుద్దీన్ హైదరాబాద్ లోక్‌సభ అభివృద్ధికి నిధులను ఎందుకు తెచ్చుకోలేక పోతున్నారని నిలదీశారు. రానున్న ఎన్నికల్లో ఎంఐఎంకు హఠావో - హైదరాబాద్ బచావో నినాదంతో ఎన్నికల బరిలో దిగి కాషాయ జండాను ఎగుర వేస్తామన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. సరిహద్దులలో పని చేస్తున్న సైనికులకు మతం ఉండదన్న కనీస ఇంగీతజ్ఞానం కూడా అసదుద్దీన్‌కు లేకపోవడం దురదృష్టకరమన్నారు.

వేదాద్రి పేపర్ మిల్‌కు పాలేరు జలాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వేదాద్రి పేపర్ మిల్‌కు పాలేరు జలాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో ఉన్న వేదాద్రి పేపర్‌మిల్స్‌కు కొత్తగూడెం గ్రామం నుండి ప్రతిరోజు 310వేలలీటర్ల పాలేరు నీటిని తీసుకునేందుకు అనుమతి మంజూరుచేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

నిమ్జ్‌కు 1.42టిఎంసిల సింగూరు జలాలు

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వద్ద ఏర్పాటుచేస్తున్న జాతీయ పెట్టుబడులు, తయారీ కేంద్రం (నిమ్జ్)కు 1.42టిఎంసిల సింగూరు జలాలు కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది పారిశ్రామిక అవసరాల కోసం ఈ నీటిని కేటాయించారు.

రైతు సమస్యలు పరిష్కరించండి

● సర్కార్‌కు టీడీపీ నేత రావుల హితవు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అధికార తెరాస రాజకీయ మైండ్‌గేమ్ మానుకొని రైతాంగ సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలని తెలుగుదేశంపార్టీ తెలంగాణ సూచించింది. ప్రభుత్వ పెద్దలు రైతు సమస్యలను వదిలేసి రాజకీయాల్లో మునిగిపోయారని, ముఖ్యమంత్రిగానీ, మంత్రులకుగానీ రైతు సమస్యలు చర్చించేందుకు సమయం కూడా లేదని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి దుయ్యబట్టారు. కంది, ఎర్రజొన్న పంటలకు మద్దతు ధర అందడం లేదని, కందిపంటను కొనే దిక్కు లేదని బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన విచారం వ్యక్తంచేశారు. నిజామాబాద్ జిల్లాలో 50వేల ఎకరాల్లో ఎర్రజొన్న వేశారని, ఢిల్లీ వ్యాపారులు రూ.2,800లకు ఖరీదు చేస్తామంటే దళారులు మాత్రం కేవలం రూ. 1800లకే కొనుగోలు చేస్తున్నారని రావుల చెప్పారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సుబాబుల్, జామాయిల్ పంటలను బీపీఎల్ కంపెనీ సరైన రీతిలో కొనుగోలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. జలాశయాల్లో నీటి అజామాయిషీని ప్రభుత్వం వదిలేసిందని, తాగునీటి కొరత ఏర్పడితే సమీక్షించేందుకు కూడా ప్రభుత్వానికి తీరికలేక పోయిందని ఆయన మండిపడ్డారు.

కోదండరామ్‌తో రేవంత్ భేటీ

హైదరాబాద్,ఆంధ్రప్రభ : టీజేఏసీ చైర్మన్ కోదండరామ్‌ను కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి కలిశారు. రేవంత్‌రెడ్డి కుటుంబంలో జరిగే శుభకార్యానికి సంబంధించి ఆహ్వానలేఖను అందజేయడానికి బుధవారం కోదండరామ్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నట్లు తెలిసింది.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం: మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి

రాష్ట్రంలోని రైతాంగం ఇబ్బందులు పడుతున్నా టీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అసెంబ్లీ మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్యే అనిల్, కాంగ్రెస్ నేత రాజారాంయాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేంద్రబడ్జెట్‌లో కొంతమేర ప్రయత్నం చేసినా..రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నించకపోవడం శోచనీయమన్నారు.

పోడు భూములను లాక్కుంటున్న ప్రభుత్వం: బలరాంనాయక్

గిరిజనులకు గత యూపీఏ ప్రభుత్వం పంచిన పోడు భూములను ప్రస్తుత టీఆర్ఎస్ ప్రభుత్వం లాక్కుంటోందని కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. గిరిజనులు అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో బయ్యారం, గూడూరు తదితర ప్రాంతాల్లో పోడు భూముల పట్టాల పంపిణి చేసినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం హరితహారం పేరిట పారెస్టు అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారని తెలిపారు.

తప్పుడు ప్రచారాలపై చర్యలు తీసుకోండి

● డీసీసీకి కాంగ్రెస్ నేత దాసోజు ఫిర్యాదు



హైదరాబాద్,ఆంధ్రప్రభ : తప్పుడు ప్రచారాలతో టీఆర్ఎస్ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తున్నదని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజ్ శ్రావణ్‌కుమార్ విమర్శించారు. ఇప్పుడిప్పుడే రాజకీయాల్లో ఎదుగుతున్న తనను దెబ్బతీయాలనే కుట్రకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో బీసీలకు ప్రాధాన్యత లేదని, రెడ్డి కులస్తులకే అవకాశాలు ఉన్నాయని, పార్టీని వీడుతున్నట్లు తన పేరున సోషల్ మీడియాలో వస్తున్న వార్తలో వాస్తం లేదని శ్రావణ్‌కుమార్ వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాతో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీసీఎస్ డీసీపీ అవినాష్ మహంతికి బుధవారం దాసోజు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ అడుగు జాడల్లో, మారోజు వీరన్న సిద్ధాంతాలతో రాజకీయాల్లో ముందుకు వెళ్లుతున్నట్లు తెలిపారు. నా ఉద్యమ స్ఫూర్తిని టీఆర్ఎస్ చేస్తున్న ఈ చిల్లర ప్రచారం ప్రచారం అడ్డుకోలేవన్నారు. రాష్ట్రప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నందునే తనపై టీఆర్ఎస్ పార్టీ కక్ష కడుతున్నారని ఆయన విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటి చేసే 60 మంది అభ్యర్థుల జాబితాను రూపొందించినట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లోనూ వాస్తవం లేదన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడితే 506, 507 సెక్షన్ల కేసులు పెడుతామన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. బీసీ నాయకుడిగా కాంగ్రెస్‌లో ఎదుగుతున్న శ్రావణ్‌కుమార్‌ను దెబ్బతీయడానికే టీఆర్ఎస్ కుట్ర చేస్తున్నదని మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ ఆరోపించారు.

ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే

కేంద్ర నిధులు అందాలి

● నేడు కేంద్రాన్ని కోరనున్న మంత్రి హరీష్‌రావు ● ఏఐబీపీ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష... పనుల పూర్తికి గడువు విధింపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ) కింద తెలంగాణలో చేపట్టిన ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు ఆదేశించారు. గురువారం ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో మంత్రి పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో వాస్తవపరిస్థితి అంచనాకు, కేంద్ర సమావేశంలో ప్రస్తావించాల్సిన అంశాలపై చర్చించేందుకు జలసౌధలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్రం మంజూరుచేసిన నిధుల వ్యయానికి సంబంధించి యుటిలైజేషన్ సర్టిఫికెట్లను వెంటనే జారీచేయాలని సంబంధిత సీఈలను మంత్రి కోరారు. పలు ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు మంత్రి హరీష్‌రావు డెడ్‌లైన్లు విధించారు.

వచ్చే జూన్‌వరకు బీమా, నీల్వాయి, కొమరం భీం ప్రాజెక్టులు పూర్తిచేయాలని ఆదేశించారు. గొల్లవాగు ప్రాజెక్టును మార్చి, పాలెంవాగును మే కల్లా పూర్తిచేయాలన్నారు. దేవాదులను మార్చి, 2019నాటికి.. ఎస్సారెస్పీ వరదకాల్వను 2019 జూన్ నాటికి పూర్తిచేయాలని మంత్రి డెడ్‌లైన్ విధించారు. వివిధ ప్రాజెక్టులలో భూసేకరణ సమస్యలపై భూపాలపల్లి, మంచిర్యాల కలెక్టర్లతో మాట్లాడాలని.. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. జగన్నాధపూర్ ప్రాజెక్టుకు సంబంధించిన వ్యవహారంలో కోర్టు తీర్పుకు అనుగుణంగా వెంటనే చర్యలు తీసుకుని.. పనులు వేగిరం చేయాలన్నారు. పిఎంకెఎస్‌వై పథకం కింద దేశవ్యాప్తంగా ప్రాధాన్యక్రమంలో పూర్తిచేయాల్సిన ప్రాజెక్టులలో తెలంగాణ ప్రాజెక్టులు 11 ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు క్యాడ్‌వామ్ కింద రూ.వేయికోట్లు రానున్నాయి.

11ప్రాజెక్టులలో..

పిఎంకెఎస్‌వై ప్రాజెక్టుల పూర్తికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు కేంద్రం 18 రాష్ట్రాల మంత్రులను ఆహ్వానించింది. తెలంగాణ నుండి పిఎంకెఎస్‌వైలో 11 ప్రాజెక్టులున్నాయి. మత్తడివాగు, నీల్వాయి, గొల్లవాగు, ర్యాలివాగు, పాలెంవాగు, రాజీవ్‌బీమా ప్రాజెక్టుల పనులలో.. మత్తడివాగు, ర్యాలివాగు పూర్తయ్యాయి. పూర్తయిన ప్రాజెక్టులకు సంబంధించిన సర్టిఫికెట్లు మార్చి చివరిలోగా కేంద్రానికి సమర్పించాలని మంత్రి ఆదేశించారు. పిఎంకెఎస్‌వై ప్రాజెక్టులకు నాబార్డు నేరుగా కాకుండా జాతీయ జల అభివృద్ధి సంస్థ ద్వారా రాష్ట్రాలకు రుణం అందజేస్తుంది. దేవాదుల ప్రాజెక్టుకు గతంలోనే కేంద్రం పిఎంకెఎస్‌వైలోకి తీసుకోగా, తర్వాత కొమరం భీం, రాజీవ్‌బీమా, ఎస్సారెస్పీ, ఇందిరమ్మ వరద నీటికాల్వ, పాలెంవాగు ప్రాజెక్టు, నీల్వాయి, మత్తడివాగు, ర్యాలివాగు, గొల్లవాగు ప్రాజెక్టులు ఈ పథకంలో చేరాయి. ప్రాజెక్టులు నిర్ణీత గడువులో పూర్తికావాలంటే ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే కేంద్రం నిధులు విడుదల చేయాలని మంత్రి హరీష్‌రావు కేంద్రాన్ని గురువారం కోరనున్నారు.

సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సీఎస్ జోషి, సెక్రటరీ వికాస్‌రాజ్, ఈఎన్‌సి మురళీధర్, నాగేందర్‌రావు, అనిల్ , సీఈలు భగవంతరావు, బంగారయ్య, కాడా కమిషనర్ మల్సూర్ పాల్గొన్నారు.

పోలీసుల పనితీరు భేష్

● బడ్జెట్‌లో కొత్త పోలీస్ స్టేషన్లు
● జహీరాబాద్‌లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్: హోం మంత్రి నాయిని



జహీరాబాద్/కోహీర్, ప్రభ న్యూస్ : దేశంలోనే ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని పోలీసుల పనితీరు బాగుందని హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల కేంద్రంలో గల ఓంకారేశ్వర ఆలయంలో నిర్వహించిన శివరాత్రి ఉత్సవాలలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోహీర్ పోలీస్ స్టేషన్‌లో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో హోంమంత్రి మాట్లాడారు.

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో పోలీసుల పనితీరు ఎంతో బాగుందన్నారు. రాష్ట్రంలో తెరాస ప్రభుత్వం ఏర్పడిన గత మూడున్నర సంవత్సరాలలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. రానున్న బడ్జెట్‌లో రాష్ట్రంలో మరిన్ని పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. అందులో భాగంగా జహీరాబాద్ పట్టణానికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజల, రైతుల ప్రభుత్వమన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తెరాస అధికారంలోకి వచ్చాక వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు దేశంలో ఎక్కడాలేని విధంగా పింఛన్లు అందిస్తున్నామన్నారు. షాదిముబారక్, కల్యాణలక్ష్మి పథకాల ద్వారా నగదును అందించడం జరుగుతుందన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలతో రైతులకు, ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి బడుగు బలహీన వర్గాలకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించారని, వెనుకబడిన ప్రాంతాలపైన ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారన్నారు.

సమావేశంలో జహీరాబాద్ ఎమ్మెల్సీ ఫరిదొద్దిన్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవంలో హోంమంత్రి

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల కేంద్రంలో 10 రోజులుగా సృద్భావ సంస్థ అధ్యక్షులు దక్షిణామూర్తి దీక్షితులు ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠాపన, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల కలెక్టర్ శరత్‌కుమార్, ఐఎఎస్ అధికారి నవీన్ మిట్టల్, ఎల్‌వి సుబ్రమణ్యం, ఆయా శాఖల అధికారులు, భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కష్టాలు తీరాలంటే కాంగ్రెస్ రావాలి: ఉత్తమ్



చింతలపాలెం, ప్రభ న్యూస్ : రైతుల కష్టాలు తీరాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని టిపిసిసి చీఫ్, హుజూర్‌నగర్ శాసన సభ్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని చింత్రియాల పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎద్దుల పందాలను ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమయ్యాయని, టిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల రుణమాఫీ పేరుతో మోసం చేసిందన్నారు. రాష్ట్రప్రజలను మాయ మాటలతో మభ్యపెడుతున్న ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామన్న మాటను అధికారం చేపట్టిన తరువాత మరిచారని ఆరోపించారు. రైతులను రాజు చేస్తానని ప్రగల్బాలు పలికిన టిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం గిట్టుబాటు ధర కల్పించక పోగా అడిగిన రైతులను దోషులను చేసిందన్నారు. మిరప పంట పండించిన రైతులు గిట్టుబాటు ధర లేక తక్కువ ధరకు అమ్ముకోలేక చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నేడు ఏర్పడిందన్నారు. పులిచింతల నిర్మాణంలో ముంపుకు గురైన గ్రామాల్లో ప్యాకేజీ రానివారికి ప్యాకేజీ వచ్చేంత వరకు, అదేవిధంగా మౌళిక వసతులు కల్పించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. తాము అధికారం చేపట్టిన తరువాత రైతులకు గిట్టుబాటు ధర, రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు, వివోఏలకు నెలకు రూ. 10వేలు ఇస్తామన్నారు. నియోజకవర్గంలో ఉన్న ఎత్తిపోతల పథకాలు కాంగ్రెస్ పాలనలోనే నిర్మించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మం డల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు వద్దు-నడకే ముద్దు

● కాంగ్రెస్ యాత్రలపై భిన్నాభిప్రాయాలు ● పాదయాత్ర ద్వారానే ప్రజలకు చేరువవుతామంటున్న సీనియర్లు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికారాన్ని హస్తం గతం చేసుకునేందుకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రకరకాలుగా వ్యూహాలను అనుసరించాలని భావిస్తోంది. ప్రభుత్వవైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే మార్గాలను అన్వేషించే పనిలో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలోని 119 నియోజక వర్గాలను చుట్టి రావాలనే యోచనలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. అయితే ప్రజల్లోకి ఎలా వెళ్లాలనే దానిపై ఇంకా కొలిక్కి రాకపోవడంపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెల రెండో వారంలోనే బస్సుయాత్రకు శ్రీకారం చుడుతామని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బస్సుయాత్రల ద్వారా ప్రజల్లోకి ప్రత్యక్షంగా కలుసుకోవడం కుదరదనే అంటున్నారు. అదే పాదయాత్రల ద్వారానైతే ప్రజలతో మమేకం అవడానికి మంచి అవకాశం ఉంటుందని ఒక సీనియర్ నేత అభిప్రాయపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి శ్రీకాళం జిల్లా ఇచ్ఛాపురం వరకు చేపట్టిన పాదయాత్ర ప్రజల్లో కదలిక తేవడమే కాకుండా అప్పటి తెలుగుదేశం పాలనపై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకుని విజయం సాధించామనే విషయాన్ని కాంగ్రెస్‌కు చెందిన కొందరు సీనియర్లు గుర్తు చేస్తున్నారు. ఇదే సూత్రాన్ని ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పాటించిన అంశాన్ని పలువురు కాంగ్రెస్ నేతలు ప్రస్తావిస్తున్నారు. ఎందుకంటే 2004 నుంచి 2009 వరకు వరుసగా రెండు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ అధికారంలో ఉండటం వల్ల ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న విషయాన్ని చెబుతున్నారు. ఇదే అదనుగా భావించిన చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రంలో అనంతపురం జిల్లా నుంచి తెలంగాణ మీదుగా విశాఖ వరకు పాదయాత్ర చేపట్టి ఏపీలో అధికారంలోకి రావడమే కాకుండా.. తెలంగాణాలోనూ 15 అసెంబ్లీ నియోజక వర్గాల్లోనూ టీడీపీ విజయం సాధించిన విషయాన్ని తెలంగాణ కాంగ్రెస్ నేతలు గుర్తు చేస్తున్నారు.

తెలంగాణాలో కూడా టీఆర్ఎస్ ప్రభుత్వంపై ఈ నాలుగేళ్లలోనే ప్రజల నుంచి వ్యతిరేకత పెరిగిందని, ఇలాంటి సమయంలో బస్సుయాత్రలకు బదులు పాదయాత్రలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీకి లాభం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాత్రం బస్సుయాత్ర వైపే మొగ్గు చూపుతున్నారని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికలు ఈ ఏడాది డిసెంబర్‌లో వచ్చే అవకాశం ఉన్నందున ఈ తక్కువ సమయంలో పాదయాత్రలు చేయడం కుదరదనే అభిప్రాయంతో ఉన్నారు. కాగా కొంత మంది సీనియర్లతోపాటు యువత కూడా పాదయాత్రతోనే లాభం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉంటే కాంగ్రెస్ మరో సమస్య వచ్చి పడుతోంది. జిల్లాలలో పార్టీ నేతల మధ్య సమన్వయం కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి బస్సుయాత్ర లేదా పాదయాత్ర చేసినా నేతలు సహకరించడం పక్కనపెట్టి గ్రూప్ తగాదాలు బయటపడే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ప్రతి జిల్లాలో ముఖ్యనేతల మధ్య సమన్వయం లేకపోవడం పెద్ద తలనొప్పిగా మారిందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అంతే కాకుండా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా జిల్లా పర్యటనకు వెళ్లే ముందు ఆ జిల్లాలోని సీనియర్లకు కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని మాజీ మంత్రి ఒకరు అసంతృప్తిని వ్యక్తం చేశారు. పీసీసీగా ఉన్నప్పుడు అందరిని కలుపుకుని వెళ్లేలా అధ్యక్షుడు ఉండాలనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఇటీవలనే తమ జిల్లాలో రెండు సభలు నిర్వహించినప్పటికి పీసీసీ నుంచి కనీసం సమాచారం కూడా లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో హాజరుకావాల్సి వచ్చిందని సదరు నేత తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇది తన ఒక్కరి సమస్యే కాదని, ప్రతి జిల్లాలోనూ ఇలానే ఉందని అన్నారు.

సీతారామ పంప్‌హౌస్‌ల తొలి దశ పూర్తికి

డిసెంబర్ డెడ్‌లైన్!

● మంత్రులు హరీష్‌రావు, తుమ్మల సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సీతారామా ఎత్తిపోతల పథకం తొలిదశలో మూడు పంపు హౌజ్‌ల నిర్మాణం త్వరితగతిన పూర్తికావాలని రాష్ట్రమంత్రులు హరీష్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ ఏడాది డిసెంబర్‌కు మూడు పంపు హౌజ్‌ల నిర్మాణం పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించారు. జలసౌధలో సీతారామ ఎత్తిపోతల పథకం పనులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి హరీష్‌రావు సమీక్షించారు. సీతారామా ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు. సీతారామా ప్రాజెక్టు పనులు అనుకున్నంత వేగంగా సాగడం లేదని, మందకొడిగా సాగుతున్నాయన్నారు. ప్యాకేజీల వారీగా 1, 2, 3 ప్యాకేజీల పనులను సమీక్షించారు. వెంటనే అగ్రిమెంట్ చేసుకుని పనులు ప్రారంభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రబీలో ప్రాజెక్టుల కింద 19 లక్షల ఎకరాలకు సాగునీరు అందాలని మంత్రి హరీష్‌రావు ఆదేశించారు. శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల నీటి నిర్వహణ, సాధించిన ఆయకట్టు అంశాలపై అధికారులకు లక్ష్యాలు నిర్దేశించారు.

అనుసంధాన కాల్వలు ముందు..

కృష్ణాతో గోదావరిని అనుసంధానించే 16ఎల్, 18ఎల్ కాల్వల పనులను వెంటనే పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని మంత్రులు హరీష్‌రావు, తుమ్మల అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఖమ్మం సీఈ సుధాకర్ పాల్గొన్నారు.

మియాపూర్, పటాన్‌చెరులో రైల్వే టెర్మినల్స్

అక్కంపేట - మెదక్ - కొత్తపల్లి - మనోహరాబాద్ రైలు మార్గాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే అధికారులను మంత్రి హరీష్‌రావు కోరారు. 2019లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావుతో కలిసి గజ్వేల్‌కు రైలులో ప్రయాణించాలని ఆయనన్నారు. అక్కంపేట - మెదక్ మధ్యలో గుర్తించిన 11 సమస్యలను తక్షణమే పరిష్కరించే చర్యలు చేపట్టాలని సూచించారు. తెలంగాణలో రైల్వే పెండింగ్ సమస్యలపైన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి మహేందర్ రెడ్డి, ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్‌తో పాటు సంబంధిత రాష్ట్ర, రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణలోని 460 రైల్వే లెవెల్ క్రాసింగులకు ఆర్వోబీల నిర్మాణ పనులు చేపడుతున్నట్టు రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ తెలియచేశారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, హైదరాబాద్ శివారు మియాపూర్ - పటాన్ చెరు ప్రాంతంలో రైల్వే టర్మినల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పరిశీలిస్తున్నామన్నారు.

70 లక్షల మందికి బీమా

● పింఛన్లపై ఉత్తమ్ అబద్ధాలు : మంత్రి జూపల్లి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అధికారం దక్కడం కల్ల అని, పింఛన్లపై ఉత్తమ్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. బుధవారం టిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో 29 లక్షల మందికి మాత్రమే పింఛన్లు ఇవ్వగా, తాము 39లక్షల మందికి రూ.వేయి పింఛన్లు అందజేస్తున్నామన్నారు. బ్యాంకుల్లో నగదుకొరత వల్ల అక్కడక్కడా చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందే తప్ప ఆసరా పింఛన్లు క్రమం తప్పకుండా ఇస్తున్నామన్నారు. అభ యహస్తం పింఛన్లను కూడా ఆసరా పింఛన్లుగా మళ్ళిస్తున్నామని.. 2లక్షల మం దిలో ఇప్పటికే 1.16లక్షల మందికి ఇలా పింఛన్ అందుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, వారి కుటుంబ సభ్యులు మొత్తం 70లక్షల మంది కోసం కొత్త బీమా పథకాన్ని రూపకల్పన చేసినట్లు జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ప్రస్తుతం ఎవరైనా సహజమరణం పొందితే రూ.30వేల పరిహారం అందుతుండగా, కొత్త పథకంలో రూ.75వేలు ఇవ్వాలని ప్రతిపాదించామన్నారు. ఈ ప్రతిపాదనలను త్వరలోనే ముఖ్యమంత్రి ముందు ఉంచుతామన్నారు. 2009ఎన్నికల సందర్భంగా 24 గంటల కరెంట్ ఇస్తామని, రైతులకు 9గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని, ఇంటింటికీ ఎల్‌పిజి కనెక్షన్లు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ ఆ తర్వాత ఒక్క వాగ్దానాన్ని కూడా నెరవేర్చలేదన్నారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ కొత్త రాష్ట్రమైనా తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ రంగంలో దూసుకుపోతున్నదని.. కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వంపై మతిలేని విమర్శలు చేస్తున్నారన్నారు.

18న హజ్ యాత్రికులకు శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ నుండి హజ్‌కు ఎంపికైన యాత్రికులకు ఈ నెల 18న శిక్షణ ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర హజ్ కమిటీ తెలిపింది. మలక్‌పేట పాత రేస్ కోర్స్ సమీపంలోని హై టెక్ గార్డెన్‌లో ఈ శిక్షణ కార్యక్రమం ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ శిభిరాన్ని ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ ప్రారంభిస్తారని తెలియచేశారు. హజ్ కమిటీ ఛైర్మన్ మమ్మద్ మసిహుల్లా అధ్యక్షతన జరిగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొంటారని ఎగ్జిక్యూటివ్ అధికారి ఎస్.ఎ. సుఖూర్ తెలియచేశారు. హజ్ ప్రయాణంలో ఏర్పాట్లు, హజ్ ప్రార్థనలు, యాత్రికులు తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నిబంధనలు వివరించడం జరుగు తుందని ఆయన తెలిపారు.

ఉగాదినుంచి తెలంగాణ చరిత్ర పుస్తకాల పంపిణీ

హైదరాబాద్ ఆంధ్రప్రభ: తెలంగాణ చరిత్రను రాష్ట్ర ప్రజలందరికీ తెలిసేలా మన తెలంగాణ- మన చరిత్ర అనే పుస్తకాన్ని పంపిణీ చేయనున్నట్టు ప్రభుత్వ సలహాదారు కెవి రమణాచారి తెలిపారు. ఈ పుస్తకాలను ఉగాది పర్వదినమైన మార్చి 18 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ ప్రారంభించనున్నట్టు తలిపారు. వీటి వివరాలను ఆయన బుధవారం సచివాలయంలో సీఎం కార్యాలయ ఓఎస్‌డీ దేశపతి శ్రీనివాస్, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణతో కలిసి మీడియాకు తెలిపారు. ప్యాకెట్ సైజ్‌లో ఉండే ఈ పుస్తకాన్ని రాష్ట్ర విద్యా, పరిశోధక శిక్షణా మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) నేతృత్వంలో ముద్రించనున్నట్టు తెలిపారు. ఈ పుస్తకంలో తెలంగాణ భౌగోళిక అంశాలు, తెలంగాణ ప్రత్యేకత, నదులు, చెరువులు వాటి ప్రాముఖ్యతలు, ఖనిస సంపద, చారిత్రాత్మక ప్రాంతాలు, వాటి చరిత్ర, ఈ ప్రాంతాన్ని పాలించిన రాజులు, వారి చరిత్ర, కాకతీయులు, కుతుబ్‌షాహీల చరిత్ర తదితరాలపై పుస్తకంలో పొందుపరిచనున్నట్టు తెలిపారు.



మహిళలు-చిన్నారులపై హింసకు వ్యతిరేకంగా మనీలాలో పింక్ రిబ్బన్ చేతబూని గళమెత్తిన మహిళా లోకం



కోల్‌కతలో గిరిజనుల సామూహిక వివాహాలు

ప్రేమంటే ఇదేరా..!!

ప్రేమికుల దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. భారత దేశంలోనూ లక్షలాది యువతీ యువకులు వేడుకల్లో పాల్గొన్నారు. స్నేహితులకు ఆత్మీయ సందేశాలు, గ్రీటింగ్ కార్డులు, కానుకలు ఇవ్వడం ద్వారా స్వచ్ఛమైన ప్రేమను చాటిచెప్పుకున్నారు. తాము ప్రేమించే, తమను ప్రేమించే వారిని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తే విధంగా, వారి మనసులను సంతోషపరిచేలా ప్రత్యేక కార్యక్రమాలతో సందడి చేశారు. ప్రధాన నగరాల్లో బృందాలుగా ఏర్పడిన యువత కేకులు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. రొమాంటిక్ లంచ్, డిన్నర్ కార్యక్రమాలతో రెస్టారెంట్లు, పబ్‌లు ప్రత్యేక ఏర్పాట్లతో యువతకు ఆహ్వానం పలికాయి. ఇదిలావుండగా, మన దేశంలో కొన్నిచోట్ల ప్రేమికుల దినోత్సవానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. హిందూ సంప్రదాయాన్ని,సంస్కృతిని మంటగలిపే పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉండాలని కొన్ని సంఘాలు ర్యాలీ తీశాయి.



పాట్నాలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



కోల్‌కత: ఎకో పార్కులో తాజ్‌మహల్ ప్రతిమ ముందు ప్రేమికుల సందడి



కుఫ్రీ (హిమాచల్ ప్రదేశ్): మంచు దుప్పటిపై ప్రేమికుల సెల్ఫీ



కివి (ఉక్రెయిన్): ప్రేయసితో ప్రియుడి ఆనందడోలికలు

ముందస్తుకు పరీక్ష!

కీలకం కానున్న ఎనిమిది రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు • రుతుపవనాలు, రబీ దిగుబడుల అంశమూ కీలకమే • ముడి చమురు ధరల పెరుగుదలతో కలవరం



న్యూఢిల్లీ: జమిలి ఎన్నికలు? ముందస్తు ఎన్నికలు? ఈ రెండు అంశాలు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని సందిగ్ధంలో పడేశాయి. కాషాయ భారతమే లక్ష్యంగా బీజేపీని నలుదిశలా విస్తరిస్తున్న మోడీ-షా ద్వయం కొత్తవ్యూహాలకు పదునుపెడుతున్నారు. రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు ఏకకాల ఎన్నికలు, ప్రస్తుత తరుణంలో కాషాయ పార్టీకి లాభదాయకంగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. జమిలి ఎన్నికల అవశ్యకతను రాష్ట్రపతి నుంచి ప్రధానమంత్రి దాకా పలు సందర్భాల్లో నొక్కిచెప్పారు. అయితే, ఈ ఆలోచన కార్యరూపం దాల్చాలంటే అనేక అడ్డంకులను అధిగమించాల్సి ఉంది. జమిలి ఎన్నికలతో ప్రయోజనాలున్నప్పటికీ, ఇప్పటికిప్పుడు అమలు సాధ్యం కాదన్నది నిపుణులు, విశ్లేషకుల వాదన. ఇప్పటికే పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి హడావుడి నిర్ణయాల అయోమయ పరిస్థితులు నేటికీ పూర్తిగా తొలగనేలేదు. ఇలాంటి సందర్భంలో జమిలికి చట్టపరమైన, పరిపాలనాపర ప్రతిబంధకాలను అధిగమించేందుకు సరిపడ సమయం లేదన్నది మరికొందరి అభిప్రాయం. జమిలి ఎన్నికల అంశాన్ని పక్కనబెడితే, రాజకీయ వర్గాల్లో ముందస్తు అంశం చర్చనీయాంశం అవుతోంది. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా, మోడీ హవా మసకబారక ముందే సార్వత్రిక ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ భావిస్తోందా? అంటే అవుననే సంకేతాలు ఆ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది.

మరోసారి ఢిల్లీ పీఠంపై కాషాయ పతాక ఎగురవేసేందుకు కమలనాథులు తహతహ లాడుతున్నారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్న సమయం లోనే, ఎన్నికలకు వెళ్తే మంచిదన్న అభిప్రాయంతో ఉన్నారు. ఇప్పటికైతే ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఆశాజనకంగానే ఉన్నాయి. ద్రవ్యోల్బణం అదుపులో ఉంది. వృద్ధిరేటు అంచనాలను చేరుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సంస్థలు భారత దేశ వృద్ధిరేటుపై సానుకూలంగా ఉన్నాయి. అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు కూడా ఇండియాకు అనుకూలంగానే ప్రగతి నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇదేసమయంలో మూడున్నరేళ్లలో నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయ, గ్రామీణ భారతానికి జవసత్వాలు ఇచ్చేందుకు బడ్జెట్‌లో జైట్లీ సింహభాగం కేటాయింపులు ఇచ్చారు. తద్వారా రైతులు, పల్లెజనాల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని తొలగించే చర్యలు చేపట్టారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనుభవాల నుంచి పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు సాగనుంది.

చమురు సెగల కలవరం!

నరేంద్ర మోడీ ప్రధానిగా పగ్గాలు చేపట్టిన నాటినుంచి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ముడిచమురు అంశం దన్నుగా నిలిచింది. 2014 ప్రారంభంలో బ్యారెల్ ధర 110 డాలర్లగా ఉన్న క్రూడాయిల్ మరుసటి యేడాది ద్వితీయార్థం నాటికి 30 డాలర్ల కనిష్ఠస్థాయిలకు చేరింది. దాదాపు 80 డాలర్లు మేరకు పతనమైంది. ఈ తగ్గుదలను నేరుగా వినియోగదారులకు బదలాయించని కేంద్రం, ఖజానా లోటును భర్తీ చేసుకుంటూ వచ్చింది. ఈ క్రమంలో ద్రవ్యలోటు అదుపులోకి రావడం, వృద్ధిరేటుకు ఊతమిచ్చింది. ప్రజా సంక్షేమ పథకాలకు ఇతోధికంగా నిధులు కేటాయించే వెసులుబాటు ఎన్డీయేకి లభించింది. ముడి చమురు ధరలు ప్రస్తుతం వ్యతిరేక దిశలో ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు మోడీ ప్రభుత్వానికి వరంగా మారిన చమురు అంశమే ఇప్పుడు కలవరానికి గురిచేస్తున్నది. కనిష్ట స్థాయిల నుంచి ఊర్ధ్వముఖంగా పరుగులు తీస్తున్నది. ప్రస్తుతం 65 డాలర్లకు చేరువయింది. రానున్న రెండు త్రైమాసికాల్లో పెట్రో ధరలు 75-80 డాలర్లకు చేరొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తద్వారా ద్రవ్యోల్బణం రంకెలు వేసే ప్రమాదం ఉంది. సంక్షేమ పథకాల నిధులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశమూ ఉంది. ఇదేగనుక జరిగితే ముందస్తు ఎన్నికల మాట వినిపించకపోవచ్చు.

8 రాష్ట్రాల ఎన్నికలే కీలకం

ఈ ఏడాది జరగనున్న ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే ముందస్తును ఖరారు చేస్తాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఒకరకంగా ప్రధానిగా నరేంద్రమోడీ పరిపాలనకు ఈ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగా భావించవచ్చన్నది వారి వాదన. ప్రజలు బీజేపీ, దాని మిత్రపక్షాలకు జైకొడితే గనుక అదే సమరోత్సాహంతో మోడీ సర్కారు ముందస్తు ఎన్నికలకు తప్పక వెళ్తుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీనికితోడు రబీ సీజన్ కూడా ముందస్తును ప్రభావితం చేసే అవకాశం ఉంది. రుతుపవనాలు అనుకూలించి, ఆశించిన స్థాయిల్లో పంట దిగుబడులు రావాలి. విపణిలో రైతు పండించిన పంటలకు సరైన మద్దతు ధర లభించాలి. అప్పుడే అన్నదాత మోడీ పరిపాలనను స్వాగతిస్తాడు.లేదంటే గుజరాత్ తరహా అనుభవం ఎదురయ్యే ప్రమాదం ఉంది. పై రెండు అంశాలు ఏమాత్రం ప్రతికూలమైనా, ముందస్తు ఆలోచనను ఎన్డీయే విరమించుకోక తప్పదని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ మధ్య కాలంలో నిరుద్యోగ యువత ఆకాంక్షలను నెరవేర్చే ప్రయత్నం చేయాల్సిన అవసరం కూడా ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల మెరుగునకు మోడీ ప్రభుత్వం తక్షణ కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం కూడా ఉంది.

కాషాయభారతం సాకారమయ్యేనా?

2014లో నరేంద్రమోడీ ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టిన తర్వాత, కాషాయ పార్టీ అనూహ్యంగా పుంజుకుంది. ఒక్కో రాష్ట్రాన్ని క్రమంగా తమ ఏలుబడిలోకి తెచ్చుకుంటూ, కాషాయ భారత్ లక్ష్యానికి చేరువగా వచ్చింది. దేశంలోని 29 రాష్ట్రాలకు గాను 19 రాష్ట్రాలు బీజేపీ కూటమి నియంత్రణలో ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర వంటి ప్రధాన రాష్ట్రాల్లో బీజేపీయే అధికారంలో ఉంది. సొంతంగా 14 రాష్ట్రాల్లో, మిత్రులతో కలిసి మరో 5 రాష్ట్రాల్లో కమలం పాగావేసింది. ఈ యేడాది ఎనిమిది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నందున, బీజేపీ కాషాయ భారతం ఆశలు ఏమేరకు నెరవేరతాయో వేచిచూడాలి.

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో

లెఫ్ట్.. రైట్.. ఫైట్



- కమ్యూనిస్టుల కంచుకోటపై కమలనాథుల గురి
- బీజేపీ ప్రచార క్షేత్రంలోకి హేమాహేమీలు
- మాణిక్ సర్కార్‌కు ప్రజావ్యతిరేక పవనాలు
- తొలిసారి ద్వితీయ ప్రత్యర్థి స్థాయిలో కాంగ్రెస్!
- 18న పోలింగ్... మార్చి 3న ఓట్ల లెక్కింపు





న్యూఢిల్లీ: ఈశాన్య భారతదేశంలోని చిన్న రాష్ట్రాల్లో త్రిపుర ఒకటి. మొత్తం 60 అసెంబ్లీ స్థానాలు ఉన్న త్రిపుర అసెంబ్లీకి ఈనెల 18న ఎన్నికలు జరగబోతున్నాయి. భౌగోళికంగా చూస్తే ఇండియా మ్యాప్‌లో ఇది ఒకమూలన విసిరేసినట్లుగా కనిపిస్తుంది. ఐదున్నర దశాబ్దాల రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇప్పటి వరకు అధికారం కాంగ్రెస్, వామపక్షాల చేతుల్లోనే ఉంటూ వచ్చింది. కొన్ని సందర్భాల్లో రాజకీయ అస్థిరత కారణంగా మూడు పర్యాయాలు త్రిపుర రాష్ట్రపతి పాలనలోకి వెళ్లింది. ఈసారి ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. కాంగ్రెస్ స్థానంలో అధికారం కోసం బీజేపీ బరిలో ముందుంది. సంస్థాగత కేడర్ లేకున్నప్పటికీ, ఇతర పార్టీల నాయకులను చేర్చుకోవడం ద్వారా బీజేపీ బలమైన శక్తిగా ఎదిగినట్లు కనిపిస్తోంది. నాలుగు దశాబ్దాల నుంచి పాగావేసిన వామపక్ష పార్టీని గద్దెదించడమే లక్ష్యంగా పకడ్బందీ వ్యూహం అమలు చేస్తున్నది. కాగా, ఈ ఎన్నికల్లోనూ విజయబావుటా ఎగురవేయాలని వామపక్షాలు పట్టుదలతో ఉన్నాయి. అయితే, మాణిక్ సర్కార్ ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేకత కాస్తంత ఇబ్బందిగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ కు అధికారంపై ఆశలు లేకున్నప్పటికీ, గతంకంటే కాసిన్ని ఎక్కువ సీట్లు గెలిచి, ఇమేజీని పెంచుకోవాలన్న వ్యూహంతో బరిలోకి దిగింది. 60 స్థానాలకు గాను 297 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం ఓటర్లు 25, 79, 060 మంది. వీరిలో మహిళా ఓటర్లు 12, 67, 785 మంది. 25 మందిసాధారణ పరిశీలకులు, 8 మంది పోలీసు పర్యవేక్షకులు, 19 మంది వ్యయగణన పరిశీలకులు విధుల్లో ఉన్నారు. 30వేల మంది సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారు. 18 న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

త్రిపుర స్వరూపం..

రాష్ట్ర జనాభా 36 లక్షలు. దేశంలో కెల్లా అతి తక్కువ జనాభా ఉన్నది ఇక్కడే. థానె, హౌరా వంటి నగరాల జనసంఖ్య కన్నా తక్కువ. రాష్ట్ర విస్తీర్ణం 40,491చ.కిమీ. బికనీర్, మహబూబ్‌నగర్, కుచ్ జిల్లాలకంటే కూడా చిన్నది. ఇక్కడ రైల్వే నెట్‌వర్క్ కేవలం 153 కి.మీ. దేశ రాజధాని ఢిల్లీలోని మెట్రోలో ఇది సగభాగం కూడా కాదు. త్రిపుర వార్షిక బడ్జెట్ 16వేల కోట్లు. ఢిల్లీ బడ్జెట్‌తో పోల్చితే మూడోవంతు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెట్రోలు బంకుల సంఖ్య 78. లక్నో నగరంతో (191)తో పోల్చితో మూడోవంతు. ఇంత చిన్న రాష్ట్రాన్నీ ముక్కలు చేయాలన్న డిమాండ్లు వినిపిస్తుండటం విశేషం. బీజేపీ మిత్రపక్ష పార్టీ అయిన ఇండిజెనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) విభజన వాదాన్ని భుజానికెత్తుకుంది. గిరిజనులకు ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో గత కొన్ని దశాబ్దాలుగా సామాజిక సుస్థిరత దెబ్బతిన్నది. మరో విచిత్రమేమంటే భాగస్వామ్య పార్టీ నిర్ణయాన్ని బీజేపీ వ్యతిరేకిస్తుండటం. అధికార వామపక్ష పార్టీ కూడా విభజనకు ససేమిరా అంటోంది.

మొత్తం అసెంబ్లీ స్థానాలు - 60
అధికార పార్టీ - సీపీఐ-ఎం
ప్రతిపక్ష పార్టీ - కాంగ్రెస్
ముఖ్యమంత్రి - మాణిక్ సర్కార్

పార్టీలవారీగా రేసులో అభ్యర్థులు

సీపీఎం	57	బీజేపీ	51
సీపీఐ	1	ఐపీఎఫ్‌టీ	9
ఫార్వర్డ్ బ్లాక్	1	కాంగ్రెస్	59
రివల్యూషనరీ	1	టీఎంసీ	24





అభివృద్ధి- సామాజిక స్థితిగతులు - చట్టాల అమలు

భౌగోళిక ప్రతిబంధకాలు ఉన్నప్పటికీ, త్రిపుర స్థిరంగా 8శాతం వృద్ధిరేటును సాధించడం గొప్పవిషయం. జాతీయ సగటు వృద్ధిరేటు 5శాతంతో పోల్చిచూస్తే కమ్యూనిస్టు పాలన మెరుగ్గా ఉందనే చెప్పాలి. పిల్లలపై అఘాయిత్యాల అంశంలో 20వ స్థానం. జాతీయ స్థాయిలో బాలలపై నేరాల శాతం 0.2శాతమే. విద్య విషయానికొస్తే అక్షరాస్యతలో త్రిపుర రెండో స్థానంలో ఉంది. మరో కమ్యూనిస్టు పార్టీ పాలనలోని కేరళ ది మొదటి స్థానం కావడం విశేషం. నవజాత శిశువుల మరణాలు కూడా ఇక్కడ తక్కువే. ప్రతి వెయ్యి జననాల్లో 51మంది మాత్రమే పురిటిలోనే కన్నుమూస్తున్నారు. దేశంలో విద్యుత్ సర్‌ప్లస్ కలిగిన రాష్ట్రాల్లో ఇదీ ఒకటి. 140 మె,వా. విద్యుత్‌ను పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌కు విక్రయిస్తుంది. అటవీ హక్కుల చట్టం ప్రకారం అత్యధిక మందికి భూమి పట్టాలు మంజూరు చేసిన ఘనత కూడా ఈ చిన్న రాష్ట్రానికే దక్కుతుంది.

ఐదున్నర దశాబ్దాల త్రిపుర అసెంబ్లీ ఎన్నికల చరిత్రలో నాలుగు సార్లు కాంగ్రెస్, మూడు సార్లు కమ్యూనిస్టులు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. మధ్యలో మూడు పర్యాయాలు రాష్ట్రపతి పాలన విధించారు.

చిన్న రాష్ట్రం.. పేద ముఖ్యమంత్రి

అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తాజా అధ్యయనం ప్రకారం దేశం కెల్లా పేద ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ అని తేలింది. ఇండియాలోని సీఎంలలో 81శాతం మంది సంపన్నులే. నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన మాణిక్ సర్కార్ బ్యాంక్ బ్యాలెన్స్ రూ. 2,410 మాత్రమే. దీంతో ఆయనకు ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేయాల్సిన అవసరమే రాలేదు. తన భార్య ఆస్తులతో సహా మొత్తం ఆస్తుల విలువ 27 లక్షల రూపాయలే.


బీజేపీకి ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం ఎందుకు?

భారతదేశ రాజకీయ చరిత్రలో ఒక రాష్ట్రంలో కుడి.. ఎడమల మధ్య జరుగుతన్న తొలి సమరంగా ఈ ఎన్నికలను విశ్లేషిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీ - భారతీయ జనతాపార్టీ నేరుగా తలపడుతున్నాయి. వామపక్ష కూటమి ప్రభుత్వంపై గెలుపే లక్ష్యంగా, అనూహ్య రీతిలో బీజేపీ భారీ ఎత్తున ప్రచారం చేసింది. మునుపెన్నడూ లేనివిధంగా పకడ్బందీ కార్యాచరణ సాగించింది. కాషాయ పార్టీ సత్తా నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలు వేదికగా నిలుస్తున్నాయి. కమ్యూనిస్టుల కంచుకోటను కైవసం చేసుకోవడం ద్వారా సార్వత్రిక ఎన్నికలకు ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకోవాలని బీజేపీ చూస్తోంది. ఆ తర్వాత కేరళలోనూ విజయం తేలికవుతుందని భావిస్తోంది.

అధికార పార్టీకి ప్రజావ్యతి రేకత?

అధికారంలోని వామపక్ష కూటమిపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. లెఫ్ట్ స్నేహపూర్వక మీడియా కవరేజీలో, వామపక్షపార్టీల బహిరంగ ప్రకటనల్లోనూ ఇది బహిర్గతం అవుతూ ఉంటుంది. దాదాపు 40 ఏళ్లుగా (1988-93 కాంగ్రెస్ మినహా) లెఫ్ట్ కూటమి ఇక్కడ అధికారంలో ఉంది. ప్రతిపక్షం అనేది లేకుండా రాజకీయ సామ్రాజ్యాన్ని నిర్మించింది. ఈ క్రమంలో 'మార్పు' నినాదంపైనే బీజేపీ ప్రధానంగా ప్రచారం సాగించింది. ప్రజావ్యతిరేకతకు ప్రసార మాధ్యమాల విస్తృతీ ఒక కారణం. 2001 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 23 శాతం కుటుంబాల్లోనే టీవీలుండేవి. ఇప్పుడవి 45శాతానికి చేరాయి.

కాంగ్రెస్ రెండో ప్రత్యర్థి...



దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు వామపక్ష పార్టీలు రెండో ప్రత్యర్థిగా ఉన్నాయి. కానీ ఇక్కడ పూర్తివ్యతిరేకం. లెఫ్ట్ కూటమి దృష్టిలో కాంగ్రెస్ - బి టీమ్. అంటే రెండవ ప్రత్యర్థి అన్నమాట. త్రిపురలో కాంగ్రెస్ నాయకత్వం అధికార పోటీని ఆస్వాదిస్తున్నది. కానీ, సమర్థవంతమైన ప్రతిపక్షంగా ఎదగలేక పోతున్నది. జాతీయ, రాష్ట్ర నాయకత్వం ఇక్కడి రాజకీయాలపై పెద్దగా దృష్టిసారించక పోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ ఖాళీని భర్తీ చేసేందుకు బీజేపీ రంగంలోకి దూకింది. దీంతో త్రిపుర సంగ్రామం ఆసక్తిగా మారింది.



యాసిడ్ బాధితురాలితో నిశ్చితార్థం

- మానవత్వం చాటుకున్న మెడికల్ రిప్ సాహు

లక్నో: 2009లో ప్రేమికుల దినోత్సవం రూపంలో ఆమెను మృత్యువు తరుముకొచ్చింది.. 25 ఏళ్ల యువతి యాసిడ్ దాడికి గురై బుధవారానికి తొమ్మిదేళ్లు పూర్తయ్యాయి. ఆ సమయంలో ఈ ఘటన లక్నోలో తీవ్ర దుమారం రేపింది. ఆమె చికిత్సకు ఎంతో సహాయంగా నిలిచిన సరోజ్ సాహుతో ఆమెకు బుధవారం నిశ్చితార్థం జరిగింది. ఒడిశాలోని జగద్ పూర్‌లో ప్రమోదిని యాసిడ్ దాడికి గురైంది. ఆ సమయంలో ఆమె శరీరం 80శాతం కాలిపోవడంతో పాటు కంటి చూపు కోల్పోయింది. వైద్య చికిత్సల అనంతరం ఆమెకు 20 శాతం చూపు మాత్రమే వచ్చింది. 'ఆ రోజు పరీక్ష రాసి ఇంటికి వెళ్తున్న సమయంలో యాసిడ్ దాడి జరిగింది. దీంతో నేను తీవ్రంగా గాయపడ్డాను. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తొమ్మిది నెలలు శారీరక, మానసిక క్షోభ అనుభవించాను' అని ప్రమోదిని నాటి ఘటన తలుచుకుంది. ఐదేళ్ల పాటు మంచానికి పరిమితమైంది. 2014లో ఇంటి సమీపంలోని ప్రయివేటు ఆస్పత్రిలో అడ్మిట్ అయిన సమయంలో సాహుతో పరిచయం ఏర్పడింది. ఇతను వృత్తిపరంగా మెడికల్ రిప్రెంజెటేటీవ్. ఆమెను నరకం నుండి బయటికి తీసుకురావడానికి సాహు తీవ్రంగా శ్రమించాడు. దీని కోసం అతని ఉద్యోగాన్ని కూడా అతను వదులుకున్నాడు. వెన్నుదన్నుగా నిలిచి 20 శాతం చూపు రావడానికి ఎంతో కృషి చేశాడు. ఢిల్లీ నుండి వైద్య చికిత్సలు చేయించుకుని వచ్చిన అనంతరం 2016, జనవరి 5న స్టాప్ యాసిడ్ అటాక్ క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. అనంతరం వీరి స్నేహం ప్రేమగా మారి పెళ్లికి దారి తీసింది.

హఫీజ్‌కు ఎదురుదెబ్బ

ఇస్లామాబాద్ : ముంబై పేలుళ్ల సూత్రధారి హఫీజ్ సయీద్‌కు మరో ఎదురు దెబ్బ తగిలింది. సయీద్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బడులు, వైద్య కేంద్రాలకు సాయం అందించేందుకు పాక్ ప్రభుత్వం నిరాకరించింది. గత నెలలో ఐక్యరాజ్య సమితి ఉన్నత స్థాయి కమిటీ బృందం పాకిస్థాన్‌లో పర్యటించింది. ఈ నేపథ్యంలో హఫీజ్ సయీద్‌తో పాటు ఉగ్రవాద నిర్మూలనకు చర్యలు తీసుకోవాల్సిందే అని బృందం తేల్చి చెప్పినట్టు సమాచారం. ప్రభుత్వం ఆదేశాలను పంజాబ్ ప్రభుత్వం అమలు చేస్తున్నది. రావల్పిండి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నాలుగు స్వచ్ఛంద సంస్థలకు సహాయం నిలిపివేయాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ స్వచ్ఛంద సంస్థలు జమాత్ ఉద్ దవా (జేయూడీ), ఫల్హా ఐ ఇన్సానియత్ ఫౌండేషన్ (ఎఫ్ఐఎఫ్) ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ రెండు సంస్థలకు సయీద్‌తో అనుబంధం ఉండటంతో వీటిపై చర్యలకు ఉపక్రమించినట్టు పాక్ ప్రభుత్వం తెలియజేస్తున్నది.

ఐఎం ఉగ్రవాది అరిజ్ అరెస్ట్



న్యూ ఢిల్లీ: ఇండియన్ ముజాయిదీన్ ఉగ్రవాది అరిజ్ ఖాన్ అలియాస్ జునైద్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఐదు బాంబు పేలుళ్ల కేసుల్లో నిందితుడిగా ఉన్న అరిజ్ తలపై రూ.15 లక్షల రివార్డు ఉంది. ఉత్తర్ ప్రదేశ్‌లోని ఆజామ్‌గర్‌కు చెందిన అరిజ్ బాంబులు తయారుచేయ డంతో నిపుణుడు. ఖాన్ ను అరెస్ట్ చేసిన తర్వాత ఢిల్లీ స్పెషల్ సెల్ డీసీపీ ప్రమోద్ సింగ్ మాట్లాడుతూ... అరిజ్ 2008 ఢిల్లీ సీరియర్ బాంబు పేలుళ్లు సహా ఎన్నో కేసుల్లో నిందితుడిగా ఉన్నారని పేర్కొన్నారు. ఢిల్లీ పేలుళ్లలో 165 మంది మృతి చెందారని తెలిపారు. 2007లో ఉత్తర్ ప్రదేశ్ పేలుళ్లు, 2008 జైపూర్ వరుస పేలుళ్లు, 2008లో ఢిల్లీ వరుస పేలుళ్లు, 2008 అహ్మదాబాద్ పేలుళ్లలో కీలక పాత్ర పోషించిన అరిజ్ ఎంతోకాలంగా తప్పించుకుతిరుగుతున్నాడు.

భారత్ ఓ అద్భుత శక్తి

• లోకకళ్యాణార్థం వేదిక్ యజ్ఞం • జెండా ఊపి యాత్ర ప్రారంభించిన రాజ్‌నాథ్ సింగ్ • సంక్షేమానికి పెద్ద పీట



న్యూఢిల్లీ : ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల్లో సంక్షేమం విషయంలో భారత్‌కు ఎదురులేదని, భవిష్యత్ కాలంలో ఓ అద్భుత శక్తిగా ఎదుగుతుందని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయ పడ్డారు. మార్చిలో నిర్వహించతలపెట్టిన వేదిక్ యజ్ఞంలో భాగంగా మట్టి, నీటి సేకరణలో బుధవారం రాజ్‌నాథ్ సింగ్ రథ్‌యాత్రను ఇండియా గేట్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా ఈ యాత్ర ఉంటుందని, న భూతో న భవిష్యత్ తరహాలో ఇది కొనసాగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మళ్లీ అధికారం చేజిక్కించుకోవడానికి రాజకీయ ఎత్తుగడలో భాగంగా ఈ యాత్ర నిర్వహించడం లేదని, దేశ నిర్మాణం కోసం చేపడుతున్నామన్నారు. మార్చి 18 నుండి 25 వరకు రాష్ట్రీయ రక్ష మహాయజ్ఞ కార్యక్రమాన్ని 1,100 పూజారుల మధ్య ఎర్రకోట వద్ద నిర్వహిస్తున్నామన్నారు.

భారత్ దేశ అభివృద్ధి కోసమే ఈ కార్యక్రమం చేప ట్టడం లేదని ప్రపంచ సంక్షేమం కోసం చేపడుతు న్నామని వివరించారు. దేశ సాంస్కృతీ, సంప్రదా యాలను పరిరక్షించేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ బృహత్తర యజ్ఞం చేపట్టినట్టు తెలిపారు. వసుదైక కుటుంబం అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదన్నారు. డోక్లాం, ఎల్‌ఓసీ వద్ద ఉన్న పూంచ్, వాఘా సరిహద్దు, చార్‌ధాం నుండి నీరు, మట్టి తీసుకొచ్చి ఈ యజ్ఞం చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీ మహీష్ గిరితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.



పిల్లల్లో పౌష్టికాహార లోపం ఓ సవాల్

• ఆరోగ్య లక్ష్యాల సాధనలో ప్రైవేటు రంగం తోడ్పడాలి • వైద్య సేవలందరికీ అందుబాటులో ఉండాలి: వెంకయ్య నాయుడు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యం కోసం ఏర్పాటు చేసుకున్న లక్ష్యాల సాధనలో ప్రైవేటు రంగం ఇతోధికంగా తోడ్పడాలని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌కు చెందిన రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఢిల్లీ బ్రాంచిని ప్రారంభించిన ఆయన, అనంతరం చేసిన ప్రసంగంలో దేశంలోని వైద్య, ఆరోగ్య రంగాలు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ప్రస్తావించారు. ఢిల్లీలోని మాలవీయనగర్‌లో మధుకర్ ట్రస్ట్ భాగస్వామ్యంతో రెయిన్‌బో హాస్పిటల్స్ గ్రూపు పిల్లల కోసం 150 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నెలకొల్పింది. ఈ కార్యక్రమంలో కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, స్థానిక ఎంపీ రమేశ్ బిధూరి, స్థానిక ఎమ్మెల్యే సోమనాథ్ భారతి, రెయిన్‌బో హాస్పిటల్స్ ఛైర్మన్ డా. రమేశ్ కంచర్ల, ఎంపీలు కేశినేని శ్రీనివాస్ (నాని), డా. కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం చివర్లో ప్రసంగించిన ఉపరాష్ట్రపతి, దేశంలో పిల్లల్లో పౌష్టికాహార లోపం తీవ్రమైన సమస్యగా కొనసాగుతోందని, అభివృద్ధికి ఇదే అతిపెద్ద సవాలుగా నిలుస్తోందని వ్యాఖ్యానించారు. ఒక అంచనా ప్రకారం ప్రతి ఏటా 10.8 లక్షల మంది ఐదేళ్ల లోపు చిన్నారులు చనిపోతున్నారని, కారణాలను విశ్లేషిస్తే తక్కువ బరువుతో పుట్టడం, నెలలు నిండకుండా ప్రసవించడం, నిమోనియా, డయేరియా వంటి అంశాలే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయని ఆయనన్నారు. దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన, ఆరోగ్యకర జీవన విధానం పట్ల ఆసక్తి ఉండాలని అభిలషించారు. ఆరోగ్యమే మహాభాగ్య మన్న సామెతను ఆయన గుర్తుచేశారు. ''మనం ఆరోగ్యంగా ఉంటే, డబ్బు సంపాదించుకోవచ్చు, కానీ డబ్బు సంపాదించినంత మాత్రాన ఆరోగ్యాన్ని సంపాదించుకోలేము'' అని వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయబోతున్న నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ స్కీం నిరుపేదల జీవితాల్లో పెనుమార్పు తీసుకొస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. చిన్నపిల్లల కోసం ప్రత్యేకంగా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు ప్రారంభించడాన్ని స్వాగతించిన వెంకయ్య నాయుడు, ఈ వైద్యం, వైద్య సేవల ధరలు అందరికీ అందుబాటులో ఉండాలని అన్నారు. మరోవైపు ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లే యువత కొన్నాళ్ల తర్వాతైనా స్వదేశానికి తిరిగొచ్చి సేవ చేయాలని పిలుపునిచ్చారు. స్వదేశీయులకు సేవ చేయడాన్ని మించిన సంతృప్తి మరెందులోనూ దొరక దని ఉపరాష్ట్రపతి వ్యాఖ్యానించారు. వైద్య వృత్తి ఒక మిషన్‌లాంటిదని, దాన్ని కమిషన్‌గా మార్చవద్దని హిత వు పలికారు. భావి భారత పౌరులు చిన్నారులేనని, వారి కోసం ప్రత్యేకంగా ఆసుపత్రులు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వెంకయ్య నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన కేంద్ర వైద్యా రోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, పిల్లల అత్యవసర వైద్య సేవలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడం చాలా గొప్ప విషయమని అభినందించారు. రెయిబో హాస్పిటల్స్ ఛైర్మన్ డా. రమేశ్ కంచర్ల మాట్లాడుతూ తాము ఎంతో ఉన్నత లక్ష్యంతో రెయిన్‌బో ఆసుపత్రు లను ప్రారంభించినట్టు తెలిపారు. వైద్య సేవల్లో ఒక ముద్ర వేశామని, ఆ క్రమంలో తమ ఆసుపత్రుల చైన్ విస్తరిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో అడుగుపెట్టామని అన్నారు.

అమెరికా స్పై వద్ద కాల్పులు

వాషింగ్టన్: అమెరికా జాతీయ భద్రతా సంస్థ వెలుపల కాల్పుల ఘటన కలకలం రేపింది. మేరీలాండ్‌లో ఉన్న ఫోర్ట్ మీడేలోని జాతీయ భద్రతా సంస్థ వద్ద సాయుధుడు జరిపిన కాల్పుల్లో ముగ్గురు గాయపడ్డారు. వెంటనే తేరుకున్న భద్రతా సిబ్బంది అనుమానితుడిని అరెస్ట్ చెసి దర్యాప్తు ప్రారంభించారు. నల్లరంగు గల ఎస్‌యూవీ వాహనం భవనం సమీపంలోని కాంక్రీట్ బారియర్‌ను ఢీ కొట్టినట్లు గుర్తించిన అధికారులు.. సాయుధుడి కాల్పుల్లో భద్రతా సంస్థ సమీపంలోని వాహనాలు అద్దాలు ధ్వంసమైనట్లు తెలియజేశారు. అయితే పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు ఎన్ఎస్ఏ పేర్కొంది. కాల్పుల ఘటనపై ఆరా తీసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించినట్లు వైట్ హౌస్ వర్గాలు పేర్కొన్నాయి.

న్యూ ఓర్లియన్స్‌లో కాల్పుల మోత

ముగ్గురి మృతి, ఐదుగురికి గాయాలు



న్యూ ఓర్లియన్స్: అమెరికాలోని న్యూ ఓర్లియన్స్ లో రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ముగ్గురు మృతి చెందగా.. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సాంప్రదాయ కవాతు మార్గంలో బుధవారం మధ్యాహ్నం సాయుధుడు రెండుసార్లు జరిపిన కాల్పుల్లో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా.. చిన్నారి సహా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మరో ప్రదేశంలో కారులో వెళ్తున్న ఐదుగురిపై ుదుండగుడు కాల్పులు జరిపాడు. కారులోని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు అధికారులు వివరించారు. ప్రజలు హౌస్ పార్టీ నిర్వహించుకుంటుండగా మూడోసారి కాల్పులు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. అందరీ సెలబ్రేషన్స్ లో ఉండగా ఒక్కసారిగా తుపాకుల మోత జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

లిబియాలో 23 మంది దుర్మరణం

ట్రిపోలి: లిబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 23 మంది వలస కార్మికులు దుర్మరణం చెందగా..100 మందికిపైగా గాయపడ్డారు. 300మంది వలస కార్మికులతో వెళ్తున్న ట్రక్ బనీ వాలిడ్ నగరానికి సమీపంలో ప్రమాదానికి గురవ్వడంతో అక్కడికక్కడే 23 మంది మృతి చెందారు. వలస కార్మికులంతా ఇరిట్రియన్, సోమాలియా దేశాలకు చెందిన వారుగా అధికారులు గుర్తించారు. పరిమితికి మించి ప్రయాణికులను ట్రక్కులో ఎక్కించుకోవడం వల్లే ప్రమాదం జరిగిందని తెలిపారు. గాయపడిన వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలియజేశారు.

'వాలెంటైన్స్‌డే' ప్రెగ్నెన్సీలు

లండన్: ప్రేమికుల రోజు దంపతులకు తీపి జ్ఞాపకాలను మిగులుస్తున్నట్లు ఇంగ్లాండ్ జాతీయ ఆరోగ్య సేవల అధ్యయనంలో వెల్లడైంది. ప్రతి ఏడాది ఫిబ్రవరి 14ను ప్రేమికులు వాలంటైన్స్ డే ను జరుపుకుంటుగా.. ఆ వారంలో ప్రెగ్నెన్సీల సంఖ్య సాధారణం కంటే5శాతం ఎక్కువగా నమోదైనట్లు అధ్యయనంలో తేల్చారు. 2015 నుంచి అధ్యయనం నిర్వహించగా.. వాలంటైన్స్ వీక్‌లోనే దాదాపు 16వేల 263 మంది గర్భం ధరించినట్లు తెలిసింది.సంవత్సరంలోని ప్రతీ వారాన్ని ప్రామానికంగా తీసుకుని ప్రెగ్నెన్సీలపై అధ్యయనం చేయగా.. సాధారణ వారంలో 15వేల 427 మంది గర్భం దాల్చగా..ప్రేమికుల రోజు జరుపుకున్న వారంలో మాత్రం ఈ సంఖ్య 16వేల 263 మందితో 5శాతం ఎక్కువగా నమోదైనట్లు పేర్కొన్నారు. క్రిస్మస్ పండగ జరుపుకునే వారంలో 16వేల 344 మంది గర్భం దాలుస్తుండగా.. ఆ తర్వాత స్థానంలో ప్రేమికుల రోజు జరుపుకునే వారమే ఉన్నట్లు పరిశోధకులు వెల్లడించారు. ప్రేమికుల వారంలో దంపతుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు మరింతగా పెరిగి... ప్రెగ్నెన్సీలకు కారణమౌతున్నట్లు ఇంగ్లాండ్ ఎన్‌హెచ్ఎస్ మెటర్నిటీ ట్రాన్స్‌పర్మేషన్ ప్రోగ్రామ్ హెడ్ సారా జేన్ మార్ష్ తెలిపారు.

ఎన్నికల కమిషనర్ల జీతాలు రెట్టింపు

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘంలోని ఎన్నికల కమిషనర్ల జీతాలు రెండు రెట్లు పెరిగాయి. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌తో పాటు ఎన్నికల సంఘంలోని మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల వేతనాలు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల జీతాలతో సమానంగా పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఎన్నికల కమిషన్‌లోని కమిషనర్‌లకు నెలకు రూ. 90 వేల జీతాలు చెల్లిస్తుండగా.. తాజా నిర్ణయం ప్రకారం ఇకనుంచి వారికి నెలకు రూ. 2.50 లక్షల వేతనం అందనుంది. పెంచిన వేతనాలు జనవరి 1, 2016 నుంచి వర్తిస్తాయి. ఈ ఈ నిర్ణయంతో గత చీఫ్ ఎలక్షన్ కమిషనర్లు, ఎలక్షన్ కమిషనర్లకు కూడా లబ్ది చేకూరనుంది.వారివారి సేవలకు అనుగుణంగా జీతాల పెంపు చేసినట్లు తెలుస్తోంది. గతనెల 25న సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల జీతాల పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కు కూడా అదే విధానాన్ని అమలు చేసినట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. కేంద్రం నిర్ణయంతో ముగ్గురు ఎన్నికల కమిషనర్లు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులతో సమానంగా జీతాలు పొందనున్నారు. ఎలక్షన్ కమిషన్ చట్టం 1991 లోని సెక్షన్ -3 ప్రకారం ఎన్నికల సంఘంలోని చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర కమిషనర్లకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు సీజేలతో సమానంగా వేతనం ఇవ్వాలి. ఈనేపథ్యంలోనే కేంద్రం జీతాల పెంపు నిర్ణయం తీసుకుంది.

చైనా వాణిజ్యంపై ట్రంప్ ఫైర్

వాషింగ్టన్: అధ్యక్ష పదవిలో కూర్చుంది మొదలు కీలక, వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న అమెరికన్ అధ్యక్షుడు ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు ప్రకటించారు. అది చైనాతో ఉన్న వాణిజ్య సంబంధాలపై కావడం మరింత ఆసక్తిని రేపుతోంది. బుధవారం తన మంత్రివర్గ సహచరులతో వైట్ హౌస్‌లో నిర్వహించిన ఓ సమావేశంలో చైనా అనుసరిస్తున్న అసంబద్ధమైన వాణిజ్య విధానం అమెరికన్ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతోందని, ఇది రెండు బలమైన ఆర్థిక వ్యవస్థలు కలిగిన అగ్ర దేశాల మధ్య ఆర్థిక యుద్ధానికి దారి తీసేలా ఉందని ట్రంప్ పేర్కొన్నట్లు అధ్యక్షుడి వాణిజ్య కార్యదర్శి విల్‌బర్ రోజ్ పేర్కొన్నారు. మనదేశం స్టీల్, అల్యూమినియం ఉత్పత్తుల ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం, ఉపాధి అవకాశాలను కలిగి ఉంది.. కానీ చైనా తన అవసరానికి మించి వీటిని ఉత్పత్తి చేస్తోంది. అంతేకాకుండా ఆ అదనపు ఉత్పత్తులను అమెరికన్ మార్కెట్‌లలో డంప్ చేస్తోంది. దీని వల్ల అమెరికా ఆదాయంతో పాటు ఉద్యోగాల విషయంలో కూడా ఇబ్బందులు ఎదురౌతున్నాయి. దీనిపై ఇప్పటికే మా నిపుణుల బృందం అన్ని అంశాలను, క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. సత్వరం తగిన చర్యలు తీసుకోక పోతే భవిష్యత్‌లో మరిన్ని కొత్త ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది అని ట్రంప్ అన్నారు. కేవలం చైనా వల్లనే 504 బిలియన్ డాలర్ల డెఫ్‌షీట్ ఏర్పడినట్లు చెప్పారు. చైనా, కొరియా, జపాన్, సౌదీ అరేబియా సహా ఇతర దేశాలు అనుసరిస్తున్న విధానాలను ఇక మీదట ఉపేక్షించే ప్రసక్తే లేదు. తక్షణమే వారితో గట్టిగా చర్చించటానికి నిర్ణయించుకున్నాము. అలాగే కొరియాతో ఉన్న వాణిజ్య ఒప్పందాలు కూడా చాలా అసంబద్ధమైనవి. వీటిని ఎలా కొనసాగిస్తున్నామో ఇప్పటికీ అర్థం కావడం లేదు అంటూ ట్రంప్ ఈ సమావేశంలో వాఖ్యానించినట్లు రోజ్ చెప్పారు.

పోర్న్‌స్టార్‌కు చెల్లింపులు నిజమే

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పోర్న్‌స్టార్ స్టెఫానీ క్లిఫ్ఫోర్డ్ అలియాస్ స్ట్రోమీ డేనియల్స్‌కు 1,30,000 వేల డాలర్లను చెల్లించిన మాట నిజమేనని ట్రంప్ వ్యక్తిగత న్యాయవాది మైఖేల్ కోహెన్ మీడియాకు వెల్లడించారు. అయితే ఇది ఎందుకు చెల్లించాల్సి వచ్చిందో మాత్రం వివరించలేదు. ఈ చెల్లింపులు పారదర్శకంగా, న్యాయబద్ధంగానే జరిగాయని, ట్రంప్‌కు సంబంధించిన సంస్థ కోసం గానీ, ట్రంప్ ప్రచారం కోసం గానీ ఈ చెల్లింపులు జరగలేదు అని ఆయన తెలిపారు. అమెరికన్ మీడియా కథనం ప్రకారం ఈ చెల్లింపులు 2016 ఎన్నికలకు ఒక నెల ముందు జరిగాయి. అప్పటికి ట్రంప్ సాధారణ పౌరుడి హోదాలోనే ఉన్నారు. అయితే ఈ శృంగార తారతో ట్రంప్‌కు ఉన్న అక్రమ సంబంధం గుట్టుగా ఉంచడానికే ఈ చెల్లింపులు జరిపినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ విషయం ప్రఖ్యాత వాల్‌స్ట్రీట్ జర్నల్ మీడియా సంస్థ గత నెలలో తొలి సారిగా వెలుగులోకి తెచ్చింది. ఈ విషయం పదే పదే మీడియాలో చెక్కర్లు కొడుతుండటంతో ట్రంప్ తన న్యాయవాది ద్వారా వివరణ ఇప్పించినట్లు భావిస్తున్నారు. అయితే వీరి మధ్య సంబంధం గురించి 2011లో టచ్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డేనియెల్ వివరంగా చెప్పింది. ఈ ఇంటర్వ్యూను గత నెలలో ఆ మ్యాగజైన్ మరోసారి ప్రచురించింది.

ఊడిన విమాన ఇంజిన్ కవర్

• పసిఫిక్ మహా సముద్రంపై ఎగురుతుండగా ఘటన
• త్రుటిలో తప్పిన ముప్పు



వాషింగ్టన్: యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానం తృటిలో ఘోర ప్రమాదం నుంచి తప్పించుకుంది. విమాన ఇంజన్ పై కవర్ ఊడి పోవడంతో పైలెట్‌లు చాకచక్యంగా వ్యవహరించి అత్యవసర లాండింగ్‌కు చర్యలు తీసుకోవడంతో 373 మంది ప్రాణాలు గాలిలో కలిసి పోకుండా ఆపగలిగారు. యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 1175 విమానం శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి హొనలులు బయలు దేరింది. విమానం పసిఫిక్ మహాసముద్రంపై ఎగురుతుండగా దాని కుడివైపున ఉన్న ఇంజిన్ కవర్ ఊడి సముద్రంలో పడిపోయింది. దీంతో విమానం కుదుపులకు గురైంది. విషయాన్ని గమనించిన పైలెట్‌లు అత్యవసర ల్యాండింగ్‌ను ప్రకటించి, చాకచక్యంగా డేనియల్ కె ఇనోయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా దించారు. అప్పటికే అగ్నిమాపక శకటాలతో పాటు, రెస్క్యూ టీంలు కూడా అప్రమత్తంగా ఉండడంతో ప్రయాణికులు అందరూ క్షేమంగా విమానం నుంచి బైట పడ్డారు. ఈ విషయమై యునైటెడ్ ఏయిర్‌లైన్స్ ప్రతినిధి మాట్లాడుతూ పైలెట్‌లు చాకచక్యంగా వ్యవహరించి సేఫ్‌ల్యాండ్ చేశారు. ప్రయాణికులు అందరూ క్షేమంగానే దిగారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశాలు జారీ చేశాం అని పేర్కొన్నారు.


నేతాజీపై మేనల్లుడి పుస్తకం



న్యూఢిల్లీ : భారత స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణంపై ఇప్పటికే పలు పుస్తకాలు వచ్చాయి. అయినా ఆయన మరణంపై ఎప్పుడూ ఏదో ఒక చర్చ జరుగుతూనే ఉంటుంది. దీనికి ముగింపు పలకాలనే ఉద్దేశంతో నేతాజీ మేనల్లుడు ఆశిష్ రే నిర్ణయించుకున్నారు. అందుకే బోస్ మరణం వెనుక సంఘటనలపై అధికారిక, అనధికార నివేదికలు, వివరాలను సేకరించి 'లెయిడ్ టు రెస్ట్' పేరుతో పుస్తక రూపంలో తీసుకు వచ్చారు. నేతాజీ కుమార్తె అనితాబోస్ పఫఫ్స్ ముందు మాటతో ఈ పుస్తకం మొదలవుతుంది. ఇందులో పొందు పరిచిన 11 విచారణ నివేదికలూ చివరికి నేతాజీ ఆగస్ట్ 18 1945లో మరణించినట్లు తేల్చాయి. ఢిల్లీలోని బికనీర్ హౌస్‌లో జరిగిన పుస్తకావిష్కరణ సందర్భంగా రచయిత మాట్లాడుతూ.. వీరోచిత మూర్తి సుభాష్ చంద్రబోస్ మరణంపై ఉన్న ఊహాగానాలకు ఈ పుస్తకం ముగింపు పలుకుతుందనే ఆశిస్తున్నా.

ఈ 11 నివేదికలలో 4 ఇండియా, 3 జపాన్, 3 బ్రిటీష్, 1 తైవాన్‌కు చెందినవి ఉన్నాయి. ఇవన్నీ దాదాపుగా మావయ్య 1945 ఆగస్ట్ 18నే మరణించినట్లు తేల్చాయి. జపనీస్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన విమానం కొద్దిగా సాంకేతిక లోపంతోనే తైపేకి బయలుదేరింది. దురదృష్టవశాత్తూ అది మార్గమధ్యలోనే కూలిపోయింది. కొన్ని నివేదికల ప్రకారం బోస్ విమాన ప్రమాదం జరిగిన వెంటనే మరణించలేదని, ఆయన్ను నన్మోన్ సైనిక ఆసుప్రతికి తరలించిన కొద్ది గంటల తర్వాత మరణించారని తెలుస్తోంది. ప్రమాద సమయానికి విమానంలో 13-14 మంది ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో సగం మంది మరణించారు. మిగిలిన వారిని ఆసుపత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షులైన వారి స్టేట్‌మెంట్‌లు కూడా రికార్డు చేసినట్లు నివేదికలు తెలియజేస్తున్నాయి అన్నారు. ఈ పుస్తకంపై తమ అభిప్రాయాలను తెలిపిన ఇతర రచయితలు సైతం బోస్ మరణించి దాదాపు ముప్పావు శతాబ్దం పూర్తవుతున్నప్పటికీ ఇప్పటికీ వివాదం సద్దు మణగక పోవడానికి కుళ్ళు రాజకీయాలే కారణమని ఏకగ్రీవంగా తేల్చారు. ఈ సందర్భంగా వక్తలు జపాన్‌లోని రెంకోజీ దేవాలయంలో భద్ర పరచబడిన నేతాజీ వస్తువుల ను, అస్థికలను ఇండియాకు తీసుకు రావాలని డిమాండ్ చేశారు. నేతాజీ కుమార్తె కూడా ఇదే డిమాండ్‌ను చాలా కాలంగా వినిపిస్తున్నారు.

ఇజ్రాయెల్ ప్రధానిపై కేసు



జెరుసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చిక్కుల్లో పడ్డారు.. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై పక్కా సాక్షాలున్నట్లు పోలీసులు స్పష్టం చేయడంతో పాటు ఆయనపై అవిశ్వాస తీర్మానానికి పోలీసులు సిఫార్స్ చేశారు. అయితే పోలీసుల సిఫార్సులతో తాను వెనకంజ వేసే ప్రసక్తే లేదని నెతన్యాహు చెప్పుకొస్తారు. వ్యాపార వేత్తలు, ప్రముఖుల నుంచి నెతన్యాహు 10 ఏళ్ల కాలంలో రూ.3 లక్షల డాలర్ల సొమ్మును స్వీకరించారన్నది పోలీసుల ఆరోప ణ. ఇజ్రాయెల్‌లో ప్రముఖ వార్తా పత్రిక ఏడియట్ అహరోనట్ పబ్లిషర్ ఆర్నోన్ మోజేస్ ను అనుకూలంగా నెతన్యాహు వ్యవహరించి ఆయన వద్ద ముడుపులు స్వీకరించారని పోలీసులు ధృవీకరించారు. 14 నెలలుగా దర్యాప్తు జరిపి ప్రధానిపై అవిశ్వాసానికి సిఫార్స్ చేశారు. అయితే ఇజ్రాయెల్ లో అటార్నీ జనరల్ నిర్ణయమే కీలకం. ఆయన తీసుకునే నిర్ణయంపైనే నెతన్యాహు భవితవ్యం ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో నెతన్యాహుకు వ్యతిరేకంగా అటార్నీ జనరల్ వ్యవహరించే సూచనలు కనిపించడం లేదు. పోలీసులు ఆరోపణలపై స్పందించిన నెతన్యాహు తాను అవినీతి ఆరోపణలకు బయపడబోనని..ప్రజల సంక్షేమం కోసమే నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు సార్లు ఇజ్రాయెల్ ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన నెతన్యాహుకు ప్రజల్లో కూడా మంచి ఆదరణ ఉంది. అయితే ఇటీవల కాలంలో ఆయనకు ప్రజాదరణ తగ్గుతుందని పలు సర్వేల్లో వెల్లడైంది. ఏదైమైనా ఎన్నికల ముందు ఇలాంటివి సర్వ సాధారణమే అని నెతన్యాహు పేర్కొనడం గమనార్హం.

మోడీ విధానాలతో 5 రెట్లు పెరిగిన ఉగ్రవాదం

• ప్రధానిపై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు • దశ-దిశ లేని మోడీతో ప్రజలకు ఇబ్బందులు: అభిషేక్ సింఘ్వీ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రధానమంత్రి నరేంద్రమోడీ దశా,దిశా లేని విధానాల వల్లే ఉగ్రవాదం పెరుగుతోందని, కాల్పుల విరమణ ఉల్లంఘన జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. విదేశాంగ, రక్షణ విధానాల్లో స్థిరత్వం లేని కారణంగా ఉగ్రదాడులు, కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలు భారీగా పెరిగాయని ఆ పార్టీ అధికార ప్రతినిధి అభిషేక్ మనుసింఘ్వీ అన్నారు. బుధవారం న్యూఢిల్లీలో ఏఐసిసి ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశ రక్షణ విషయంలో రాజీ పడడం దురదృష్టకరమని, ప్రభుత్వం ఏ చర్య తీసుకోకుండా నిష్క్రియపరత్వంగా వ్యవహరిస్తోందన్నారు. గడిచిన 44 నెలల్లో మోడీ ప్రభుత్వ హయాంలో 286 మంది జవాన్లు, 138 మంది పౌరులు మరణించారని తెలిపారు. అదే సమయంలో యుపిఏ హయాంలో 115మంది జవాన్లు, 72మంది పౌరులు చనిపోయారని చెప్పారు కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనలు అయిదింతలు పెరిగాయని, మొత్తం 2,555 సార్లు కాల్పులు జరిగాయని తెలిపారు. యుపిఏ హయాంలో 543 ఉల్లంఘనలు జరిగాయని చెప్పారు. ఈ అంశంలో ప్రభుత్వం ఆత్మవంచనతో, రెండునాల్కల ధోరణితో వ్యవహరి స్తోందని విమర్శించారు. తాము లేవనెత్తిన ప్రశ్నలకు, లెక్కలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 56 ఇంచుల ఛాతీ కేవలం కాగితపు ప్రకటనలకే పరిమితమైందన్నారు. జాతీయ భద్రత విషయంలో మోడీ ప్రభుత్వానికి విధానమే లేదని అన్నారు.

దాని వల్ల సరిహద్దుల్లో తరుచుగా ఉల్లంఘనలు జరుగుతున్నాయని అన్నారు. ఏకపక్ష విదేశాంగ విధానం, అస్థిర నిర్ణయాల వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైందన్నారు. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు ఆర్మీ చూపిస్తున్న శౌర్యాన్ని ప్రశంసించారు. సైన్యానికి తాము మద్దతుగా ఉంటామని చెప్పారు. కానీ అస్థిర విధానాల వల్ల ఉగ్రదాడులు, కాల్పుల ఉల్లంఘనలు అయిదింతలు పెరిగాయని చెప్పారు. కట్టుదిట్టమైన భద్రత ఉందని గొప్పలు చెప్పుకుంటున్న మోడీ హయాంలో తరుచుగా రక్షణశాఖ కేంద్రాలపై ఉగ్రదాడులు జరుగుతున్నాయన్నారు. ఉగ్రవాదులు స్వేచ్ఛగా దేశంలో చొరబడి, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వం చూపిస్తున్న శౌర్యం, పరాక్రమం,జాతీయ వాదం ఇదేనా? అని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టడమేనని విమర్శించారు. గతంలో 2014లో తమకు అయిదు ప్రశ్నలు వేసిన మోడీ తిరిగి వాటికి ఇప్పుడు సమాధానం చెప్పాలని అన్నారు. మోడీ ప్రభుత్వ విదేశాంగ విధానం వల్ల ఎంతమంది నేరస్థులను విదేశాల నుంచి పట్టుకుని వచ్చారో తెలపాలని ప్రశ్నించారు.

క్రీడాప్రభ



ఓటమి పాఠాలు నేర్పింది

• దక్షిణాఫ్రికా కోచ్ గిబ్సన్

పోర్ట్ ఎలిజబెత్: ప్రముఖ ఆటగాళ్లు లేరన్న కారణంతో దక్షిణాఫ్రికా ఓడిందన్న వాదనను తాను ఒప్పుకోనని ఆ జట్టు కోచ్ ఒట్టిస్ గిబ్సన్ అన్నాడు. జట్టు సామర్థ్యలేమిని తాను దాచడానికి ప్రయత్నించడంలేదని.. రానున్న రోజుల్లో జట్టు సామర్థ్యం పెంచడానికి మరింత కృషి చేస్తామని చెప్పాడు. జట్టు ఓటమికి ప్రముఖ ఆటగాళ్లు లేకపోవడం కారణం కాదని అన్నారు. డ్రెస్సింగ్ రూంలో ఇదే విషయాన్ని తమ ఆటగాళ్లకు చెప్పానన్నాడు. చివరి వన్డేకు తమ జట్టు మరింత సామర్థ్యంతో బరిలోకి దిగుతుందన్నారు. 'పెద్ద ఆటగాళ్లు లేరని నిరాశతో ఆడవద్దు. ఓటమికి కారణాలు వెతకవద్దు. పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించి గెలువడానికి ప్రయత్నిద్దాం. బలమైన భారత్‌తో ఓటమిని సకారాత్మకంగా తీసుకుంటాం.. రానున్న మ్యాచుల్లో పూర్తి స్థాయి సామర్థ్యంను ప్రదర్శించేందుకు సమాయత్తమవుతున్నాము' అని గిబ్స్ ఐదో వన్డే అనంతరం మీడియాతో వ్యాఖ్యానించాడు. ప్రపంచ కప్‌పైనే మా దృష్టిని కేంద్రీకరిస్తున్నామని ఇప్పుడు చూస్తున్న జట్టు టోర్నమెంట్లోకి అడుగుపెడుతుందని మీరు అనుకోవద్దు అని అన్నాడు. యుజువేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్ స్పిన్ మంత్రాంగం ఇంగ్లండ్‌లో జరిగే ప్రపంచకప్‌లో పనిచేయదని గిబ్స్ తెలిపారు. ఐదో వన్డేలో కీలకసమయంలో తమ బ్యాట్స్‌మన్లు విఫల మయ్యారని ఆయన వాపోయారు. ఈ సిరీస్‌పై ఆశావాదంతోనే ముందుకు సాగుతున్నామని మా బౌలర్లు భారత్‌ను 274 పరుగులకే కట్టడి చేయడం తనకు సంతోషాన్నిచ్చిందన్నారు. అయితే బ్యాట్స్‌మన్లు రాణించ లేకపోయారన్నారు. బుమ్రా భారత్‌కున్న అత్యుత్తమ ఫాస్ట్ బౌలరని ప్రశంసించాడు. రెండు జట్ల బ్యాటింగ్ తీరును పరిశీలిస్తే.. భారత టాప్ ఆర్డర్‌లోని ముగ్గురు చేసిన పరుగులు కీలకంగా మారాయన్నారు.



సిరీస్‌ను 5-1 తేడాతో గెలుస్తాం

• జట్టు సమష్టి కృషి ఫలితమే ఈ విజయం

• చివరి వన్డేలో జట్టులో మార్పులుండొచ్చు

పోర్ట్ ఎలిజబెత్: దక్షిణాఫ్రికా గడ్డపై దక్షిణాఫ్రికాపై సిరీస్ గెలవడం తనకు సంతోషాన్నిచ్చిందని భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. శుక్రవారం జరిగే ఆరోది..చివరిదైన వన్డేలో కూడా గెలిచి సిరీస్‌ను 5-1 తేడాతో ముగిస్తామని ధీమాను వ్యక్తం చేశాడు. భారత్ ఇప్పటివరకు ఆతిథ్య దేశంపై ఆదేశంలో ఏ ఫార్మాట్లోను సిరీస్ గెలవ లేదు. మంగళవారం నాటి గెలుపుతో వన్డే లో సిరీస్‌ను భారత్ సొంతం చేసుకొని చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. 'ఈ సిరీస్ అనంతరం మా జట్టులోని లోపాలను సవరించుకునేందుకు సమీక్ష నిర్వహిస్తాం. ఈ సిరీస్‌ను 5-1 తేడాతో గెలుచుకుంటాం. చివరి మ్యాచ్‌లో కొత్త ఆటగాళ్లను ఆడించే ప్రయాత్నం చేస్తున్నాము. మా లక్ష్యం గెల వడం ఇందు కోసం ఏమైనా చేస్తాం' అని కోహ్లీ అన్నాడు. స్పిన్నర్లు యుజువేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌ల ప్రతిభ ఎనలేదని పేర్కొంటూ.. సిరీస్ విజయంలో జట్టు సమష్టి కృషే కారణమని చెప్పారు. తమ సిరీస్ గెలుపుపై కోహ్లీ బుధవారం మీడియాతో మాట్లాడాడు. దక్షిణాఫ్రికా సిరీస్ కోల్పోయి ఒత్తిడిలో ఉందని.. మూడో టెస్టు అనంతరం నుంచి మాకు అదృష్టం కలిసివస్తోంది. చరిత్ర సృష్టించడానికి మా జట్టు సమష్టిగా ప్రయత్నాలు సాగిస్తోంది అని కోహ్లీ వ్యాఖ్యానించారు.

మా ఆటగాళ్లు బాగా ఆడారు: మర్‌క్రమ్

దక్షిణాఫ్రికా కెప్టెన్ ఎడెన్ మర్‌క్రమ్ ప్రముఖ ఆటగాళ్లులేని తమ జట్టు బాగా ఆడిందన్నారు. దక్షిణాఫ్రికా రెగ్యులర్ కెప్టెన్ డు ప్లెస్సిస్ వేలుకు గాయం కావడంతో ఆటకు దూరంకాగా, మరో ప్రముఖ ఆటగాడు డివిల్లియర్స్ కూడా గాయం కారణంగా తొలి మూడు వన్డేలకు దూరమయ్యాడు. వికెట్ కీపర్ డికాక్ కూడా సిరీస్ మధ్యలోనే గాయంతో ఆటకు దూరమయ్యాడు. 'భారత్‌కే విజయం దక్కాల్సింది అదే జరిగింది. మా బ్యాట్స్‌మన్లు అనుకున్నంత స్థాయిలో రాణించలేకపోయారు. భారత్ వికెట్లు కోల్పోయినప్పుడు తిరిగి పుంజుకోవడానికి ఇబ్బంది పడింది. వారి గేమ్ ప్రణాళికలు మంచి ఫలితాలిచ్చాయి. వారి ఆట తీరును ప్రశంసించాల్సిందే' అని మర్‌క్రమ్ అన్నాడు. భారత స్పిన్నర్లను ఎదుర్కోవడంలో సఫారీలు కష్టపడుతున్నారన్న ఓ విలేకరి ప్రశ్నకు మర్‌క్రమ్ బదులిస్తూ సిరీస్‌లో భారత స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొంటున్నామని అన్నారు. అయితే ఈ ప్రక్రియ ప్రాథమిక స్థాయిలో ఉందని సిరీస్ ముగిసేసరికి తాము అనుకున్న ఫలితాలను పొందుతాము అని అన్నారు.

ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ టాప్

దుబాయ్: దక్షిణాఫ్రికాతో ఐదో వన్డేలో గెలుపుతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ అగ్ర స్థానం మరింత పటిష్టమ యింది. ఒకవేళ సెంచూరియన్‌లో చివరి వన్డేలో దక్షిణాఫ్రికా గెలిచినప్పటికి భారత్ 121 పాయింట్లతో అగ్ర స్థానంలోనే ఉంటుంది. కాగా దక్షిణాఫ్రికా 119 పాయింట్లతో రెండో స్థానంలో ఉంటుంది. వన్డే సిరీస్ ప్రారంభంలో భారత్ 119 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా 121 పాయింట్లతో అగ్ర స్థానంలో ఉంది. ఐదో వన్డేలో భారత్, సఫారీలను 4-1 తేడాతో ఓడించి సిరీస్‌ను గెల్చుకోవడంతో భారత్ 122 పాయింట్లో అగ్రస్థానంలోకి ఎగబాకగా, దక్షిణాఫ్రికా 118 పాయింట్లకు పడిపోయింది. ఒక వేళ భారత్ 5-1 తేడాతో సిరీస్ ముగిస్తే.. భారత్‌కు 123 పాయింట్లు వస్తాయి. దక్షిణాఫ్రికా ఒక పాయింట్ కోల్పోయి 117 పాయింట్లకు పడిపోతుంది. మంగళవారం షార్జాలో జరిగిన మూడో వన్డేలో గెలిచిన ఆఫ్ఘనిస్తాన్ 10వ స్థానానికి ఎగబాకింది. ఆ స్థానంలో ఆఫ్ఘనిస్తాన్ కొనసాగాలంటే ఫిబ్రవరి 19న ముగిసే ఈ సిరీస్‌ను గెలవాల్సి ఉంటుంది. త్వరలో జరుగనున్న న్యూజిలాండ్, ఇంగ్లండ్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కూడా ఈ ర్యాంకులను ప్రభావితం చేస్తాయి. ఒకవేళ ఇంగ్లండ్ గెలిస్తే ఆ జట్టు రెండో స్థానంలోకి, సఫారీలు మూడో స్థానంలోకి వెళతారు. 2017 అక్టోబర్ నుంచి చూస్తే.. భారత్ వన్డే ర్యాంకింగ్‌లో అగ్ర స్థానంలోకి చేరడం ఇదే ప్రథమం.

విదేశాల్లో అతిపెద్ద విజయమిది: రోహిత్

పోర్ట్‌ఎలిజబెత్: దక్షిణాఫ్రికాలో కొనసాగుతున్న వన్డే సిరీస్‌లో భాగంగా మంగళవారం ఐదో వన్డేలో సాధించిన విజయం వన్డేల్లో భారత్‌కు అతిపెద్ద విజయం అని బుధవారం మీడియాతో అన్నాడు. ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో.. ఐదో వన్డేను 73 పరుగుల తేడాతో గెలిచిన భారత్ సిరీస్‌లో 4-1 ఆధిక్యం సాధించింది. ఈ లీడ్‌తో సిరీస్‌ను కూడా భారత్ గెలుచుకుంది. కాగా ఈ వన్డేలో శర్మ 115 పరుగులు చేశాడు. 'విదేశాల్లో భారత్ సాధించిన అతి పెద్ద విజయం ఈ సిరీస్ గెలవడం. గతంలో ఆస్ట్రేలియాలో జరిగిన సిబీ ముక్కోణం సిరీస్(2007-08) కూడా ఇదే స్థాయిలో కఠినంగా ఉన్నప్పటికి అప్పుడు గెలిచాం. నా మట్టుకు అయితే ఈ రెండు సిరీస్‌లను పోల్చడం కష్టమే. మా జట్టుకు ఈ సిరీస్ అత్యంత ముఖ్యం. తొలి మ్యాచ్ నుంచే మేము ఆధిక్యాన్ని చాటాము. ఫలితం ఇప్పుడు కనిపిస్తోంది' అని రోహిత్ శర్మ అన్నాడు. దక్షిణాఫ్రికాలో వన్డే సిరీస్‌ను గెలవడానికి 25 ఏళ్లు పట్టింది. దక్షిణాఫ్రికాలో క్రికెట్ ఆడటం అంత సులభం కాదు. అయినప్పటికి మా జట్టు విజయం సాధించడం, దీని వెనుక యువ క్రీడాకారుల ప్రతిభ ఉందని శర్మ చెప్పారు. ఆడటానికి అవకాశం దొరికిన ఆటగాళ్లంతా దక్షిణాఫ్రికా విసిరిన సవాళ్లను ఎదుర్కొనడానికి సిద్ధమయ్యారు. వన్డే సిరీస్‌లో భారత్, అత్యున్నత ప్రదర్శనతో ఆకట్టుకున్నది. ఇది మాలో ఆత్మ విశ్వాసాన్ని నింపింది అని శర్మ వ్యాఖ్యానించారు. టెస్టు సిరీస్‌పై మాట్లాడుతూ.. టెస్టు సిరీస్‌లో కూడా మా జట్టు బాగా ఆడింది. దక్షిణాఫ్రికాను చివరి టెస్టులో ఓడించింది. ఏమైనప్పటికి వన్డే సిరీస్‌లో సాధించిన విజయం చిరస్మరణీయ గుర్తుగా మిగిలిపోనుందని రోహిత్ అన్నారు.



రబాడా మ్యాచ్ ఫీజులో 15% కోత



దుబాయ్: దక్షిణాఫ్రికా పేస్ బౌలర్ కగిసో రబాడా మ్యాచ్ ఫీలో ఐసీసీ 15 శాతం కోత విధించింది. పోర్ట్ ఎలిజబెత్‌లో జరిగిన ఐదో వన్డేలో భారత ఓపెనర్ శిఖర్ ధావన్ ఔటయిన తర్వాత రబాడా, ధావనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. 8వ ఓవర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. రబాడా తన బౌలింగ్‌లో ధావన్‌ను ఔట్ చేసిన అనంతరం అమర్యాధకరంగా ప్రవర్తిస్తూ పెవిలియన్‌కు వెళుతున్న ధావనుద్దేశించి సంజ్ఞలు చేయడమేకాక, అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఈ నేపథ్యంలో ఫీల్డ్ అంపైర్లు ఇయాన్ గౌల్డ్, షువాన్ జార్జి, మూడో అంపైర్ అలీం దార్, ఫోర్త్ అంపైర్ బొంగాని జెలిలు ఆటగాళ్ల కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.1.7 కింద ఐసీసీ ఎదుట చార్జిషీట్‌ను దాఖలు చేశారు. బుధవారం ఐసీసీకి చెందిన ఆండీ పైక్రాఫ్ట్ నేతృత్వంలోని అత్యున్నత రెఫ్రీల ప్యానెల్ ఈ ఘటనపై విచారించి రబాడా మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత పెట్టడమేకాక, ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ లెవల్1 నిబంధనను అతిక్రమించాడని పేర్కొంటూ ఒక డిమెరిట్ పాయింట్‌ను ఆయన ప్రొఫైల్‌కు జత చేసింది. రబాడా ఇప్పటివరకు ఐదు డీమెరిట్ పాయింట్లను పొందాడు. రబాడా తాను చేసిన తప్పును, ప్యానెల్ విధించిన శిక్షను కూడా అంగీకరించాడు. ఒకవేళ రబాడాకు ఏడాదిలో 8 లేదా అంతకంటే ఎక్కువ డీ మెరిట్ పాయింట్లు వస్తే రెండు టెస్టులు, ఒక టెస్టు, రెండు వన్డేలు/టీ20లు లేదా నాలుగు వన్డేలు/టీ20లకు దూరమవుతాడు. ఈ రెండిట్లో ఏది ముందైతే అది అమల్లోకి వస్తుంది.

దక్షిణాఫ్రికాలో వన్డే సిరీస్ ఫలితాలు

పోర్ట్ ఎలిజబెత్: దక్షిణాఫ్రికాలో భారత్ ఆడిన వన్డే సిరీస్‌లో ఇప్పటివరకు ఒక్క సిరీస్‌ను కూడా గెలవలేదు. తొలిసారిగా 1992-93లో భారత్ సఫారీ గడ్డపై ఆడిన ఐదు వన్డేల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 5-2 తేడాతో సిరీస్ చేజిక్కించుకుంది. తిరిగి 2006-07తో దక్షిణాఫ్రికాలో పర్యటించిన భారత జట్టు 0-4 తేడాతో సిరీస్‌ను సఫారీలకు కోల్పోయింది. ఒక మ్యాచ్ రద్దయింది. తిరిగి 2011-12లో జరిగిన పర్యటనలో దక్షిణాఫ్రికా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-2 తేడాతో చేజిక్కించుకుంది. 2013-14లో జరిగిన వన్డే సిరీస్‌లో 2-0 తేడాతో సఫారీలు గెలిచారు. ఒక వన్డేలో ఫలితం తేలలేదు. ఈ అన్ని పర్యటనల్లో దక్షిణాఫ్రికాపై వరసగా మూడు వన్డేల్లో గెలవలేకపోయింది. తాజా పర్యటనలో ఈ రెండు రికార్డులను కోహ్లీ సేన సాధించింది.



కామన్‌వెల్త్ గేమ్స్ టికెట్లలో తప్పులు

సిడ్నీ: ఆస్ట్రేలియాలో గోల్డ్‌కోస్ట్ సిటీ ఆతిథ్య మిస్తున్న 2018-కామన్‌వెల్త్ గేమ్స్ ప్రారంభోత్సవం రోజుకు సంబంధించి ముద్రించిన టికెట్లలో తప్పులు దొర్లాయి. సుమారు 14వేల టికెట్లపై ప్రారంభోత్సవ రోజు ఏప్రిల్ 4 బుధవారానికి బదులు ఏప్రిల్ 4 గురువారం అని ముద్రితమైంది. ఈ విషయంపై క్రీడల నిర్వాహక చీఫ్ మార్క్ పీటర్స్ మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. టికెట్లు అమ్మే టికెటిక్ ఈ విషయాన్ని మాకు తెలిపాడు. అని పీటర్స్ వెల్లడించాడు. అయితే వీటిని పునర్ముద్రించే ఆలోచన తమకు లేదన్నాడు. తప్పును సవరించే బదులు టికెట్లు కొన్న వారందరికోసం.. ఈ టికెట్లతో ప్రారంభోత్సవం రోజు స్టేడియంలోకి రావచ్చని మేము ప్రత్యేక ప్రకటనలు జారీచేస్తాం అని పీటర్స్ వెల్లడించారు. మరోవైపు గోల్డ్ కోస్ట్ బులెటిన్ మరో సమస్యను బుధవారం బహిర్గతం చేసింది. వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, ట్రయథ్లాన్ టికెట్లలో తప్పుడు సమయం ముద్రించి పంపారని పేర్కొంది. కామన్ వెల్త్ గేమ్స్, ఒకప్పటి బ్రిటిష్ పాలిత దేశాలు స్వచ్ఛందంగా పాల్గొనే వేదిక. ప్రస్తుతం జరుగుతున్న క్రీడలు ఇరువై ఒకటవ క్రీడల ఈవెంట్. ఆస్ట్రేలియాలోని ఈశాన్య భాగంలో ఉన్న గోల్డ్ కోస్ట్ పట్టణంలో ఏప్రిల్ 4 నుంచి 15 వరకు జరుగనున్నాయి.

కామన్‌వెల్త్ గేమ్స్‌కు రుడిషా, ఆస్బెల్ దూరం

నైరోబి: 800 మీటర్ల పరుగులో కెన్యా ఒలింపిక్ ఛాంపియన్, ప్రపంచ రికార్డు సాధించిన ఆటగాడు డేవిడ్ రుడిషా, 1500 మీటర్ల పరుగులో రెండు సార్లు ఒలింపిక్ ఛాంపియన్ అస్బెల్ కిప్రాప్ ఆస్ట్రేలియాలో ఏప్రిల్ 4-15 మధ్య జరుగనున్న కామన్‌వెల్త్ గేమ్స్‌కు దూరంగా ఉండాలనుకుంటున్నారు. శనివారం నైరోబిలో ఒకరోజు శిక్షణకోసం 170 మంది కూడిన ఆదేశ అథ్లెట్ల జట్టును కెన్యా బోర్డు ఆహ్వానించింది. ఈ శిక్షణలో తొలి 3స్థానాల్లో నిలిచిన అథ్లెట్లు ఆటోమేటిక్‌గా కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఎంపికవుతారు. అయితే కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వహిస్తున్న సమయం వేసవి ప్రారంభకాలం కావడంతో ఇది ట్రాక్ శిక్షణకు అనుగుణంగా ఉండదని అథ్లెట్లు భావిస్తున్నారు. ఈ ఈవెంట్‌లో ఆడటమా లేదా ఈ సీజన్ అనంతరం వచ్చే పోటీలకోసం ప్రాక్టీస్‌కే పరిమితం కావడమా అన్న సందిగ్ధంలో పడ్డారు. రుడిషా, కిప్రాప్‌లు మేలో దోహాలో జరుగనున్న అత్యం పారితోషకం లభించే డైమండ్ లీగ్‌పై తమ దృష్టిని కేంద్రీకరించారని కెన్యా జట్టు అధికారులు వెల్లడించారు. ఈ శిక్షణకు గైర్హాజరైన వారిలో ప్రపంచ అథ్లెట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 10వేల మీటర్ల పరుగులో రజత పతక విజేత జెఫ్రీ క్యామ్‌వొరర్ ఉన్నాడు. జెఫ్రీ మార్చి 24 వ్యాలెన్సియాలో ప్రపంచ హాఫ్ మారథాన్‌కోసం సిద్ధమవుతున్నాడు. కాగా మహిళల 1500 మీటర్ల పరుగులో ఒలింపిక్, ప్రపంచ ఛాంపియన్ ఫెయిత్ చెప్నిజిటిక్ కిప్యెగొన్ గర్భంతో ఉండటంతో కామన్‌వెల్త్ క్రీడల్లో ఆడలేక పోతున్నారు. ప్రపంచ హాఫ్ మహిళా మారథాన్ డిఫెండింగ్ ఛాంపియన్ పెరెస్ జెప్‌చిర్చిర్ కూడా మెటర్నిటీ సెలవులో ఉండగా, మహిళా 800 మీటర్ల పరుగులో ఛాంపియన్ జానెత్ జెప్‌కోస్గెయ్ తన తొలి బిడ్డకు జన్మనిచ్చిన అనంతరం తిరిగి క్రీడల్లోకి అడుగిడనుంది. 2014 గ్లాస్కోలో జరిగిన కామన్ వెల్త్ గేమ్స్‌లో కెన్యా పతకాల పట్టికలో 10 స్వర్ణాలు, 10 రజతాలు, 5 కాంస్య పతకాలతో అగ్ర భాగాన నిలిచింది.

ముంబైలో ఈ నెల 10,11 తేదీల్లో 23వ ఏసియన్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ బంగారు పతకాలు గెలుచుకున్న ఖమ్మం జిల్లా, కల్లూరు చెందిన గురుకుల పాఠశాల విద్యార్థులు.



జాతీయ సీనియర్ మహిళా ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్

తమిళనాడు విజేత



కటక్: జాతీయ సీనియర్ మహిళా ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ లో భాగంగా బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తమిళనాడు జట్టు డిఫెండింగ్ ఛాంపియన్ మణిపూర్‌ను 2-1 గోల్స్ తేడాతో ఓడించి టైటిల్‌ను గెలుచుకుంది. తమిళనాడు ఫుట్‌బాల్ చరిత్రలోనే ఆ రాష్ట్ర మహిళ జట్టు ఛాంపియన్‌షిప్‌ను గెలవడం ఇదే ప్రథమం. ఆట ప్రథమార్థం మూడో నిమిషంలో తమిళనాడు క్రీడాకారిణి ఇందు మతి తొలి గోల్ చేయగా, ఆట 40వ నిమిషంలో ఇంద్రాని రెండో గోల్‌ను చేసింది. కాగా మణిపూర్ క్రీడాకారిణి రతన్‌బాల ఆట 57వ నిమిషంలో తన జట్టుకు గోల్‌చేసి తమిళనాడు ఆధిక్యాన్ని 2-1 తగ్గించింది. ఇందుమతి ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్ అవార్డుతో పాటు, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా అవార్డును పొందింది. ఆట ఆద్యంతం ఇందుమతి ప్రత్యర్థి గోల్ పోస్ట్ పై దాడులను కొనసాగించింది. మణిపురి డిఫెన్సివ్ ఆటగాళ్లు ఇందుమతిని నిలువరించడానికి ప్రయత్నించినప్పటికి వారిని ఛేదించుకొని ఇందుమతి బంతిని గొల్ పోస్ట్‌వైపు మళ్లించింది. అనంతరం కోలుకున్న మణిపూర్ క్రీడాకారిణులు తమిళనాడు గోల్ పోస్ట్‌లపై దాడులను సాగించారు. మణిపూర్‌కు చెందిన బాలా దేవి ఆట 25 నిమిషంలో బంతిని గోల్ చేయడానికి ప్రయత్నించగా గోల్ కీపర్ అడ్డుకుంది. అనంతరం రతన్‌బాలకూడా బంతిని గోల్‌వైపు కిక్ చేయగా అది నేరుగా గోల్ కీపర్ చేతుల్లోకి వెళ్లింది. ఆట అర్థ సమయం గడిచేసమయానికి మణిపూర్ స్కోరును సమానం చేయడానికి అత్రుత పడింది. తమిళనాడు క్రీడాకారిణి ఇంద్రాణి మరో గోల్ చేయగా తమిళనాడు 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆట రెండవ భాగంలో 57వ నిమిషంలో మణిపూర్ క్రీడాకారిణి రతన్‌బాలపుంజుకుని తమిళనాడు డిఫెన్సివిను దాటుకుని గోల్ చేయడంతో తమిళనాడు ఆధిక్యం 2-1కు తగ్గింది. అనంతరం ఇరుజట్లు గోల్స్ చేయటానికి ప్రయత్నించినప్పటికి అవి సక్సెస్ కాలేకపోయాయి.

విజేత జట్టుకు ఏఐఎఫ్ఎఫ్ ఉపాధ్యక్షుడు సుబ్రతా దత్త భినందనలు

ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎఫ్ఎఫ్ ఉపాధ్యక్షుడు సుబ్రతా దత్త టైటిల్ గెలిచిన తమిళనాడు జట్టుకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. దేశంలో మిగతా జట్లు తమిళనాడునుంచి స్ఫూర్తిని పొందాలని తెలిపాడు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.